ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ
epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
ఒంగోలు
fb.com/vaartha Digital
Published from Ongole, Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
27-8-2025 బుధవారం సంపుటి: 31 సంచిక: 207 పేజీలు: 12 వెల: 6.50

'ఓట్లచోరీ'పై ఇసి ప్రజాభిప్రాయం
ప్రధాని మోడీ, పుతిన్‌కు చైనా అధ్యక్షుని ఆహ్వానం
9లో



## శుభాకాంక్షలు

వినాయక చవితి పర్వదినం సందర్భంగా మా పాఠకులు, ప్రకటనకర్తలు, ఏజెంట్లు, శ్రేయోభిలాషులకు శుభాకాంక్షలు.

-డా. గిరీష్ కుమార్ సంఘీ
'వార్త' చైర్మన్ &మేనేజింగ్ డైరెక్టర్

**సెలవు**
పండుగ సందర్భంగా బుధవారం 'వార్త' కార్యాలయానికి సెలవు. గురువారం సంచిక వెలువడదు. పునర్దర్శనం 29వ తేదీ శుక్రవారం

# సకాలంలో రైతు రుణాలు

## కౌలు రైతుల పట్ల మానవీయ కోణంలో ఆలోచించాలి
## అవసరం తీరిన తర్వాత అప్పు ఇస్తే ఉపయోగం లేదు..
## ఎస్ఎల్‌బిసి సమావేశంలో సిఎం చంద్రబాబు


మంగళవారం ఎస్ఎల్‌బిసి సమావేశంలో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు నాయుడు

**విజయవాడ,ఆగస్టు26,ప్రభాతవార్తప్రతినిధి:** రైతుల ప్రయోజనాలకు అత్యంత ప్రాధాన్యతను ఇచ్చే దిశలో బ్యాంకర్లు ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. వ్యవసాయరుణాల మంజూరు విషయంలో జాప్యంచేయడం మంచిది కాదన్నారు. కౌలు రైతుల విషయంలో మానవీయ కోణంలో ఆలోచించాలన్నారు. సీజన్ ఆఖరులో రుణాలు ఇవ్వటం వల్ల రైతులకు ఎలాంటి ఉపయోగం లేదని రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. వ్యవసాయం, ప్రాథమిక రంగాలు, ఎంఎస్ఎంఇ, ఎస్‌హెచ్‌జి రంగాలకు రుణ వితరణ లక్ష్యాలు గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకింగ్ సేవలపై 232వ సమావేశంలో సమీక్షించారు. ఈ సమావేశంలో 231 ఎస్ఎల్‌బిసిలో తీసుకున్న నిర్ణయాలపై యాక్షన్ టేకెన్ రిపోర్టుపై సిఎం ఆరాతీశారు. వన్ ఫ్యామిలీ వన్ ఎంట్రపెన్యూర్ కార్యక్రమం, 175 నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఇ పార్కుల ఏర్పాటు అంశంలో బ్యాంకుల సహకారంపై చర్చించారు. ఎస్ఎల్‌బిసి సమావేశాలు రైతులు, ప్రజలు, ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా నిర్ణయాలు ఉండాలనితెలిపారు. ఎస్ఎల్‌బిసి సమావేశాలు రైతులు, ప్రజలు, ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా నిర్ణయాలు ఉండాలన్నారు. రివాజు సమావేశాల వల్ల ఎలాంటి ప్రయోజనం లేదు,ఖరీఫ్ తరుణంలో ఇప్పటి వరకు బ్యాంకులు వ్యవసాయ రుణాలు ఇవ్వకపోవడం ఎంత వరకు సమంజసమో ఆలోచించాల్సి ఉంది. ఈ పాటికే రైతులకు రుణాలు, ఇన్ పుట్ ఇవ్వాల్సి ఉంది. పెట్టుబడిఅవసరాలకు రైతుకు అవసరమయ్యే బ్యాంకులను ఆశ్రయిస్తారన్నారు. అటువంటి >>2

# వచ్చే యేడాదికల్లా మరో 4 పోర్టులు

## రోడ్డు,రైలు మార్గాలతో అనుసంధానం

**విజయవాడ,ఆగస్టు26,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న రామాయపట్నం, మూలపేట, మచిలీపట్నం, కాకినాడ గేట్‌వే పోర్టుల పనులను వేగంగా పూర్తి చేసి 2026 నాటికి వాటిని వినియోగంలోకి తేవాలని అధికారులకు ప్రభుత్వం లక్ష్య నిర్దేశనం చేసింది. ఇందుకు సంబంధించి సిఎంఒసమగ్ర సమాచారం విడుదల చేసింది.. పోర్టులను అనుసంధానిస్తూ రోడ్డు, రైలు మార్గాల కనెక్టివిటీ ప్రాజెక్టులను ఏపీ ప్రభుత్వం ప్రతిపాదించింది. పొరుగు రాష్ట్రాలకు కూడా పోర్టు సేవలు విస్తరించేలా ప్రతిపాదనలు రెడీ చేసింది. దీనికోసం తెలంగాణ, ఒడిశాల్లో డ్రైపోర్టులు ఏర్పాటు చేసి, అక్కడి నుంచి పోర్టులను అనుసంధానించే ప్రతిపాదనలను రూపొందించింది. సముద్ర తీరం వెంట ప్రతి 50 కిలోమీటర్లలకు పోర్టు, ఆధారిత పరిశ్రమల ఏర్పాటు ద్వారా మొత్తంగా 20 పోర్టులను అందుబాటులోకి తేవాలని ప్రభుత్వం ఆలోచిస్తోంది.

**రామాయపట్నం పోర్టు**

రామాయపట్నం పోర్టు నిర్మాణ పనులు 69 పూర్తయ్యాయి. వచ్చే ఏడాది జూన్ నాటికి ఈ పోర్టును వినియోగంలోకి తేవాలని ప్రభుత్వం ఆలోచిస్తోంది. అయితే, భారీ సైజు నౌకల రాకపోకలకు వీలుగా ప్రస్తుతం ప్రతిపాదించిన డ్రెడ్జింగ్‌ను 16 నుంచి 18.5 మీటర్లకు పెంచాలంటూ నిర్మాణ సంస్థ ప్రతిపాదన చేసింది. ఈ >>2

# మరో రెండు రోజులు వర్షసూచన

**విజయవాడ,ఆగస్టు26,ప్రభాతవార్తప్రతినిధి:** ఒడిశా తీరానికి ఆనుకుని వాయువ్య బంగాళాఖాతంలో అల్పపీడనం కొనసాగుతోందని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. ఇది రాబోయే 2 రోజుల్లో పశ్చిమవాయువ్య దిశగా కదిలి మరింత బలపడే అవకాశం ఉందన్నారు. దీని ప్రభావంతో రేపు ఉత్తరాంధ్రలో అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. తీరం వెంబడి గంటకు 40-60 కిమీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం >>2


వరల్డ్‌బుక్ రికార్డు నిర్వహకులు అందించిన ధృవీకరణ పత్రం,మట్టి వినాయక ప్రతిమలతో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్,జిల్లా కలెక్టరు లక్ష్మీశ

# పర్యావరణ 'చవితి' జరుపుకొందాం

## మట్టి గణపతి ప్రతిమలనే పూజించండి
## మండపాలకు ఉచిత కరెంటు, అనుమతులు
## విజయవాడలో 7,730 గణేశ ప్రతిమలతో ప్రపంచ రికార్డు
## రాష్ట్ర ఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్

**విజయవాడ,ఆగస్టు26,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ హెడ్ క్వార్టర్ జిల్లా ఎన్టీఆర్ డిస్ట్రిక్ మరో ప్రపంచ రికార్డును సాధించింది. పర్యావరణహిత గణేష్ చతుర్థిని జరుపుకునేలా ప్రజలను ప్రోత్సహించేందుకు సరికొత్త ప్రపంచరికార్డును సొంతం చేసుకుంది. ఆరోగ్య ఆంధ్ర లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన యోగాంధ్ర మాసోత్సవాల్లో రెండు ప్రపంచ రికార్డులను సాధించిన ఘనత ఎన్టీఆర్ జిల్లాది.ఈ క్రమంలో శ్రీవినాయక చవితి ఉత్సవాల్లో ఏకో లార్డ్ గణేష్ ప్రతిమలకు ప్రాధాన్యతను కల్పించే దిశలో వరల్డ్ రికార్డును దక్కించుకుంది.అయిదువేల పర్యావరణహిత మట్టి ప్రతిమల తయారీని లక్ష్యంగా నిర్దేశించుకోగా 7,730 ప్రతిమల తయారీతో రికార్డును కైవసం చేసుకుంది. గతంలో మహారాష్ట్రలో 4,464 ఎకో ఫ్రెండ్లీ వినాయక ప్రతిమలతో రికార్డు నమోదు కాగా.. మంగళవారం జిల్లా అధికార యంత్రాంగం, విజయవాడ నగరపాలక సంస్థ, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో చేసిన ప్రయత్నం కొత్త రికార్డును లిఖించినట్లు వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ (డబ్ల్యూబీఆర్‌లండన్) భారత దక్షిణాదిజాయింట్‌సెక్రటరీ డా. యు. ఇలి >>2

# ఆత్మనిర్భరత దిశగా ఐఎన్ఎస్ ఉదయగిరి,హిమగిరి

## రెండు దేశీయ యుద్ధ నౌకలను జాతికి అంకితం చేసిన రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్
## ఈ నౌకలతో భద్రతా వ్యవస్థ బలోపేతం
## మన నావికాదళ సామర్థ్యం మరింత పెరిగింది: రాజ్‌నాథ్




మంగళవారం విశాఖపట్నంలో ఐఎన్ఎస్ ఉదయగిరి, ఐఎన్ఎస్ హిమగిరిని జాతికి అంకితం చేస్తున్న రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్

**విశాఖపట్నం, ఆగస్టు 26 ప్రభాతవార్త:** ఆపరేషన్ సింధూర్ ఇంకా మిగిలిలేఉందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. సోమవారం ఐఎన్ఎస్ ఉదయగిరి, ఐఎన్ఎస్ హిమగిరి జాతికి అంకితం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆయుధాలు, టెక్నాలజీతో కూడిన ఈ నౌకలు, సముద్ర కార్యకలాపాల యొక్క పూర్తిస్పెక్ట్రంలో జాతీయ ప్రయోజనాలను పరిరక్షించే ఇంకా తయారు చేయబడ్డాయని చెప్పారు. నావికాదళ సామర్థ్యాన్ని పెంపొందించడానికి ఉపయోగపడతాయి అన్నారు. "ఆత్మనిర్భరత ఇకపై కేవలం నినాదం కాదు అని, అది భూమి వాస్తవికతగా మారుతోంది అని భవిష్యత్ దృక్పథంలో సాయుధ దళాలను బలోపేతం చేస్తామన్నారు. స్వదేశీ ఫ్రంట్‌లైన్ సర్ఫేస్ కంబాటెంట్‌లను ఒకేసారి ప్రవేశపెట్టడం ఇదే మొదటిసారి అని చెప్పారు. ఈ యుద్ధనౌకలు భద్రతా వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు సముద్ర ప్రయోజనాలను కాపాడటమే కాకుండా, మానవతా సహాయం విపత్తు సహాయ కార్యకలాపాలలో కూడా సహాయపడతాయని రక్షణ మంత్రి విశ్వాసం వ్యక్తం చేశారు. భారతదేశం యొక్క మహాసాగర్ (ప్రాంతంలోని అందరికీ భద్రత, వృద్ధి కోసం పరస్పర సమగ్ర పురోగతి)విధానాన్ని ఈ కమిషన్ బలోపేతం చేస్తుందని ఆయన పేర్కొన్నారు. "భారత నావికాదళ సామర్థ్యాన్ని పెంచే ఈ యుద్ధనౌకలు, భారతదేశం తన సముద్ర సరిహద్దులను రక్షించుకోగల పూర్తి సామర్థ్యాన్ని కలిగి ఉందని ఏదైనా పరిస్థితికి వెంటనే స్పందించడానికి సిద్ధంగా ఉందని సందేశాన్ని పంపుతాయి" అని ఆయన అన్నారు. ఆత్మనిర్భర్ నావికాదళం ఐఎన్ఎస్ ఉదయగిరి, ఐఎన్ఎస్ హిమగిరి ప్రాజెక్ట్ 17 (శివాలిక్ తరగతి) యొక్క సక్సెసర్ క్లాస్ యొక్క లీడ్ షిప్ అయిన ఐఎన్ఎస్ నీలగిరిని అనుసరిస్తాయి అని చెప్పారు. అవి మెరుగైన స్టెల్త్ ఫీచర్లు, తగ్గించబడిన రాడార్ సంతకాలు, అధునాతన నిఘా రాడార్లు ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ సూట్‌లు, సూపర్‌సోనిక్ ఉపరితలం నుండి ఉపరితలం క్షిపణులు, ఉపరితలం నుండి గాలికి క్షిపణులు, రాపిడ్‌ఫైర్ గన్ సిస్టమ్‌లను కలిగి ఉంటాయి అన్నారు. రెండు నౌకలలో కంబైన్డ్ డీజిల్ లేదా గ్యాస్ ప్రొపల్షన్ ప్లాంట్లు అత్యాధునిక ఇంటిగ్రేటెడ్ ప్లాట్‌ఫామ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ఉన్నాయి, ఇవి అధిక వేగం మరియు మెరుగైన ఇంధన సామర్థ్యాన్ని కలిగి ఉంటుందన్నారు. భారత నావికాదళానికి చెందిన వార్‌షిప్ డిజైన్ బ్యూరోద్వారా అంతర్గతంగారూపొందించిన 100,101వ యుద్ధనౌకలుగా భారతదేశంలో నిర్మించ >>2

# ఐపిఎస్ అధికారి సునీల్‌కుమార్ సస్పెన్షన్ పొడిగింపు



**విజయవాడ,ఆగస్టు26,ప్రభాతవార్తప్రతినిధి:** ఐపిఎస్ అధికారి పివి సునీల్‌కుమార్ సస్పెన్షన్‌ను వచ్చే ఏడాది ఫిబ్రవరి 24 వరకు పొడిగిస్తూ ఎపి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ అనుమతి లేకుండా విదేశీ పర్యటనలకు వెళ్లారన్న అభియోగాలు నిరూపణ కావడంతో ఆయన్ను ఇప్పటికే ప్రభుత్వం సస్పెండ్ చేసింది. మరో రెండు రోజుల్లో >>2




# టిడిఆర్ బాండ్ల స్కాంలో సీనియర్ ఐఎఎస్ అధికారిణి హస్తం

## ఆమె వేల కోట్లు దోచుకున్నారు..
## వైఎస్సార్సీ నేత భూమన సంచలన ఆరోపణలు



**తిరుపతి,ఆగస్టు 26ప్రభాతవార్తప్రతినిధి:** టిడిఆర్ బాండ్ల కుంభకోణంలో సీనియర్ ఐఎఎస్ అధికారిణి ప్రమేయం ఉందని, ఆమె వేలకోట్లు దోచుకున్న అవినీతి అనకొండ అంటూ వైఎస్సార్సీ ఉమ్మడిచిత్తూరుజిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డి సంచలనవ్యాఖ్యలు చేశారు. టిడిఆర్ బాండ్ల విషయంలో ఎలాంటి విచారణకైనా తాను సిద్ధమని సవాల్ విసిరారు, రెండేళ్లుగా తన మనసులో ఉన్న అభిప్రాయాన్ని ఇప్పుడు బయటపెడుతున్నానని భూమన మంగళావారం స్పష్టం చేశారు. గతంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో పనిచేసిన సదరు ఐఎఎస్ అధికారిణికి డబ్బుసంపాదించాలనే ఆశయం తప్ప నైతిక విలువలు లేవని ఆరోపణలు చేశారు. ఆమె శాఖకు సంబంధించిన మంత్రులను సైతం ఆమె >>2

# తిరుపతి నుంచి భూమనను తరిమి కొట్టండి

## శ్రీవారి ధనం కోట్లు దోచేశాడు
## దేవలోక్ స్థలాన్ని వెనక్కి తీసుకుంటాం
## టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు ఘాటు వ్యాఖ్యలు



**తిరుపతి, ఆగస్టు 26 ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల తిరుపతి దేవస్థానం పవిత్రతను కాపాడటానికి అంకిత భావంతో, చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని, టిటిడిపై దుష్ప్రచారం, బురదజల్లడమే పనిగా పెట్టుకున్న వైఎస్సార్సీ నేత, టిటిడి మాజీచైర్మన్ భూమన కరుణాకరరెడ్డిని తిరుపతి నుండి తరిమికొట్టాలని టిటిడి చైర్మన్ బిఆర్‌నాయుడు సంచలన వ్యాఖ్యలు చేశారు. గత ప్రభుత్వంలో టిటిడి చైర్మన్‌గా పనిచేసిన భూమన కోట్లాదిరూపాయలు టిటిడి ధనాన్ని దోచేశాడని, పలురకాలుగాకమీషన్లు నొక్కేశారని ఘాటైన వ్యాఖ్యలుచేశారు. ఆధ్యాత్మిక నమూనాల నిర్మాణాలకోసం అలిపిరివద్ద దేవలోక్‌కు స్థలాన్ని కేటాయించా >>2

# చెవిరెడ్డికి బెయిలు ఇవ్వొద్దు

## కౌంటరు దాఖలు చేసిన సిట్

**విజయవాడ,ఆగస్టు 26,ప్రభాతవార్త ప్రతినిధి:** మద్యం కుంభకోణంలో వైఎస్సార్సీనేత చెవిరెడ్డి భాస్కరరెడ్డి కీలక సూత్రధారిఅని, అతనికి బెయిలు ఇవ్వొద్దని సిట్ పేర్కొంది. మధ్యంతర, రెగ్యులర్ బెయిళ్ల కోసం చెవిరెడ్డి దాఖలు >>2

# లిక్కర్ కుంభకోణం: 12 మంది నిందితులకు రిమాండ్ పొడిగింపు

**విజయవాడ, ఆగస్టు 26.ప్రభాతవార్తప్రతినిధి:** మద్యం కుంభకోణం కేసులో 12 మంది నిందితులకు సెప్టెంబర్ 3వ తేదీ వరకు ఏసీబీ కోర్టు రిమాండ్ పొడిగించింది. ఈ మేరకు ఏసీబీ కోర్టు మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. రిమాండ్ పొడిగించిన నేపథ్యంలో 12 మంది నిందితులను వివిధ జైళ్లకు పోలీసులు తరలిస్తున్నారు. ఈ కేసులో వైసీపీ ఎంపీ పి. మిథున్ రెడ్డిని రాజమండ్రి సెంట్రల్ జైలుకు పోలీసులు తరలించారు. మిగిలిన 9 మంది నిందితులను విజయవాడ జైలుకు పంపించారుజమరో ఇద్దరు నిందితులను గుంటూరు జైలుకు పోలీసులు తరలించారు. ఇక ఈ కేసులో కీలక ఆరోపణలు ఎదుర్కొంటున్న నిందితుడు రాజ్ కసిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. తనపై నమోదైన కేసును ఆయన ఖండించారు. కస్టోడియల్ విచారణ అని సిట్ తనను అరెస్ట్ >>2

27-08pg2exHMNWJQE 2nd_27-08pg2exHMNWJQE.qxd 8/27/2025 12:05 AM Page 1





మంగళవారం గుజరాత్‌లోని హన్సాల్‌పూర్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన ప్రధాని మోడీ

# ఐఎఎస్ అధికారిణి హస్తం

>> కనీసం లెక్కచేయలేదని, క్రింది స్థాయి అధికారుల పట్ల తాటకిలా వ్యవహరించారని తీవ్ర విమర్శలు గుప్పించారు. తిరుపతిలో మాస్టర్‌ప్లాన్ రోడ్లు వేస్తున్న సమయంలో టిడిఆర్ బాండ్ల ద్వారా భారీగా దోచుకోవాలని ఆమె ప్రణాళిక వేశారని, అయితే తాము దానిని అడ్డుకున్నామని భూమన వెల్లడించారు. ఈ విషయం తట్టుకోలేక సదరు అధికారిణి నెల్లూరు జిల్లా నేతలకు తప్పుడు సమాచారం అందించి, తాను 2వేల కోట్లు దోచుకున్నాననంటూ అబద్ధపు ప్రచారం చేయించారని భూమన గద్గద స్వరంతో ఆరోపించారు. తాను ఒక్కరూపాయి అవినీతికి పాల్పడినట్లు నిరూపించినా ఎలాంటి శిక్షకైనా సిద్ధమని ఆయన సవాల్‌విసిరారు. ఆమె 35ఏళ్ల సర్వీసులో ఎక్కడ పనిచేసినా వందల, వేలకోట్లు రూపాయలు లూటీ చేశారని, ఆమె అవినీతి గురించి సుప్రీం కోర్టుకు కూడా తెలుసని భూమన వ్యాఖ్యానించడం సంచలనంగా మారింది. ఆ ఐఎఎస్ అధికారిణి రోజూ ధరించే చీర 1.50లక్షలు రూపాయలు విలువ చేస్తుందని, వేలరూపాయలు విలువచేసే 11విగ్గులు ఆమె వద్ద ఉన్నాయని వ్యక్తిగత ఆరోపణలు చేశారు. నీతిగా నిజాయితీగా ఉన్న తనపై కక్షగట్టి కుట్రపూరితంగా అసత్య ప్రచారం చేయిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తిరుపతిలో 21 మాస్టర్‌ప్లాన్ రోడ్లువేసి అభివృద్ధిచేశామనేది సత్యమని కరుణాకర్‌రెడ్డి గుర్తుచేశారు.

**బిజెపి భాను ఖండన:**

కాగా భూమన వ్యాఖ్యలను టిటిడి బోర్డుసభ్యుడు, బిజెపిరాష్ట్ర అధికారప్రతినిధి భానుప్రకాశ్‌రెడ్డి ఖండించారు. మహిళ ఐఎఎస్ అధికారిణిని విమర్శిస్తూ కరుణాకర్‌రెడ్డి వీడియో విడుదల చేయడం దారుణమన్నారు. టిడిఆర్ బాండ్ల కుంభకోణంలో ఆమె పాత్ర ఉందంటూ ఆరోపణలు చేస్తున్నారన్నారు. కరుణాకర్‌రెడ్డి రాజకీయ నిరుద్యోగిగా మారారని, ఆయన ఎన్నికల్లో ఓటమిపాలైన తరూవాత మానసిక పరిస్థితి సరిగా లేనట్లుందని ఘాటుగా వ్యాఖ్యనించారు. ఆమెపై ఆయన అనుచిత పదజాలంతో విరుచుకుపడటం భాను తీవ్రంగా తప్పుపట్టారు.

# భూమనను తరిమి కొట్టండి

>> రని, తిరుమల పవిత్రతను దెబ్బతీసేలా ఒబెరాయ్ హోటల్‌కు స్థలాన్ని కేటాయించింది గత వైఎస్సార్సీనే అని విమర్శించారు. ముంతాజ్‌హోటల్ వ్యవహారంపై భూమన చేసిన వ్యాఖ్యలపై మంగళవారం సాయంత్రం తిరుపతి పద్మావతి విశ్రాంతి భవనంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ బిఆర్‌నాయుడు మాట్లాడుతూ భూమన కరుణాకర్‌రెడ్డి తిరుపతిలో ఉండే అర్హత లేదని, ఆయన్ను తిరుపతి నుండి తరిమికొట్టాలన్నారు. ప్రతిరోజూ టిటిడిపై బురదజల్లడానికి ప్రయత్నిస్తున్నార న్నారు. టిటిడిపై బుదరజల్లితే ఊరుకునేది లేదని తేల్చిచెప్పారు. ఆధ్యాత్మిక నమూనాల నిర్మాణాల కోసమే దేవలోక్‌కు స్థలాన్ని కేటాయించారన్నారు. 2024 నవంబర్ 18న టిటిడి బోర్డు సమావేశంలో ఒబెరాయ్‌కు కేటాయించిన స్థలాన్ని వెనక్కుతీసుకోవాలని తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపినట్లు ఛైర్మన్ తెలిపారు. భూమికి బదులు భూమి ఇవ్వాలని కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. ఒబెరాయ్ హోటల్‌కు ప్రస్తుతం అలిపిరి జూపార్కురోడ్డులో దక్షిణవైపు స్థలాన్ని కేటాయించామని తెలిపారు. ఉత్తరదిక్కున వద్దని సిఎం చెప్పడమేగాక ఆధ్యాత్మికపుణ్యక్షేత్ర పవిత్రతను కాపాడేందుకు చూస్తున్నామన్నారు. ఈ విషయంలో భూమన ప్రజలను తప్పుదోవపట్టిస్తున్నాడని ఆరోపించారు. సిబిఐ విచారణ అని చెప్పడానికి భూమనకు సిగ్గులేదన్నారు. కోట్లురూపాయలు టిటిడి ధనాన్ని నొక్కేసిన ఘనుడు భూమన అని ఆరోపించారు.దేవలోక్ నిర్మాణం కోసం స్థలాన్ని లీజుకు తీసుకున్న అజయ్‌కుమార్‌ను జగన్ తాడేపల్లికి పిలిపించి గన్‌పెట్టి బెదిరించారని మరో సంచలన వ్యాఖ్యలు చేశారు. దేవలోక్‌కు కేటాయించిన 10 ఎకరాల స్థలాన్నివెనక్కు తీసుకుంటామన్నారు. తిరుమల పవిత్రతకు ఎక్కడా భంగం వాటిల్లకుండా కూటమి ప్రభుత్వం, టిటిడి ధర్మకర్తలమండలి చూస్తుందన్నారు. తిరుమలలో ముంతాజ్ హోటల్ నిర్మాణం సరైంది కాదని సిఎం చంద్రబాబు తెలిపారన్నారు. గత ఏడాదిలో టిటిడిలో అవినీతికి తావులేకుండా పాలన సాగిస్తున్నామన్నారు.

# సకాలంలో రైతు రుణాలు

>> సీజన్ ఆఖరులో రుణాలు ఇవ్వటం వల్ల రైతులకు ఎలాంటి ఉపయోగం లేదన్నారు. మారుతున్న ప్రపంచానికి అనుగుణంగా బ్యాంకర్లూ తమ తీరు మార్చుకోవాల్సి ఉంది. జిఎస్టీలో సంస్కరణల్ని కేంద్రం తీసుకువచ్చింది. నెక్స్ట్ జనరేషన్ సంస్కరణలు వచ్చేస్తున్నాయి. బ్యాంకులు, పబ్లిక్ పాలసీలు ఎప్పుడూ ప్రజల్ని నియంత్రించకూడదు. తదుపరి సంస్కరణల దిశగా ప్రోత్సహించాలి. అమెరికా, చైనా లాంటి దేశాలకు సవాలు విసిరేలా మన ఆర్థిక వ్యవస్థ తయారు అవుతోంది. బ్యాంకులు, ఆర్థిక సంస్థలు కొత్త ఆవిష్కరణల దిశగా ఆలోచనలు చేయాలి. 2047 నాటికి బలమైన ఆర్థిక వ్యవస్థగా భారత్ తయారవుతుంది. ఫాల్స్ లెండింగ్ చేయాలని ఎవరూ సిఫార్సు చేయరు, ఉత్పాదకత లేని రుణాలు కూడా మంచివి కావు. పేదలు ధనికుల మధ్య అంతరాలు తగ్గేందుకు అవసరమైన చర్యలనూ చేపట్టాలి.ఆర్థికశాస్త్రం చదివిన విద్యార్థిగా, ప్రజాప్రతినిధిగా పేదల గురించి నేను ఆలోచన చేస్తున్నాను. ఖరీఫ్‌లో ఇప్పటికే సగం గడిచిపోయింది. రోటీన్ సమావేశాలవల్ల ఎలాంటి ప్రయోజనం లేదు, ఇండికేటర్లు కూడా రోటీన్‌గా మారుతున్నాయని సిఎం వ్యాఖ్యానించారు. వ్యవసాయం స్థానంలో హార్టికల్చర్ సాగు వస్తుందని దీన్ని దృష్టిలో పెట్టుకుని బ్యాంకులు రైతులకు విరివిగా రుణాలు ఇవ్వాలని సిఎం అన్నారు. అలాగే ఆర్థికంగా బలోపేతానికి తోడ్పడే వాణిజ్య పంటల్ని సాగుచేసే రైతులకు సాయపడాలన్నారు. అన్ని అర్హతలు ఉన్న రైతులకు బ్యాంకుకు వచ్చిన 15 నిమిషాల్లోనే రుణం ఇచ్చే పరిస్థితి రావాలన్నారు. కొన్ని సందర్భాల్లో సరైన మార్కెట్ సదుపాయాలు, మద్దతు ధర రాక పంటలు పారబోసే పరిస్థితి వస్తోందని దీన్ని నివారించేందుకు బ్లాక్ చెయిన్ టెక్నాలజీ ద్వారా ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు.

**ఒక కుటుంబం, ఒక పారిశ్రామికవేత్త**

ఆత్మహత్యల నివారణకు అవసరమైన మార్గాన్ని అన్వేషిస్తున్నామని సీఎం అన్నారు. చనిపోయిన తర్వాత ఇచ్చే పరిహారం కంటే ఆత్మహత్యల నివారణకు ప్రభుత్వం, బ్యాంకర్లు ఏం చేయాలనే దానిపై ప్రత్యేకంగా మేధోమథనం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎంఎస్ఎంఇలకు రుణాలను కేంద్రం సరళతరం చేసిందని, బ్యాంకులు ఈ విషయంలో మరింత చొరవ చూపాలని సీఎం అన్నారు. ఒక కుటుంబం, ఒక పారిశ్రామికవేత్త అనే లక్ష్యంతో పని చేస్తున్నామని ఇది సాకారం కావాలంటే చిరు వ్యాపారులకు రుణాలు సులభతరం కావాలన్నారు. కాగా ఖరీఫ్ సీజన్‌లో రూ. 1,80,540 కోట్ల రుణ లక్ష్యానికిగానూ జూన్ నాటికి రూ. 94,666 కోట్ల మేర బ్యాంకులు రుణాలను ఇచ్చాయి. రాష్ట్ర వ్యాప్తంగా కౌలు రైతులకు రూ. 985 కోట్ల రుణాల్ని మంజూరు చేశాయి. ఎంఎస్ఎంఈ రంగానికి రూ. 49,831 కోట్లు, విద్యారంగానికి రూ. 252 కోట్లు, హౌసింగ్‌కు రూ. 1,146 కోట్ల రుణాలు మంజూరు చేశాయి. పునరుద్పాదక ఇంధన రంగానికి రూ. 125 కోట్ల మేర రుణ మంజూరు చేశారు. స్వయం సహాయ సంఘాలకు రూ. 5,937 కోట్లు, ముద్రా రుణాల కింద రూ. 3189 కోట్లు బ్యాంకులు మంజూరు చేశాయి. పిఎం సూర్యఘర్ పథకం కింద ఈ ఏడాది 20 లక్షల కుటుంబాలకు సోలార్ విద్యుత్ అందించాలని లక్ష్యం పెట్టుకున్నామని తెలిపారు. ఈ పథకం అమల్లో బ్యాంకులు కూడా భాగస్వామ్యం కావాలనికోరారు. రాష్ట్రంలో పెద్దఎత్తున గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులు రానున్నాయని వాటికి బ్యాంకులు రుణాలు ఇచ్చి సహకరించాలని సిఎం చంద్రబాబు కోరారు. రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశంలో సీఎస్ కే.విజయానంద్, ఎస్ఎల్ బిసి ఛైర్మన్ నితీష్ రంజన్, కేంద్ర ఆర్థిక విభాగం, ఆర్బీఐ, నాబార్డు, సిడ్బీ, ఎగ్జిమ్ బ్యాంక్ ఇతర బ్యాంకుల ప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# నిందితులకు రిమాండ్ పొడిగింపు

>> చేసిందని ఆరోపించారు. లిక్కర్ స్కామ్‌లో తన పాత్ర ఎక్కడా లేదని పేర్కొన్నారు. తనతప్పు ఎక్కడా లేకపోయినా.. ఆధారాలు సృష్టిం చారని రాజ్ కసిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కానీ.. ప్రస్తుతం కానీ ఇప్పటి వరకు తనపై ఒక్క కేసు కూడా లేదని గుర్తుచేశారు. ఈ ఒక్క లిక్కర్ కేసులో తప్పించి.. ఇప్పటి వరకు తాను అరెస్ట్ కాలేదన్నారు. అయితే హైదరాబాద్, శంషాబాద్‌లోని విల్లాలో లభ్యమైన రూ. కోట్లు తనవైతే.. వాటిపై తన వేలిముద్రలు ఉంటాయని వివరించారు. అయినాఅంత సొమ్ము ఒకేవ్యక్తి వద్ద ఉంటుందా? అంటూ సందేహం వ్యక్తం చేశారు. ఈ మద్యం కుంభకోణంలో సిట్ విచారించిన 300 మందిలో ఏ ఒక్కరూ తనకు తెలియదన్నారు. ఈ300 మందిలో ఒక ఐదుగురిని విచారించి.. వారికి తాను తెలుసేమో మీరే అడగండని తెలిపారు. ఈ కేసులో చాలామంది పేర్లు తాను తొలిసారిగా వింటునానని రాజ్ కసిరెడ్డి తెలిపారు. మద్యం కుంభకోణంలో కీలక ఆధారాలు లభ్యం కావడంతో.. ప్రధాన నిందితుల్లో ఒకరైన రాజ్ కసిరెడ్డి ఆస్తుల జప్తునకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రంగం సిద్ధం చేసింది. మద్యం విక్రయాలతో వచ్చిన ఆదాయంతో హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని భారీగా భూములను రాజ్ కసిరెడ్డి కొనుగోలు చేసినట్లు సిట్ అధికారులు గుర్తించారు. వాటిని సైతం జప్తు చేసేందుకు ప్రభుత్వం రంగంలోకి దిగింది.

## లిక్కర్ స్కాం కేసులో నిందితుల డిఫాల్ట్ బెయిల్ పిటిషన్!

**విజయవాడ,ఆగస్టు26,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపి లిక్కర్ స్కాం కేసులో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. డిఫాల్ట్ బెయిల్ పిటిషన్లు దాఖలు చేయాలని నిందితులు నిర్ణయించారు. 90 రోజుల జ్యుడీషియల్ కస్టడీ ముగియడంతో డిఫాల్ట్ బెయిల్ పిటిషన్ వేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ రోజు ఏ33 బాలాజీ గోవిందప్ప డిఫాల్ట్ బెయిల్ పిటిషన్ వేయనున్నారు.

**నిందితుల జ్యుడీషియల్ కస్టడీ :** ఏ1 రాజ్ కేసిరెడ్డి 126 రోజులు, ఏ6 సజ్జల శ్రీధర్ రెడ్డి 123 రోజులు, ఏ8 చాణక్య 125 రోజులు, ఏ30 దిలీప్ 117 రోజులు, ఏ31 ధనుంజయ రెడ్డి 102 రోజులు, ఏ32 కృష్ణ మోహన్ రెడ్డి 102 రోజులు, ఏ33 బాలాజీ గోవిందప్ప 105 రోజులు దాటింది.



మంగళవారం లక్నోలో విపక్షాల ఉపరాష్ట్రపతి అభ్యర్థి బి. సుదర్శన్ రెడ్డితో ఎస్పీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్

# ఐఎన్ఎస్ ఉదయగిరి,హిమగిరి

>> బద్ధాయి అని, ఇది స్వదేశీ కంటెంట్ స్వావలంబనను పెంచడానికి నేవీ యొక్క నిరంతర కృషిని కొనియాడారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కన్న ఆత్మనిర్భర్ భారత్ కల సాకారం వైపు ఒక పెద్ద ముందడుగు అని చెప్పారు. ప్రభుత్వ దార్శనికత నిబద్ధతకు నిదర్శనంగా రక్షణ మంత్రి అభివర్ణించారు. "ఐఎన్ఎస్ ఉదయగిరి ఐఎన్ఎస్ హిమగిరి ప్రభుత్వ స్వావలంబనపట్ల దృఢసంకల్పానికి ప్రకాశవంత మైనదిగా అభివర్ణించారు. బ్లూ వాటర్ నేవీ మల్టీమిషన్ ఫ్రిగేట్‌లు కీలకమైనకార్యాచరణ సహాయకులు, ఇవి సముద్ర కార్యకలాపాల యొక్క పూర్తి స్పెక్ట్రంలో జాతీయ ప్రయోజనాలను కాపాడుకునే నావికాదళ సామర్థ్యాన్ని పెంచుతాయి.

## మట్టి గణపతినే పూజించి పర్యావరణానికి హాని కలగకుండా చూడాలి: సిఎం చంద్రబాబు

**విజయవాడ.ఆగస్టు26,ప్రభాతవార్తప్రతినిధి:** గణేశ్ చతుర్థిని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున పర్యావరణ హితంగా పండుగ జరిగేలా ప్రచార కార్యక్రమాలు నిర్వహించింది. అందులో భాగంగా ప్రత్యేక సందేశాలతో రూపొందించిన పోస్టర్‌ను రాష్ట్ర సచివాలయంలో సిఎం చంద్రబాబు నాయుడి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎపిపిసిబి సభ్య కార్యదర్శి శరవణన్, ఛైర్మన్ డా.పి. క్రిష్ణయ్య పాల్గొన్నారు. సందర్భంగా మట్టి గణపతినీ, ఇంటి పెరట్లోనే నిమజ్జనం చేసుకునేలా విత్తన గణపతిని ప్రోత్సహించాలని ఎ తయారు చేసిన విగ్రహాలలో జిప్సమ్, గంధకం, ఫాస్ఫరస్, మెగ్నీషియం వంటి రసాయనాలు ఉంటాయి. అవి నీటిలో కలిసి జలాశయాలను పెద్ద ఎత్తున కలుషితం చేయడంతో పాటు జల చరాలకు ముప్పును కలగజేస్తాయి. కాబట్టి ప్రతి ఒక్కరూ మట్టి గణపతినే పూజించి పర్యావరణానికి హాని కలగకుండా చూడాలని సిఎం కోరారు.

అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి కూడా పర్యావరణానికి మేలుజరిగేలా గణేశ్ వేడుకలు జరగాలని ఆకాంక్షి.. రాష్ట్రంలోని అన్ని జోనల్, రీజనల్ కార్యాలయాలకు దాదాపు నలభై లక్షల రూపాయల నిధులుకేటాయించింది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి నియమనిబంధనలకు అనుగుణంగా నిమజ్జనం జరిగేలా అన్ని జిల్లాల కలెక్టరేట్లకు ఆదేశాలు జారీ చేసింది. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ రంగులతో తయారు చేసే విగ్రహాలతో భారీగా జరిగే నష్టాన్ని నివారించేందుకు ఎన్టీఆర్ జిల్లా అధికారులతో కలిసి కాలుష్య నియంత్రణ మండలి విజయవాడ ఇందిరా గాంధీమున్సిపల్ స్టేడియంలో ఒకేసారి ఏడున్నర వేల మట్టి గణపతుల్ని తయారు చేయిం చింది. అందుకు గానూ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డునూ సంయుక్తంగా అందుకుంది.

# మరో రెండు రోజులు వర్షసూచన

>> ఉందని, మత్స్యకారులు వేటకు వెళ్ళారాదని హెచ్చరించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. రానున్న రెండు రోజులు వాతావరణం క్రింది విధంగా ఉండనున్నట్లు విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ వివరించారు. ఈ నెల 27న అల్లూరి సీతారామరాజు, ఏలూరు జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు.

కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, మిగతా జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రఖర్ జైన్ వెల్లడించారు. మంగళవారం సాయంత్రం 6 గంటల నాటికి సాలపువానిపాలెంలో 60.2మిమీ, శ్రీకాకుళంలో 58మిమీ, విశాఖ జిల్లా నాతయ్యపాలెంలో 55.7మిమీ అనకాపల్లి జిల్లా గంధవరంలో 55.5మిమీ, లంకేలపాలెంలో 55.2మిమీ, విజయనగరం అర్బన్ 54.7మిమీ చొప్పున వర్షపాతం, 65 ప్రాంతాల్లో 40మిమీకు పైగా వర్షపాతం నమోదైందన్నారు.

# సస్పెన్షన్ పొడిగింపు

>> సస్పెన్షన్ గడువు ముగియనుండటంతో రివ్యూ కమిటీ సమీక్ష నిర్వహించింది. అగ్రిగోల్డ్ నిధుల దుర్వినియోగంపై సునీల్‌కుమార్‌పై ఎసిబి విచారణ కొనసాగుతోంది. మరోవైపు గతంలో అప్పటి ఎంపీ, ప్రస్తుత డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజును వేధించిన కేసులోనూ గుంటూరు నగరపాలెం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. సస్పెన్షన్ ఎత్తివేస్తే సాక్ష్యాధారాలు, దర్యాప్తును ప్రభావితం చేస్తారని రివ్యూకమిటీ నివేదించింది. దర్యాప్తుకీలక దశలో ఉన్నందున సస్పెన్షన్‌పొడిగించాలని సిఫార్సు చేసింది. ఈ నేపథ్యంలో తదుపరి చర్యలు తీసుకోవాలని డిజిపి ని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు సస్పెన్షన్ ఆదేశాలను పొడిగిస్తూ సిఎస్ విజయానంద్ ఆదేశాలు జారీ చేశారు.

# మరో 4 పోర్టులు

>> ప్రతిపాదనను ప్రభుత్వం అనుమతిస్తే గడువు పొడిగించే అవకాశం ఉంది. మొదటి దశలో 4 బెర్తులు నిర్మించాల్సి ఉండగా ప్రస్తుతం 1 పూర్తయింది. 3.7 కిలో మీటర్ల దక్షిణ, 1.35 కిలో మీటర్ల మేర ఉత్తర బ్రేక్ వాటర్ పనులు కొనసాగుతున్నాయి. విబీ16తో ఉమ్మడి ప్రకాశం జిల్లా చేవూరు జంక్షన్ దగ్గర అనుసంధానం చేస్తారు.

**మచిలీపట్నం పోర్టు**

2026నవంబరునాటికి మచిలీపట్నం పోర్టును పూర్తి చేయాలని టార్గెట్‌గా పెట్టుకున్నారు. ప్రస్తుతం 45.5 మేర పనులు పూర్తయ్యాయి. మొదటి దశలో 4 బెర్తులు 16 బెర్తులకు విస్తరించనున్నారు. ఈ పోర్టు ద్వారా ఏడాదికి 36 మిలియన్ టన్నుల సరకు రవాణా చేయవచ్చు. తెలంగాణలో డ్రైపోర్టును ఏర్పాటు చేసి అక్కడినుంచి మచిలీపట్నానికి సరకు చేర్చే ప్రతిపాదనలు ఉన్నాయి. బీచ్‌రోడ్డును 638 కోట్ల రూపాయలతో 6 లేన్ల రోడ్డుగా అభివృద్ధి చేసి, ఎన్‌హెచ్ 65కు అనుసంధానం చేసే ప్రతిపాదన ఉంది.

**మూలపేట పోర్టు**

మూలపేట పోర్టు 54.01 నిర్మాణ పనులు పూర్తి అయ్యాయి. 2026 మే నాటికి ఈ పోర్టును వినియోగంలోకి తేనున్నారు. ఈ పోర్టును ఏడాదికి 25 నుంచి 30 మిలియన్ టన్నులు సరకు రవాణా లక్ష్యం. ఒడిశా, ఉత్తరాంధ్ర జిల్లాల్లో డ్రై పోర్టులు నిర్మించి మూలపేట పోర్టుతో అనుసంధానం చేయనున్నారు.

# లిక్కరు కుంభకోణంలో దారి మళ్లించిన వివరాలు ఇవ్వండి: సిట్‌కు ఎసిబి కోర్టు ఆదేశం

విజయవాడ,ఆగస్టు 26,ప్రభాతవార్త ప్రతినిధి: మద్యం కుంభకోణం కేసులో ముడుపుల ద్వారా కొల్లగొట్టిన రూ.3500 కోట్లను ఎలా దారిమళ్ళించారనే అంశంలో పూర్తి వివరాలు క్రమ జాబితాలో ఇవ్వాలని విజయవాడ ఏసీబీ న్యాయస్థానం సిట్‌ను ఆదేశించింది. ఫోరెన్సిక్ నివేదికలూ పొందుపర్చాలని నిర్ధేశించింది. నిందితులజాబితాలోని సంస్థలకు సంబంధించిన ప్రతినిధులు, వారి హోదాల వివరాలన్నింటినీ సమగ్రంగా ఇవ్వాలని సూచించింది. ఈ కేసులో ఉల్లై 19న సిట్ దాఖలు చేసిన ప్రాథమిక అభియోగపత్రం లోని పలు అంశాలపై మరింత స్పష్టత,సమాచారం కోరుతూ,అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ ఏసీబీ కోర్టు సిట్‌కు సోమవారం మెమో జారీ చేసింది. మొత్తం 21 అంశాలను అందులో ప్రస్తావించింది. మూడు రోజుల్లోగా ఈ వివరాలు సమర్పించాలని దర్యాప్తు అధికారిని ఆదేశించింది.ఈ కేసులో 1988 నాటి అవినీతి నిరోధక చట్టం సెక్షన్‌లు ఎలా ప్రవర్తిస్తాయి? ఆ చట్టం లోని సెక్షన్ 19 ప్రకారం ప్రాసిక్యూషన్ కోసం కాంపిటెంట్ అథారిటీ నుంచి ముందస్తు అనుమతి తీసుకోకుండా ప్రధాన నిందితుడిపై అభియోగపత్రం దాఖలు చేయడం ఎలా అర్థమైంది?వీటిపై వివరణలు ఇవ్వండి?సీఆర్‌పీసీ 161,164 సెక్షన్ల క్రింద ఎంతమంది సాక్షుల్నివిచారించారు? ఆ జాబితా సమర్పించండి. దర్యాప్తు ఇంకా పెండింగ్‌లో ఉందని అభియోగపత్రంలో పేర్కొన్నారు. కానీ, ఇది ప్రాథమిక అభియోగపత్రమా,చివరిదా? అని ఎక్కడా పేర్కొనలేదు.ఆ సమాచామివ్వండి.ఈ కేసులో ముప్పిడి అవినాష్‌రెడ్డి(ఏ-7),బూనేటి చాణక్య (ఎ-8) టి.ఈశ్వర్ కిరణ్‌కుమార్‌రెడ్డి (ఏ-9),షేక్ సైఫ్ అహ్మద్(ఎ-10), ఓల్విక్ మల్టీవెంచర్స్(ఎ-11),క్రిపాట ఎంటర్‌ప్రైజెస్(ఎ-12),నైన్న మల్టీవెంచర్స్(ఎ-33),ట్రిఫ్పెర్ ఎంటర్‌ప్రైజెస్(ఎ-14),విక్సో ఎంటర్‌ప్రైజెస్ (ఎ-15) వారి ప్రమేయం,పాత్రపై నిర్దిష్టమైన వివరాలు అభియోగపత్రంలో పొందుపర్చండి. వీరిలో కొందరు నిందితుల్ని ఎందుకు అరెస్ట్ చేయలోదే కారణాలు తెలియచేయండి.నిందితుల్లో ఎవరెవరికి ఏ సెక్షన్ వర్తిసు_ందో విడిగాఇవ్వండి.ఇప్పటివరకూ మొత్తం ఎంతమందినిందితులు అరెస్టయ్యారు. ఎవరెవరు ఎప్పటినుంచి జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్నారు? అనే సమాధానాన్ని సమర్పించండి.

# పర్యావరణ 'చవితి' జరుపుకొందాం

>> యాజర్ ప్రకటించారు. ఈ రికార్డు సాధనకు కృషిచేసిన ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలియజేస్తున్నట్లు పేర్కొని రికార్డు సాధించినందుకు సర్టిఫికెట్‌ను, పతకాన్ని కలెక్టర్ డా. జి.లక్ష్మిశకు అందజేశారు.

మెగాఈవెంట్ సందర్భంగా జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ విద్యార్థులకు చిన్నప్పటినుంచే పర్యావరణంపట్ల బాధ్యతను గుర్తుచేసేందుకు ఈ కార్య క్రమం దోహదపడుతుందన్నారు. గణేష్ ఉత్స వాల్లో ప్రతి అంశానికీ ఓ ప్రత్యేకత ఉందన్నారు. ప్రజలు ఒకవైపు సంస్కృతి సంప్రదాయా లను కాపాడుకుంటూనే మరోవైపు పండగ లను పర్యావరణహితంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. మండపాల ఏర్పాటుకు ఉచితంగా అనుమతులతో పాటు ఉచితంగా కరెంటును రాష్ట్ర ప్రభుత్వం అందజేయడం జరుగుతోందని.. ఇందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, మంత్రి లోకేశ్‌కు ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు తెలిపారు.

విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ.. విజయవాడ అంటేనే వైబ్రెంట్ నగరమని.. చెత్త రహిత నగరం కేటగిరీలో నగరానికి సెవెన్ స్టార్ రేటింగ్ లభించిందని.. ప్రజా చైతన్యం, సమష్టి కృషివల్లే ఇది సాధ్యమైందని పేర్కొన్నారు. పర్యావరణ, ఆధ్యాత్మిక శోభతో వినాయక చవితి ఉత్సవాలను జరుపుకుందామని.. మండపాల వద్ద స్వచ్ఛతకు ప్రాధన్యమివ్వాలని సూచించారు.

విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. ఇది పర్యావరణంపట్ల ప్రజల్లో చైతన్యం తెచ్చే ఓ గొప్ప కార్యక్రమమని పేర్కొన్నారు. ప్రతిమల తయారీలో ప్లాస్టర్ ఆఫ్ పారిస్, కృత్రిమ రంగులు వంటి వాటి వినియోగం బాగా తగ్గిందన్నారు. వీటి వినియోగాన్ని జీరో చేయాల్సిన అవసరముందన్నారు. పర్యావరణ పరిరక్షణపట్ల ప్రతిఒక్కరూ బాధ్యతగా ఉండాల్సిన అవసరముందని.. పర్యావరణ పరిరక్షణతో నగరాన్ని, రాష్ట్రాన్ని, దేశాన్ని కాపాడుకుందామని పేర్కొన్నారు.

జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ మాట్లాడుతూ.... జిల్లాలో పర్యావరణ పరిరక్షణ, స్వచ్ఛతా లక్ష్యాలను చేరుకునేందుకు వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని.. వినాయక చవితి ఉత్సవాల్లో మట్టి ప్రతిమలను పూజించి ప్రకృతి శోభతో ఆధ్యాత్మిక వాతావరణంలో పండగను జరుపుకునేలా ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. సీడ్ గణేష్.. క్లే గణేష్ ప్రతిమలతో రికార్డును సొంతం చేసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో భాగస్వాములైన ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు.పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు మాట్లాడుతూ.. వినాయక మండపాల ఏర్పాటుకు ఎలాంటి రుసుము లేకుండా అనుమతులు మంజూరు చేయడం జరుగుతోందని.. ఇందుకు ప్రత్యేక యాప్ అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. శబ్ద కాలుష్యాన్ని దృష్టిలో ఉంచుకొని పండగ జరుపుకోవాలని కోరారు.

# చెవిరెడ్డికి బెయిలు ఇవ్వొద్దు

>>చేసిన పిటీషన్లపై సోమవారం ఎసిబి కోర్టులో ఈ మేరకు కౌంటర్ దాఖలు చేసింది. ముడుపులకు సంబంధించి దర్యాప్తు ఇంకా పూర్తి కాలేదని, ఈ దశలో నిందితుడికి బెయిలుఇస్తే ఆటంకంకలుగుతుందని అభ్యంతరంతెలిపింది. మధ్యంతర బెయిలు పై మంగళవారానికి, రెగ్యులర్ బెయిలుపై సెప్టెంబరు 2కు న్యాయాధికారి విచారణను వాయిదా వేశారు. వెన్ను నొప్పి తీవ్రతంగా ఉంది ప్రకృతి చికిత్సకోసంఅనుమతించాలని చెవిరెడ్డి మరో పిటీషన్‌ను దాఖలుచేశారు. మంగళవారం విచారణ నిర్వహించింది.రిమాండ్ పొడిగింపు కోసం చెవిరెడ్డిని కోర్టుకు తీసుకొచ్చి,తిరిగి తీసుకెళ్లే సమయాల్లో పోలీసులకు ఇబ్బందులు సృష్టిస్తున్నారని, వర్చువల్ విధానంలో హాజరుపర్చేందుకు అనుమతినివ్వాలని సిట్ అధికారులు మెమో దాఖలుచేశారు. దీనిపై ఆయన ఇబ్బందులకు గురిచేయరని చెవిరెడ్డి తరపున్యాయవాది కోర్టుకుఇచ్చిన హామీపత్రాన్ని న్యాయాధికారి పరిగణనలోకి తీసుకొని, సిట్ మెమోను తోసి పుచ్చారు. హైదరాబాద్‌లో సిట్‌అధికారులు స్వాధీనం చేసుకున్న రూ.11కోట్ల జమకు సంబంధించి నిందితుడు రాజ్ కెసిరెడ్డి పిటీషన్‌పై తదుపరి విచారణ ఈ నెల 28వ తేదీకి వాయిదా పడింది.

## వారం - వర్జ్యం

27-08-2025, బుధవారం (వినాయక చవితి)
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
భాద్రపద మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, శుక్లపక్షం
చవితి మ.3.47
హస్త ఉ.6.04
వర్జ్యం : మ.2.57-4.44
దు.ఉ.11.45-12.35
శుభసమయం: ఉ.9.15-10.00,సా.4.45-5.30
రాహుకాలం - మ.12.00-1.30

## వార్తాఫలం

**మేషం :** చేపట్టిన కార్యక్రమాలలో ఆటంకాలువెదురైనా అధిగమిస్తారు. శుభవార్తలు.

**వృషభం:** ఆర్థికపరిస్థితి అంతంత మాత్రంగానే ఉంటుంది. వివాదాలకు దూరంగా ఉండండి.

**మిథునం:**కుటుంబసభ్యుల నుండి సహాయ సహకారాలు అందుకుంటారు. ఇంటాబయటా ప్రోత్సాహం.

**కర్కాటకం :**అనుకోని అతిథులనుండి శుభవార్తలు అందుకుంటారు. ఆకస్మిక ధనలాభం పొందుతారు.

**సింహం:** ఒకరికి అప్పు ఇవ్వడం, మీరు మీరొకరి వద్ద అప్పుచేయడం రెండూ వద్దు.

**కన్య :** వృత్తి, వ్యాపారాలు సానుకూలంగా ఉంటాయి. ఇంటా బయటా ప్రోత్సాహం.

**తుల :**వస్తు భద్రత పట్ల విశేషమైన జాగ్రత్తలు తీసుకోవడం చెప్పదగిన సూచన.

**వృశ్చికం:** ఇంటర్వ్యూలలో అతి కష్టంమీద ఉత్తీర్ణులవుతారు. వస్తువులు కొనుగోలు.

**ధనుస్సు:** నాణ్యత లేని వస్తువులు మీకు అంటగట్టే ప్రయత్నాలు జరుగుతాయి. జాగ్రత్త అవసరం.

**మకరం:** అనేకాంశాలలో అనుభవం మిమ్ములను ముందుకు నడుపుతుంది.

**కుంభం:** సంతాన పురోభివృద్ధి ఆనందం కలిగిస్తుంది. ఒకరికి మీరు సహాయంచేస్తారు.

**మీనం :** కుటుంబసభ్యుల నుండి ప్రోత్సాహం లభిస్తుంది. ప్రయాణాలు లాభిస్తాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## వారం - వర్జ్యం

28-08-2025, గురువారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
భాద్రపద మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, శుక్లపక్షం
పంచమి సా.5.58
చిత్త ఉ.8.44
వర్జ్యం : మ.3.00-4.48
దు.ఉ.10.05-10.55, 2) మ.3.05-3.55
శుభసమయం : ఉ.8.15-9.00,
సా.4.15-4.55
రాహుకాలం - మ.1.30-3.00

## వార్తాఫలం

**మేషం :** దూరపుబంధువుల నుండి ముఖ్యమైన సమాచారం అందుకుంటారు.

**వృషభం:** ఆర్థికపరిస్థితి సంతృప్తి కరంగా ఉంటుంది. మిత్రులతో ఏర్పడిన విభేదాలు పరిష్కారమవుతాయి.

**మిథునం:**జీవితభాగస్వామి సలహాలతో నూతన కార్యక్రమాలకు శ్రీకారంచుడతారు.

**కర్కాటకం :** స్థలాలు, భూములు కొనుగోలు వ్యవహారాలు పురోభివృద్ధిలో ఉంటాయి.

**సింహం:**అనుకోని అతిథులను కలిసి ఆనందంగా గడుపుతారు. వస్త్రాలు కొనుగోలు.

**కన్య :** కార్యాలయంలో పై అధికారులకు వివరణ ఇచ్చుకోవలసి వస్తుంది.

**తుల :** మీ వైరివర్గం మిమ్ములను బాధించకపోవడం ఊరట కలిగిస్తుంది.

**వృశ్చికం:** పుకారులకు ప్రాధాన్యత నివ్వడం వలన నిజానిజాలు తెలుసుకోవడంలో వైఫల్యంచెందుతారు.

**ధనుస్సు:** ముఖ్యమైన పనులు వాయిదా వేసుకొని సులువుగా జరిగే కార్యక్రమాలను మాత్రమే చేయండి.

**మకరం:** కుటుంబసభ్యులతో కలిసి విహారయాత్రలు చేస్తారు. మిత్రుల కలయిక.

**కుంభం:**వృత్తి ఉద్యోగాలపరంగా అదనపు బాధ్యతలు నిర్వహించవలసి వస్తుంది.

**మీనం :** నమ్మి ఎవరికి పనిని అప్పగించవద్దు. మీ పనిని మీరే చేసుకోండి. వాహనసౌఖ్యం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## నందమూరి బాలకృష్ణకు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అభినందన

**విజయవాడ,ఆగస్టు 26,ప్రభాతవార్త ప్రతినిధి:** చలనచిత్ర పరిశ్రమలో 50 ఏళ్ళ సుదీర్ఘ నట జీవితాన్ని పూర్తి చేసుకొని ,ప్రపంచ రికార్డును దక్కించుకున్న నందమూరి బాలకృష్ణకు ఏపీ డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ అభినందనలు తెలిపారు ఎక్స్ వేదికగా పవన్ కళ్యాణ్ చేసిన పోస్టులో తెలుగు చలన చిత్ర రంగం లోనికి స్వర్గీయ నందమూరి తారక రామారావు నట వారసుడిగా అడుగుపెట్టి జానపదాలు,కుటుంబ కుటుంబ కథా చిత్రాలు,యాక్షన్ చిత్రాలతో ప్రేక్షకులను మెప్పిస్తూ,చనట జీవితంలో 50 సంవత్సరాల సుదీర్ఘ ప్రయాణం పూర్తి చేసుకున్న తరుణంలో వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ (లండన్)లో చోటు సాధించిన ప్రముఖ నటులు,హిందూపురం ఎంఎల్ఏ పద్మభూషణ్ నందమూరి బాలకృష్ణకు మనస్ఫూర్తిగా అభినందనలు తెలియచేస్తున్నాను. ఆయన మరిన్ని సంవత్సరాలు తన నటనతో ప్రేక్షకులను అలరిస్తూ ప్రజాసేవలో క ఒనసాగాలని ఆకాంక్షిస్తున్నాను' అని పేర్కొన్నారు.

## మంత్రి లోకేష్ చొరవతో గణేష్ మండపాలకు ఉచిత విద్యుత్

**విజయవాడ,ఆగస్టు 26,ప్రభాతవార్త ప్రతినిధి:** వినాయక చవితి పండుగను పురస్కరించుకుని రాష్ట్ర వ్యాప్తంగా గణేష్ ఉత్సవ మండపాలకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. వినాయక చవితి ఉత్సవ విగ్రహాలు ఏర్పాటు చేసే ప్రాంతాల్లో పందిళ్లకు ఉచితంగా విద్యుత్ సౌకర్యం కల్పించాలని పలువురు నిర్వాహకులు మంత్రి నారా లోకేష్‌ను కోరారు. దీనిపై స్పందించిన లోకేష్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు,విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌తో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 15 వేల గణేష్ విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నారు. గణేష్ ఉత్సవ పందిళ్ళకు ఉచిత విద్యుత్ అందించడానికి రూ.25 కోట్లు ప్రభుత్వం భరించాల్సి ఉంది. రాష్ట్రంలో కోట్లాది గణేష్ భక్తుల సౌలభ్యం దృష్ట్యా ఉచిత విద్యుత్ అందించేలా అలాగే రాబోయే విజయదశమి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసే దుర్గాదేవి మండపాలకు కూడ ఉచిత విద్యుత్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది.



# మూడేళ్ల క్రితం వచ్చి పదవుల కోసం ఆరాటమా?

### మేం 30 యేళ్లుగా పార్టీలో ప్రశాంతంగా ఉన్నాం సెప్టెంబర్6న అనంతలో సూపర్‌సిక్స్ సభను విజయవంతం చేస్తాం మంత్రి పయ్యావుల కేశవ్ వెల్లడి

**అనంతపురం, ఆగస్టు 26, (ప్రభాతవార్త బ్యూరో)** టిడిపి జాతీయ అధ్యక్షులు, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇటు ప్రభుత్వాన్ని, అటు తెలుగుదేశం పార్టీని నడిపే విషయంలో నిరంతరం కష్ట పడుతున్నారు. మంత్రి అమరనాథ్ రెడ్డి, తన తో పాటు చాల మంది ముప్పై ఏళ్ళు పార్టీలో ఉన్నా ప్రశాంతంగా పార్టీలో ఉన్నాం. మూడేళ్ల కిందట పార్టీలోకి వచ్చిన వాళ్ళు పదవుల కోసం ఆరాట పడుతున్నారు అని రాష్ట్ర మంత్రి పయ్యావుల కేశవ్ అభిప్రాయపడ్డారు. పార్టీ కోసం కార్యకర్తలు, నాయకులు నిరంతరం పనిచేస్తే పార్టీలో తప్పక గుర్తింపు వస్తుందని ఆయన వెల్లడించారు. అనంతపురంలోని బళ్లారి బైపాస్ వద్ద గల ఎం వై ఆర్ ఫంక్షన్ హాల్ లో అనంతపురం పార్లమెంట్ విస్తృతస్థాయి సమావేశం మంగళవారం జరిగింది. పార్లమెంట్ పార్టీ కమిటీల ఏర్పాటు కోసం నియమించిన త్రిసభ్య కమిటీ సభ్యులైన మంత్రి డోలా వీరాంజనేయ స్వామి , ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి , శాప్ చైర్మన్ అని మిని రవి నాయుడు తో మంత్రి పయ్యావుల కేశవ్ తోపాటు అనంత పురం పార్ల మెంట్ ఎంపీ, ఎమ్మెల్యేలు, రాష్ట్ర కమిటీ నాయకులు, జిల్లా నాయకులు తది తరులు పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా మంత్రి పయ్యావుల కేశవ్ కార్యకర్తలను ఉద్దే శించి మాట్లా డుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపిం చేందుకు సీఎం చంద్రబాబు అహర్ని శలు శ్రమిస్తున్నారని, భవిష్యత్తులో తెలుగుదేశం పార్టీ కూడా విజయవంతం అయ్యేందుకు ఆలోచన చేస్తున్నారని,. మూడేళ్ళలో అనంతపురం జిల్లా జిల్లా రూపు రేఖలు మారనున్నాయి అన్నారు. ప్రాధాన్యత క్రమంలో ప్రాజెక్టుల నిర్మాణం పూర్తి చేస్తాం.సూపర్ సిక్స్, సూపర్ హిట్ పేరుతో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో అనంత లో సభ జరగనుంది.వచ్చే నెల 6న జరిగే సభను అందరూ విజయవంతం చేయాలని మంత్రి పయ్యావుల కేశవ్ కార్యకర్తలకు, నాయకులకు పిలుపునిచ్చారు. కడప లో మహానాడు ఘనంగా నిర్వహించాం. అనంత లో సూపర్ సిక్స్ సూపర్ హిట్ కార్యక్రమం నిర్వహించాలని సీఎం చెప్పారు అని,అందరూ పాల్గొని విజయవంతం చేద్దాం ఆయన పిలుపునిచ్చారు. సభలోమంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి కార్యకర్తలు ఉద్దేశించి మాట్లాడుతూ పార్టీ సంస్థాగత ఎన్నికల్లో అందరం కలిసి ఏకాభిప్రాయం తో ముందుకి వెళదాం..పార్టీ లో సీఎం చంద్రబాబు, యువనేత లోకేష్ వినూత్న మార్పులు తీసుకువచ్చారు అని ఆయన వెల్లడించారు. గతం లో లేని విధంగా కష్టపడి పనిచేసిన వారికి మరిన్ని పదవులు రాబోతున్నాయి ఆయన అభిప్రాయపడ్డారు.కడప లో మహానాడు సక్సెస్ అయింది.పక్కనే ఉన్న అనంతపురం లో అంతకు రెట్టించిన ఉత్సాహంతో సెప్టెంబర్ 6న అనంతపురంలో జరిగే సభ ను విజయవంతం చేయాలని ఆయన కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు. సంక్షేమ పథకాలు గతం లో కంటే మిన్నగా చేస్తున్నాం. వచ్చే నెల 5న డీఎస్ సీ అభ్యర్థులు ఉద్యోగం లో చేరుతున్నారు. అనంతపురం ను రాష్ట్రంలో నెంబర్ 1 ఆదాయం వచ్చే రాష్ట్రం గా తీర్చిదిద్దుదాం అని ఆయన వెల్లడించారు.

## 31న ఉత్తరాంధ్ర సాహితీ , సాంస్కృతిక వేడుకల్లో - డా.గజల్ శ్రీనివాస్ తెలుగు గజల్ గానం

**విజయవాడ,ఆగస్టు26,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్ర సారస్వత పరిషత్తు విశాఖ సంగీత, నృత్య అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో గుంటూరు, అమరావతి లో నందమూరి తారక రామారావు వేదికపై జరుగనున్నట్లు ఆ పరిషత్ కార్యదర్శి రెడ్డప్ప ధవేజి, మహా సభల ముఖ్య సమన్వయ కర్త పి.రామచంద్ర రాజు, కార్యక్రమం సంచాలకులు కోడూరి సుశీల తెలిపారు. పరిషత్తు అధ్యక్షులు డా.గజల్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరుగుతున్న 3 వ ప్రపంచ తెలుగు మహాసభలు 2026 సన్నాహాల్లో భాగంగా 'ఉత్తరాంధ్ర సాహితీ, సాంస్కృతిక వేడుకలు కళా భారతి' , విశాఖపట్నంలో 31 ఆగస్టు ఉదయం 9 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పంతుల రమ గారిచే శాస్త్రీయ సంగీతం, గురు సహస్రావధాని డా. కడిమిళ్ళ వరప్రసాద్ గారిచే అష్టావధానం, ఉత్తరాంధ్ర కవులచే కవి సమ్మేళనం జరుగుతుందని వివరించారు. జేజి నారాయణ గారిచే శ్రీ భక్త మార్కండేయ హరికథ, సందీప్ బృందం చే శ్రీనివాస కళ్యాణం నృత్య రూపకం, జానపద నృత్యాలు. సన్నిధి రాజ్ సాగి బృందం చే కూచిపూడి నృత్యాలు, కేవలం మహిళలు మాత్రమే ప్రదర్శించే విజయనగం విజయ సూర్య సంస్థ సమర్పణలో ' తన దాకా వస్తే' సాంఘిక లఘు నాటిక, శ్రీకాకుళం కళాకారులచే పౌరాణిక ఏక పాత్రభినయ ప్రదర్శనలు, వైజాగ్ బీట్స్ కరోకె గాయకులచే చలన చిత్ర గీతాలాపన , కళాకారులకు కవులకు సత్కారాలు డా.గజల్ శ్రీనివాస్ గారిచే తెలుగు గజల్ భక్తి గీతాల కార్యక్రమం ఉంటుంది.

## స్మార్ట్ రేషన్ కార్డుతో అక్రమాలకు చెక్ : మంత్రి నారాయణ

### సంక్షేమం, అభివృద్ధి కూటమి లక్ష్యం - రాష్ట్రంలో పారదర్శకంగా ప్రజా పంపిణీ వ్యవస్థ

**నెల్లూరు, ఆగస్టు 26, ప్రభాతవార్త-వైద్యం :** నెల్లూరులో స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేసిన రాష్ట్ర మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ప్రజా సంక్షేమంతో పాటు రాష్ట్ర అభివృద్ధి లక్ష్యంగా కూటమి ప్రభుత్వం యుహాత్మకంగా ముందుకు అడుగులు వేస్తుందని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తెలిపారు. నెల్లూరు నగర నియోజకవర్గ పరిధిలోని 48వ డివిజన్ పొర్లుకట్ట వద్ద మంత్రి నారాయణ మంగళవారం లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి స్వయంగా స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేసి ప్రభుత్వ లక్ష్యాన్ని వివరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు ముందుగా డివిజన్లకు విచ్చేసిన మంత్రి నారాయణ కు టిడిపి శ్రేణులతో పాటు ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రివర్యులు డాక్టర్ పొంగూరు నారాయణ మీడియాతో మాట్లాడుతూ సంక్షేమంతో పాటు రాష్ట్రాభివృద్ధి కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఆ దిశగా చంద్రబాబునాయుడు పాలనసాగుతోందన్నారు. రాష్ట్రంలో ప్రజా పంపిణీ వ్యవస్థను పారదర్శకంగా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. పేదలకు ఇచ్చే నిత్యావసర సరుకుల పంపణీలో అక్రమాలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డులను ప్రవేశ పెట్టిందని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 1.45 కోట్ల కుటుంబాలకు ఉచిత స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్నామన్నారు. ముందుగా తొమ్మిది జిల్లాలు శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, కృష్ణా, ఎన్టీఆర్, తిరుపతి, నెల్లూరు, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల్లో ఇస్తున్నామని, త్వరలోనే మిగతా అన్ని జిల్లాల్లో కూడా స్మార్ట్ కార్డులను పంపిణీ చేస్తామన్నారు. నెల్లూరు సిటీ నియోజకవర్గం పరిధిలో 28 వార్డులలో, 69 రేషన్ షాపుల ద్వారా ప్రజలకు బియ్యం, ఇతర నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్నట్లు తెలియజేశారు. ప్రభుత్వ ఆదేశముల ప్రకారం ఆగష్టు నెల 25వ తేది నుండి పాత రేషను కార్డులు స్థానంలోనే స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్నామన్నారు. 25 వ తేది నుండి 31 వరకు ఇంటింటికీ స్మార్ట్ కార్డులు పంపిణీ జరుగుతుందని, సెప్టెంబర్ 1 వ తారీఖు తరువాత రేషన్ షాపుల వద్ద పంపిణీ చేస్తామని చెప్పారు. నెల్లూరు సిటీ నియోజకవర్గం పరిధిలో 63 వేల 419 కార్డులు పంపిణీ చేస్తున్నట్లు తెలియజేశారు. స్మార్ట్ రేషన్ కార్డులకు ఎటువంటి పైకం చెల్లించనవసరం లేదని మంత్రి నారాయణ స్పష్టం చేశారు...ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కార్తీక్,కమిషనర్ నందన్,ఆర్డిఒ అనూష, ఏపీ స్టేట్ సివిల్ సప్లై డైరెక్టర్ పట్టాభిరామిరెడ్డి, డిప్యూటీ మేయర్లు రూప్ కుమార్ యాదవ్, తహసీన్, టిడిపి సీనియర్ నేత వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి,రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు ధర్మవరపు సుబ్బారావు,మాజీ మున్సిపల్ చైర్పర్సన్ తాళ్లపాక అనురాధ,

మాజీ జెడ్పిటిసి విజేత రెడ్డి, నగర అధ్యక్షుడు మామిడాల మధు,48వ డివిజన్ ప్రెసెండిట్ పెంచల బాబు,ఇంచార్జ్ కీర్తి,బూత్ కన్వీనర్ హుసేన్ బాషా, గోపి,ఇంతియాజ్, టీడీపీ ముఖ్యనేతలు పాల్గొన్నారు.



## జనసేన నేత కర్రి మహేష్ సస్పెన్షన్

**విజయవాడ,ఆగస్టు26.ప్రభాతవార్తప్రతినిధి:** మచిలీపట్నంలో హోంగార్డ్‌పై జనసేన నేత కర్రి మహేష్ దాడిచేశాడు. ఈ ఘటనపై జనసేన అధిష్టానం చర్యలు చేపట్టింది. దాడికి పాల్పడిన కర్రి మహేష్‌పై సస్పెన్షన్ వేటు వేసింది. జనసేనలో కర్రి మహేష్ క్రియాశీలక సభ్యత్వాన్ని రద్దు చేసినట్లు మచిలీపట్నం నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ బండి రామకృష్ణ తెలిపారు. ఈ ఘటనపై బండి రామకృష్ణ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై నిజానిజాలు పూర్తిగా తెలియకపోయినా కేసు నమోదైన నేపథ్యంలో కర్రి మహేశ్ క్రియాశీలక సభ్యత్వాన్ని పార్టీ హైకమాండ్ రద్దు చేసిందని తెలిపారు. పార్టీకి నష్టం చేకూర్చే వాళ్లంటే తమ పార్టీ అధినేత పవన్ కల్యాణ్‌కు ఇష్టం ఉండదన్నారు.ప్రజలకు సేవ చేయాలని పవన్ కల్యాణ్ ఇచ్చిన స్ఫూర్తితో తామంతా రాజకీయాల్లోకి వచ్చి ప్రజల కోసం పని చేస్తున్నామని ఉద్ఘాటించారు. జనసేన పార్టీకి నష్టం చేకూర్చే వాళ్లపై క్రమశిక్షణా చర్యలు ఉంటాయని మచిలీపట్నం నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ బండి రామకృష్ణ హెచ్చరించారు.

## సచివాలయంలో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ



రెవెన్యూ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయలక్ష్మీ మట్టి వినాయకుని ప్రతిమను అందజేస్తున్న దృశ్యం

**సచివాలయం,ఆగష్టు 26,ప్రభాతవార్త :** వినాయక చవితిని పురస్కరించుకొని మట్టిగణపతిని పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం..పర్యావరణ భద్రత. ..మనందరి బాధ్యత అంటూ రాష్ట్ర సచివాలయంలో మట్టి వినాయక విగ్రహాలను పెద్దఎత్తున పంపిణీ చేశారు. రాష్ట్ర రెవెన్యూ,రిజిస్ట్రేషన్స్,స్టాంప్స్ శాఖమంత్రి అనగాని సత్యప్రసాద్ తరపున వారి పేషీ అధికారులు,సిబ్బంది మట్టితో తయారు చేయబడిన అంకుర గణపతి ప్రతిమలను పంపిణీ చేశారు.ఈ అంకుల గణపతి ప్రతిమలో ఒక విశిష్టత ఉందని,గణపతి పూజానంతరం ఈ విగ్రహాన్ని నీటితో తడిపి నానబెడితే అందులో నుండి మొక్క వస్తుందని తద్వారా పచ్చదనం ఫరిడవిల్లుతుంది అంటున్నారు. అదే విధంగా రాష్ట్ర కాలుష్య నివారన మండలి ఆధ్వర్యంలో రాష్ట్ర సచివాలయంకు ఉద్యోగులకు మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేయడం జరిగింది.పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయక విగ్రహల వాడకాన్ని ప్రొత్సహిస్తూ తద్వారా ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్,ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలనే లక్ష్యంతో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు.

రాష్ట్ర కాలుష్య నివారణ మండలి చైర్మన్ పి.కృష్ణయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎన్ఎస్ఎస్ అధికారి ఎం.సుధాకర్,కాలుష్య నివారణ మండలి పర్యావరణ ఇంజనీర్ మహ్మద్ నజీనా బేగం తదితరులు పాల్గొన్నారు.పర్యావరణ మానవ సమాజ భద్రత బాధ్యత ఫౌండేషన్ ప్రతినిధులు కూడా ఈ కార్య క్రమంలో పాల్గొన్నారు.

## తిరుమలలో ఎంబిసి ప్రాంతంలో కూలిన భారీ చెట్టు

**తిరుమల,ఆగస్టు 26ప్రభాతవార్తప్రతినిధి:** శేషాచలం కొండల్లోని కలియుగవైకుంఠం తిరుమలలో మంగళవారం ఉదయం ఓ భారీ చెట్టు ఉన్నఫళంగా కూలిపోయింది. ఈ సమయంలో ఎంబిసి ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న ప్రైవేట్ సెక్యూరిటీగార్డు చంద్రశేఖర్‌రెడ్డి తలకు గాయాలయ్యాయి. ఎంబిసి ప్రాంతం నిత్యం యాత్రికులతో ,కాలినడక భక్తులతో రద్దీగా ఉంటుంది. ఎప్పుడూ కిటకిటలాడే ఈ ప్రాంతంలో అదృష్టవశాత్తు చెట్టుకూలిన సమయంలో భక్తులు ఎవరూ లేకపోవడంతో పెద్దప్రమాదం తప్పింది. ప్రాణనష్టం కూడా జరగలేదు. చెట్టుకూలిన సమయంలో భారీగా శబ్ధం రావడంతో సమీపంలోని భక్తులు, సిబ్బంది గందరగోళానికి, భయంతో పరుగులు తీశారు. సమాచారం అందుకున్న టిటిడి ఉద్యోగులు, భద్రత సిబ్బంది అక్కడకు చేరుకుని గాయపడిన సెక్యూరిటీగార్డును అశ్వినీ ఆస్పత్రికి తరలించారు.

## మట్టివినాయకులనే పూజించాలి - పర్యావరణ హితం కోసం విగ్రహాల పంపిణీ



**తిరుపతి, ఆగస్టు 26ప్రభాతవార్తప్రతినిధి:** పర్యావరణ హితం కోసం మట్టి తో తయారు చేసిన వినాయకుని ప్రతిమలనే పూజిద్దామని, ప్రతి ఒక్కరూ ఇందుకు సహకరించాలని ఏకవీరఫౌండేషన్ వ్యవస్థాపకుడు ప్రతాప్‌స్వామి, రాయలసీమ రంగ స్థలి చైర్మన్ గుండాల గోపీ నాథరెడ్డి కోరారు. నేడు వినాయచకవితి పర్వదినం పురస్కరించుకుని ప్రతి ఏటాలాగే ఈ ఏడాది కూడా ప్రజలకు మట్టితో చేసిన వినాయకవిగ్రహాలను పంపిణీ చేశారు. మంగళవారం ఉదయం తాతానగర్‌లో నేరెళ్ళమ్మ ఆలయం వద్ద ప్రతాప్‌స్వామి, గోపీనాథరెడ్డి, తొండమనాటి సుబ్రమ ణ్యంరెడ్డి, కొండే చెంగారెడ్డి, సురేశ్‌స్వామి, చంగల్‌రాయలు, కస్పాపద్మనాభం, కెఎస్ రాజ, హనుమంతరావుతో కలిసి 500మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు.

# తిరుమల సమాచారం

## రూ.61,72లక్షల విలువైన స్మిత్ డిటెక్షన్ హైస్కానర్ విరాళం



**తిరుమల,ఆగస్టు 26ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలేశుని ఆలయానికి సమీపం లోని ఉగ్రాణం నుండి లడ్డూప్రసాదాలు, అన్నప్రసాదాల తయారీలో వినియోగించే ముడిపదార్థాలను శ్రీవారి పోటుకు పంపించే ముందు తనిఖీ చేసేందుకు అవసరమైన స్మిత్ డిటెక్షన్ హైస్కానర్‌ను ఓ బ్యాంకు విరాళంగా అందజేసింది. తిరుపతి రీజనల్ ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ టిటిడికి 61.72లక్షల రూపాయలు విలువైన ఈ స్కానర్‌కు టిటిడికి విరాళంగా అందించారు. టిటిడి పరిపాలనభవనంలో ఇఒ శ్యామలరావుకు తిరుమల ఐఓబి మేనేజర్ మహేశ్‌బాబు, మార్కెటింగ్ అదికారి రాజశేఖర్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## లోకక్షేమం కోసం పుణ్యక్షేత్రాల సందర్శన : సాధుబ్రహ్మావిహారిస్వామి



**తిరుమల,ఆగస్టు 26ప్రభాత వార్తప్రతి నిధి:** లోకక్షేమం కాంక్షిస్తూ ,ప్రజలు భగవన్నామస్మరణతోనే శుభాలు కలుగుతాయని అనుగ్రహం చేస్తున్నట్లు సాధుబ్రహ్మ విహారిస్వామి తెలిపారు. 69మంది శిష్యబృందం తో కలసి ఆయన మంగళవారం ఉదయం తిరుమలకు చేరుకున్నారు. ఆలయంలోపలకు రాగానే ఆలయ అధికారులు,అర్చకులు స్వాగతం పలికి వేంకటేశ్వరస్వామి దర్శనం చేయించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తులు నిరంతరం భగవంతుని ధ్యానించాలని, ఆయన అనుగ్రహంతోనే మంచిజరుగుతుందని తెలిపారు.

## ప్రజలకు శ్రీవారి ఆశీస్సులుండాలి: ప్రముఖులు



**తిరుమల,ఆగస్టు 26ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శనం చేసుకోవడం ఆనందంగా ఉందని, రాష్ట్రప్రజలకు శ్రీవారి ఆశీస్సు ఎల్లప్పుడూ ఉండాలని పలువురు ఆకాంక్షించారు. మంగళవారం ఉదయం విఐపి బ్రేక్ దర్శనసమయంలో ఇండియన్ క్రికెటర్ తిలక్‌వర్మ, దర్శకుడు వెంకి కుడుములు, దర్శకుడు మల్లిది వశిష్ట,చిత్రదర్శకుడు గంగైఅమరన్ ఆలయంలోపలకు చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు.

## పర్యావరణ పరిరక్షణకు మట్టిగణపతినే పూజిద్దాం

### - తిరుపతిలో విద్యార్థులతో ప్రతిమల తయారీ



**తిరుమల,ఆగస్టు 26ప్రభాత వార్తప్రతినిధి:** చిన్నారుల చిట్టిచేతులతో మట్టిగణపయ్యలను తయారు చేసేందుకు తిరుపతిలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు తిరుపతి వరసిద్ధి వినాయక మహోత్సవ కమిటీ నిర్వహించిన కార్యక్రమానికి బారులుతీరారు. కమిటీ తరపున మట్టిని,వినాయక ప్రతిమ తయారీకి సామాగ్రిని అందించారు. చిన్నారులను ప్రోత్స హించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడు తాయని తిరుపతి నగరపాలక కమిషనర్ మౌర్య, వినాయకకమిటీ కన్వీనర్ సామంచి శ్రీనివాస్, గుండాల గోపీనాథరెడ్డి, నవీన్‌కుమార్‌రెడ్డి,డిపి ఆనంద్ తెలిపారు. అనంతరం విద్యార్థులకు చిత్రాలు, పూల మొక్కలను పంపిణీ చేశారు.

ADITYA BIRLA CAPITAL
FINANCE

Regd Office: Indian Rayon Compound, Veraval, Gujarat - 362 266 | (T) +91-22-6723 9101 | (Toll free) 1800 270 7000 | CIN: L64920GJ2007PLC058890 | www.adityabirlacapital.com

**ఋణ ఖాతాను(లు) మోసపూరితమైనది(వి)గా ప్రకటించడానికి/వర్గీకరించడానికి చిట్టచివరి నిర్దేశాన్ని జారీచేయడానికి నోటీసు**

ఆదిత్య బిర్లా క్యాపిటల్ లి. వెబ్ సైట్ https://www.adityabirlacapital.com/. పైన అందుబాటులో ఉన్న ఈ తరువాతి లింక్ https://abcf.financial/Final-Order లో తెలియపరచబడిన ఋణగ్రహీతలకు చిట్టచివరి నిర్దేశం జారీచేయబడుతున్నది.

ఆదిత్య బిర్లా క్యాపిటల్ లిమిటెడ్ ("ABCL") (ఇంతకు మునుపు ఆదిత్య బిర్లా ఫైనాన్స్ లిమిటెడ్ ("ABFL") గా పిలువబడేది) ద్వారా నిర్వహించబడిన అన్వేషణల సమయంలో, పైన హైపర్ లింక్లో తెలియపరచబడిన పేరులో ఉన్న ఋణగ్రహీతలైన మీరు ABCL నుండి వ్యక్తిగత ఋణాన్ని లభ్యం చేసుకుంటున్నప్పుడు ఋణాన్ని పొందడానికి తప్పుడు మరియు సృష్టించబడిన దస్తావేజులను ఉపయోగించి మోసాన్ని నిర్వర్తించారని వెలుగులోనికి వచ్చింది.

ఋణగ్రహీతలను సంభోదిస్తూ ఇచ్చిన షో కాజ్ నోటీసులు ABCL వారి వెబ్ సైట్ అంటే https://abcf.financial/fraudawareness పైన 17 జూన్ 2025 తేదీ నాడు ప్రచురించబడ్డాయి, దీనికి రిఫరెన్స్ కూడా జాతీయ వార్తా పత్రికలో మరియు మీ ప్రాంతం/రాష్ట్రం యొక్క స్థానిక వార్తా పత్రికలో కూడా 30 జూన్ 2025 తేదీన ప్రచురించబడినది. షో కాజ్ నోటీసులకు ప్రతిస్పందించడానికి 21 రోజుల తగినంత సమయం ప్రదానం చేయబడినా కూడా మీ నుండి ఎలాంటి ప్రతిస్పందన అందుకోబడలేదు.

ఈ తీవ్రమైన ఉల్లంఘనలకు అనుగుణంగా, తక్షణమే అమలయ్యేలా మీ ఋణ ఖాతా మోసపూరితమైనదిగా ప్రకటించడం మాకు తప్పనిసరి అయింది. మీ పేర్కొనబడిన ఖాతా మూసివేతకు పర్యవసానంగా, ఏదైనా కూడబడిన వడ్డీ, ఫీజులు మరియు జరిమానాలతో సహా బకాయీ ఉన్న గడువుకు వచ్చిన డబ్బులను సంపూర్ణంగా పదిహేను రోజుల లోపల చెల్లించవలసినదిగా మీకు ఇందు మూలంగా తెలియపరచబడుతున్నది. ఈ తిరిగి చెల్లింపు డిమేండుకు అనువర్తన చేయడంలో విఫలమయినట్లయితే, చట్టపరమైన చర్యకు తదుపరి దారితీయవచ్చును, దీనిలో వసూలు చేసే ప్రక్రియలు, క్రెడిట్ బ్యూరోలకు నివేదించడం మరియు సంభావ్య నేరపూరిత ఛార్జీలకు దారితీయడం కూడి ఉండవచ్చును. ఒకసారి పూర్తి చెల్లింపును అందుకున్నట్లయితే, మీ ఋణ ఖాతా చివరకు మూసివేయబడుతుంది మరియు ముగించినట్లుగా ధృవీకరణ మీకు జారీ చేయడం జరుగుతుంది.

న్యాయపరమైన పర్యవసానాలకు గురికాకుండా ఉండడానికి ఈ విషయాన్ని తీవ్రతతో దయచేసి పరిగణించగలరు.

భవదీయుడు,
**ఆదిత్య బిర్లా క్యాపిటల్ లి. తరపున**
**సంతకం/-**
సంతకం చేయడానికి అధీకృతం చేయబడిన వారు

ప్రదేశం : ఆంధ్రప్రదేశ్
ప్రచురించే తేది : 27 ఆగస్టు, 2025

వార్త

జీవితం అంటే ఒక సమస్య నుంచి మరొక సమస్యకు ప్రయాణం మాత్రమే. ఏ సమస్యలూ లేని జీవితం ఉండదు.

-వాల్టర్ స్కాట్

# తపాల సేవలకు మంగళం!


అనుకోకుండా ఇప్పుడు తపాల శాఖ మళ్లీ రోడ్డెక్కుతోంది. విమానం ఎక్కలేని తపాలా సంచులు తపాల కార్యాలయాల్లోనూ, విమానాశ్రయాల్లోనూ పడిగాపులు పడి ఎదురుచూస్తున్నాయి. అమెరికాకు పోస్టల్ సేవలను భారత ప్రభుత్వం తాత్కాలికంగా నిలిపి వేసింది. ఆగస్టు 29 నుంచి 100 డాలర్లకుపైగా విలువున్న బహుమతులు, లేఖలు, డాక్యుమెంట్లపై సేవలకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ జారీ చేసిన మేరకు అధిక సుంకాలు వడ్డిస్తాయి. జులై 20న అమెరికా జారీ చేసి కార్య నిర్వాహక ఉత్తర్వు మేరకు అంతర్జాతీయ పోస్టల్ నెట్‌వర్క్, అమెరికా కస్టమ్స్ సరిహద్దు రక్షణ (సిబిపి) విభాగాలు ఆమోదించిన క్వాలిఫైడ్ పార్టీల ద్వారా వస్తువులను రవాణా చేసే సంస్థలే సుంకాలు వసూలు చేసి ప్రభుత్వానికి చెల్లించాలి. ఈ సుంకాల వసూళ్ల ప్రక్రియపై పూర్తిస్థాయి స్పష్టత రాలేదు. ఈ నేపథ్యంలో అమెరికా విమానయాన సంస్థలు భారత్‌వైపు నుంచి తపాల పార్శిళ్లు, లేఖలను స్వీకరించలేదు. ఇప్పుడొచ్చిన తంటా అంతా ట్రంప్ విధానంపై స్పష్టత లేనందునే. ఇదిలా ఉంటే స్వదేశంలో తపాలాశాఖలో సంస్కరణలు కూడా సామాన్య ప్రజలకు అర్థంకాకుండా ఉన్నాయి. నిత్యం తపాలా సేవలు నానాటికీ తీసికట్టు నాగంబొట్లు అన్న చందాన మారి పోస్టాఫీసులవైపు చూసేవారే తక్కువయ్యారు. కేవలం రికార్డుల్లో నమోదవ్వాల్సిన రిజిష్టర్డ్ పోస్టులు, లీగల్ నోటీసులు, రిజిస్టర్ పార్శిల్స్‌కోసం మాత్రమే న్యాయవాది కార్యాయాలు, వివిధ ప్రభుత్వ సంస్థలు మాత్రమే అటువైపు తొంగిచూస్తాయి. అయినా ప్రస్తుత కాలంలో సర్వర్ డౌన్ అన్న పేరిట సర్వీసులు సక్రమంగా అందించలేకపోతుండటం విచారకరం. తాజాగా ఈ మెయిల్, వాట్సాప్‌లు ఫోన్లలోనే అందుబాటులోకి రావడం, యుపిఐ చెల్లింపు సదుపాయం ఉండడంతో మనీ ఆర్డర్లు సేవలు కూడా మటుమాయమయ్యాయి. డబ్బుల చేరవేత, పుస్తకాల అందచేత, వంటి వారికి ప్రత్యామ్నాయ మార్గాలు రావడంతో పోస్టాఫీసు సందర్శకులు చాలా తగ్గిపోయారు. ఈ రీత్యా తపాల సంస్థ తన రూపురేఖలు మార్చుకోవాల్సిన అగత్యం ఏర్పడింది. ఇకపై ఉత్తరాల పెట్టెలు కనిపించవు.అయితే ఆ శాఖ వివరణలో పోస్టాఫీసుల వద్ద బాగా ప్రాముఖ్యత గలసెంటర్లలో మాత్రమే పోస్టుబాక్స్‌లుంటాయి. ప్రైవేట్ కొరియర్లకు ఛార్జీలు ఎక్కువైనా, రక్షణ చేరవేతలో తపాలా శాఖ వారి సేవలలో పోల్చి చూస్తే కాస్త బెటర్ అనే పరిస్థితి ఉన్నందున జనం దృష్టి అటువైపు పడింది. తాజాగా డిజిటలైజేషన్ అందిపుచ్చుకోవాలనే తపనలో వడివడి అడుగులు లేయడానికి బదులు తప్పటడుగులు వేస్తోందని జనం నుంచి విమర్శ కూడా ఉంది. కారణం పోస్టల్ సర్వీసుల పునర్వ్యవస్థీకరణ జరిగినా ఎల్రక్టానిక్స్ వ్యవస్థలో సరైన సదుపాయం లేక రిజిస్టర్డ్ సర్వీసులు కూడా సక్రమంగా చేయలేకపోతున్నాయి. ఒకవేళ ఈసర్వీసుల ఆధునికత కోసం కొత్తగా యువతకు ఉద్యోగాలు ఆస్కారం లభించినా సర్వీసులు మెరుగుపరుచుకోలేకపోతోంది. అక్నాలెడ్జిమెంటు జతపడే రిజిస్టర్ కవర్లు,పార్శిల్స్ పద్ధతి దాదాపు ఎత్తివేసినట్లే. దాదాపు ఈ సర్వీసులు కొత్త రూపం సంతరించుకుంటున్నాయనే చెప్పాలి. దేశవ్యాప్తంగా ఎక్కడనుంచి ఎక్కడికి వెళ్లాలన్నా ఎంతో భద్రతగా చెక్కులు, డ్రాఫ్టులు, అతిముఖ్యమైన డాక్యుమెంట్లను చేరవేసే సర్వీసుగా రిజిస్టర్ పోస్టులుండేవి. దానికి అనుబంధంగా వచ్చిన 'స్పీడ్‌పోస్టు'ను కూడా ఇప్పుడు రిజిస్టర్ పోస్టును తోసిరాజని దాని స్థానంలో కూర్చోంది. ముద్రణా పుస్తకాలు, పత్రాలను చేరవేసే బుక్‌పోస్ట్‌కు గతేడాది మంగళం పాడారు. సాధారణ పోస్టుకన్నా అత్యవసరంగా చేర్చేందుకని కొన్ని దశాబ్దాల నాడు ప్రవేశపెట్టిన ఎక్స్‌ప్రెస్ డెలివరీ ఎప్పుడో ఆగిపోయింది. తంతితపాల కలిసి ఉన్నప్పుడు టెలిగ్రామ్‌లంటేనే 'మోర్స్‌కీ చప్పుడు వినపడితేనే సమాచారం ఇటు నుంచి అటు చేరేవే కాదు. ఎల్రక్టానిక్ విప్లవం వచ్చాక తంతితపాలా శాఖలో ఆధునిక సేవలు మొదలయ్యాయనుకున్నా తపాలా సిబ్బంది వాటిని చేరుకోలేకపోతున్నారనే అపప్రథ ఉండేది. తంతిశాఖ ఎప్పుడో విడిపోయింది. వినియోగదారునికి సరైన సేవలందించలేక చతికిలపడిపోయింది. దాంతో వారి వేగాన్ని ప్రైవేట్‌సంస్థలు అందుకొని వేగాతివేగంగా సర్వీసు ప్రొవైడర్లుగా మారి కోట్లాది రూపాయలు ఆర్జిస్తున్నా. అప్పట్లో బిఎస్‌ఎన్‌ఎల్ టెలిఫోన్ సర్వీసుల్లో దొంగ కనెక్షన్లు, టెలిఫోన్ వైర్ల దొంగతనం విచ్చలవిడిగా జరిగినా నష్టాలు వచ్చేవికావు.కానీ యాజమాన్య నిర్వహణ లోపంలో టెలిఫోన్ సేవలు చేజార్చుకున్నారు.అలా తంతి తపాలాలు శాశ్వతంగా దూరమయ్యాయి. తపాలా కార్యక్రమాల విస్తరణ, అభివృద్ధి, ప్రక్షాళన, ప్రజలకు మరింత అందుబాటులో ఉంచే విధంగా పునరేకీకరణ లాంటి ప్రయత్నాలలో మళ్లీ ఇప్పుడు పోస్టాఫీసులను భూస్థాపితం చేసిన సంవత్సరంగా చెప్పుకోవచ్చు. తపాలా బట్వాడా కోసం నియమిత సిబ్బందిని కూడా తగ్గిస్తున్నారు. సుదీర్ఘ చరిత్ర ఉన్న తపాలా శాఖకు కొత్తరూపం రావడం మంచిదే. అయినా గతంలో అందరికీ అందుబాటులో ఉన్నాయనుకున్న సౌకర్యాల కుదింపు వినియోగదారులు జీర్ణించుకోలేకపోతున్నారు. బ్రిటిష్ వారి కాలంలో గవర్నర్ జనరల్ వారెన్ హేస్టింగ్ 1776 మార్చిలో తంతితపాలా శాఖ ఏర్పడింది. అప్పట్నించి అంచెలంచెలుగా దినదిన ప్రవర్ధమానమై విస్తరించింది. పొదుపు ఖాతాలకు తపాలా శాఖ పెట్టిందిపేరు. డిజిటల్ ఎల్రక్టానిక్ సాంకేతికతతో విస్తరించే ప్రతి సంస్కరణను ఆహ్వానించాల్సిందే. తపాలా సేవలలో ఎన్నో అద్భుతాలు వింటుంటాము. ఇన్ని వైభవాలున్న తపాలా సేవలు అధునాతన సంస్కరణలతో ద్విగుణీకృతం కావాల్సి ఉంది.

అదృష్టం తనంతా తానుగా వచ్చి తలుపు తడుతుందని అందరూ చెప్తుంటారు. అది అవకాశం రూపంలో ఉంటుంది. దాన్ని వెంటాడు. సొంతం చేసుకో!



జాన్ వాట్సన్

ఒక వ్యక్తి పవిత్రమైన ఆలోచనలతో మాట్లాడినా, లేక పనిచేసినా ఎప్పటికీ అతనిని విడువని నీడలాగా ఆనందం అతని వెన్నంటే ఉంటుంది.



గౌతమబుద్ధుడు

## ప్రజావాక్కు



### ప్రయోజనం శూన్యం

ఏ వ్యక్తినైనా నిశితంగా పరిశీలించకుండా భ్రమలో పడి చాలా 'మంచివాడు' అనే ముద్ర వేసినచో, నిజరూపంలో ఆ క్షణం నుండే మంచివాడుగా నటించడం మొదలెడతాడు. మానవ పుట్టుకతో బంధాలు కలుస్తాయి, గిట్టడంతో జ్ఞాపకాలు మిగులుతాయి. మంచి చెడులు కలిగి ఉన్న మనిషి జీవితంలో సిరి సంపదలకంటే పరువు ప్రతిష్టలు శాశ్వతంగా నిలుస్తాయి.ఎదురుచూడని ఇంటికి పిలవకుండా వెళ్ళినా, విలువ లేని చోట మాట్లాడినా, గౌరవం లేని చోట నిలబడినా, ప్రేమలేని చోట ఆశపడినా, నిర్లక్ష్యం ఉన్నచోటఎదురు చూచినా,బంధాలకంటే డబ్బుకు విలువ ఇచ్చేవారితో ఎంతప్రేమగాఉన్నా, నీవెనుక ఒకటి ముందు ఒకటిమాట్లాడేవారికిదగ్గరలోఉన్నా,ప్రయోజనం శూన్యం.

- డా.దన్నాన అప్పలనాయుడు, చీపురుపల్లి

### వినాయక ఉత్సవాలు ఆరంభం

బొంబాయి లాంటి మహానగరాల్లో ప్రజల్ని ఒకటిగా చేయడానికి మన బలాన్ని, బలగాన్ని బ్రిటిష్ వారికి చూపడానికి బాలగంగాధర్ తిలక్ ఈ గణేష్ ఉత్సవాలను ఎంచుకున్నారు.అంతకు ముందురోజుల్లో గ్రామాలలో ఎవరి ఇంటి గణేశుని వారే ఆ ఊరు కోనేటి నుండి కొంత మట్టిని తెచ్చుకుని మట్టి ప్రతిమను తయారుచేసి పిండి వంటలు పెట్టి నవరాత్రులు గడిచాక వాటిని ఆ చెరువులో నిమజ్జనం చేసేవారు.నవరాత్రులు వర్షాలు పడేవి. వర్షాలు వల్ల వచ్చిన నీరు చెరువులో నిలవడానికి చెరువులో మట్టిని ఇంటికి ఇంత అని తీసేవారు. వర్షాలు పడడం తగ్గాక అదే మట్టిని ఆ చెరువులోనే నిమజ్జనం చేయడం వల్ల, నీరు పైకి వచ్చి పొలాలకు సేద్యం చేయడానికి వ్యవసాయం చేయడానికి ఉపయోగపడేది.

- వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

### నోటిఫికేషన్స్ పేపర్‌లో వేయాలి

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించే ప్రభుత్వ ఉద్యోగ నియామకాలకు సంబంధించి ప్రకటనను అన్ని ప్రధాన వార్తా పత్రికల్లోవేయాలి.ప్రస్తుతం ఉద్యోగ నియామకాలు అంతర్గతంగాఎప్పుడో జరిగిపోతున్నాయి. ఉద్యోగ నియామ కాలు, ప్రకటనలు నిరుద్యోగులకు, ప్రజలకు తెలియకుండా జరిగిపోతున్నాయి. విద్యార్థులకు అడ్మిషన్స్ సంబంధిత నోటిఫికేషన్స్ కూడా ప్రధాన పత్రికల్లో వేయాలి.

- డి. చాంద్ బాషా, కర్నూలు

### రాజకీయ నైతికత

మొన్నటి సమావేశాల్లో పార్లమెంట్‌లో ప్రవేశపెట్టబడి, ఆనక మరింత లోతు పరిశీలనకై జాయింట్ పార్లమెంటరీ కమిటీకి పంపబడ్డ రాజ్యాంగం 130 వ సవరణ బిల్లు ప్రత్యేకమైనది. రాజకీయాల్లో, ముఖ్యంగా పాలనలో పై స్థాయిలో నైతికత ప్రోది చెయ్యడానికి ఉద్దేశించబడింది.దాని ప్రకారం ప్రధాన మంత్రి గానీ,కేంద్ర, రాష్ట్ర మంత్రులు గానీ, ముఖ్యమంత్రి గానీ ఏదైనా క్రిమినల్ కేసులో, అదీ ఐదేళ్లకు పైగా శిక్షార్హమైన కేసులో అరెస్ట్ అయ్యి ముప్పై రోజులు జైలు లేదా కస్టడీ జీవితం గడిపితే వారిని వెంటనే తొలగించాలి అని. అంటే 31 వ రోజుకి ఆటోమేటిక్‌గా పదవి కోల్పోతారు.ఒక వేళ తర్వాత బెయిల్ పొందితే మళ్లీ పదవి చేపట్టవచ్చు. అది వేరే విషయం. ఈ చట్టం స్ఫూర్తి వినడానికి ఎంతో బాగుంది.

-డా.డి.వి.జి. శంకరరావు, పార్వతీపురం

### గ్రామీణ ఆర్థిక వ్యవస్థ స్థిరీకరణ

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన పనుల జాతర పల ప్రదంగా కొనసాగుతుంది. ఇందులో రెండు భాగాలున్నాయి. ఒకటి గ్రామీణప్రాంతమౌలిక వసతులు మెరుగుపరచడం. రెండు ప్రజల ఆర్థిక స్థితిని మెరుగుపరచడానికి ప్రయత్నం చేయడం. ఇందులో భాగంగా గొర్రెల పాకలు గాని పశువుల కొట్టాలు గాని పండ్ల తోటల పెంపకం గాని చేయడం వల్ల తెలంగాణలో గొర్రెల సంఖ్య పెంచడానికి సాధ్యం అవుతుంది. ఒకప్పుడు వేరే రాష్ట్రాల నుండి గొర్రెలను దిగుమతి చేసుకునే వారు.ఇప్పుడు దానిని స్థిరీకరించి మొదటి స్థానానికి చేరాల్సిన అవసరం ఉంది. గ్రామీణ ఆర్థికవ్యవస్థ స్థిరీకరణ జరుగుతుంది.

- భారత అవినాశ్, జనగామ

### జనరిక్ మందులపై అవగాహన అవసరం

ఈ రోజు పెరుగుతున్న వైద్య వ్యయాల నేపథ్యంలో జనరిక్ మందుల వినియోగాన్ని ప్రోత్సహించడం అత్యంత అవసరం. ప్రత్యేకించి ఆర్థికంగా బలహీనంగా ఉన్న కుటుంబాల ఆరోగ్య సంరక్షణకు ఇది ఎంతో ఉపయుక్తం. వాణిజ్య బ్రాండ్ మందుల ధరలు అధికంగా ఉండటం వల్ల పేద ప్రజలకు చికిత్స అందడం కష్టమవుతోంది. జనరిక్ మందులు తక్కువ ధరలో, అదే నాణ్యతతో, అనుమతించబడిన ప్రమాణాలతో తయారవుతాయి. ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రులు, జన ఔషధి కేంద్రాల ద్వారా వీటిని విస్తృతంగా అందుబాటులోకి తేవాలి.వీటిపై ప్రజల్లో అవగాహన పెంచాలి.

-సి.హెచ్. ప్రతాప్, శ్రీకాకుళం

మన విను | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# శిక్షణ లేకనే నిరుద్యోగులకు కష్టాలు!

**మన విద్యా విధానం లోపాలను బయటపెడుతోంది. పరిశ్రమ అవసరాలకు తగ్గట్టుగా శిక్షణ అందించకపోవడం వల్ల ఈ సమస్య మరింత పెరుగుతోంది. విద్యార్థులు కూడా తాము నేర్చుకుంటున్న దాన్ని వృత్తిలో ఎలా ఉపయోగించుకోవాలో అన్వయించుకోలేకపోతున్నారు. దీని వలన విద్యాకాలం తర్వాత కూడా వారు తిరిగి కోచింగ్ సెంటర్లకు లేదా ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్లకు వెళ్లాల్సి వస్తోంది. మన విద్యా విధానం చాలా వరకు పుస్తకాలకే పరిమితమైపోయింది. కోర్సులు రూపకల్పనలో ఉద్యోగ అవకాశాలను పట్టించుకోకపోవడం వల్ల విద్యార్థులు మార్కులు తెచ్చుకున్నా, వృత్తిపరమైన అవకాశాలుదొరకడం లేదు. పాత సిలబస్ ఆధారంగా బోధించడం వల్ల కొత్త టెక్నాలజీలు, పరిశ్రమలో జరుగుతున్న మార్పులు విద్యార్థులకు తెలియవు. ఇంతకీ, చాలామంది విద్యార్థులు నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారు.**

సోరుపాక అనిల్ కుమార్

విద్య అంటే వెలుగు అని మనం తరతరాలుగా నమ్ముతూ వచ్చాం. చదువుకున్నవాడికి ఉద్యోగం వస్తుంది, గౌరవం వస్తుంది, కుటుంబానికి సంతోషం వస్తుందని ప్రతి ఇంటిలోనూ తల్లిదండ్రులు కలలు కంటారు. కానీ ఈ కాలంలో ఆ కలలు చాలావరకు చీకటిలో కలిసిపోతున్నాయి. చదువుకున్నా కూడా ఉద్యోగం దొరకని పరిస్థితి ప్రతి ఇంటి గడపను తట్టిపోతుంది.ఒకవైపుడిగ్రీలు, పీజీలు, ఎంబీఏలు, ఇంజినీరింగ్, మెడిసిన్, పీహెచ్.డీలు పూర్తిచేసిన యువత ఉత్సాహంగా బయటకు వస్తుంటే, మరోవైపు వారికి తగిన అవకాశాలు లేక నిరుద్యోగుల బాటలో నడవాల్సిన పరిస్థితి వస్తోంది. ఈసమస్య వ్యక్తిగతంగా ఒకరి జీవితాన్ని మాత్రమేకాదు, మొత్తం దేశ ఆర్థికవ్యవస్థను, సమాజాన్ని కూడా కుదిపేస్తోంది. ప్రభుత్వ ఉద్యోగాల కోసం లక్షలాది మంది యువత రాత్రింబవళ్లు కష్టపడతారు. కాని, సంవత్సరాల తరబడి కొత్త నోటిఫికేషన్లు రావడం లేదు. వచ్చినా కూడా కోర్టు కేసులు, సాంకేతిక లోపాలు, అవినీతి కారణంగా ఆ నియామకాలు ఆగిపోతున్నాయి. పరీక్షలు రాసిన యువత ఫలితాల కోసం నెలల తరబడి ఎదురు చూస్తుంటారు. కొందరికి వయసు పైబడిపోతుంది, మరికొందరు నిరుత్సాహంతో అవకాశాలు వదులుకుంటారు. ప్రభుత్వంలో ఖాళీలున్నా కూడా వాటిని భర్తీ చేయడంలో స్పష్టత లేకపోవడం మరో సమస్య. కొన్నిసార్లు రాజకీయ పార్టీలు ఎన్నికల ముందు నోటిఫికేషన్లు ఇస్తూ ప్రజలను మోసం చేస్తాయి. పరీక్షలు పూర్తవ్వగానే కొత్త కేసులు రావడంతో ఆ నియామకాలు స్తంభించిపోతాయి. ఈ పరిస్థితి యువత జీవితాలను మాత్రమేకాదు, సమాజంలోని సామర్థ్యాన్ని కూడా వృథాచేస్తుంది. నిరుద్యోగం పెరగడంతో సామాజిక సమస్యలు కూడా ఉధృతమవుతాయి. ప్రభుత్వ నియామకాలు సమయానికి జరిగిఉంటే, వేలాది కుటుంబాలు ఆర్థికంగా బలపడేవి. కానీ ఆలస్యం వల్ల భవిష్యత్తు పాడవుతోందనే అసహనం పెరుగుతోంది. ప్రైవేట్ రంగం యువతకు పెద్దఎత్తున ఉద్యోగ అవకాశాలు ఇస్తున్నా, వాటి నాణ్యత ప్రశ్నార్థకమే. చాలా సంస్థలు ఉద్యోగులను తక్కువ జీతాలతో ఎక్కువ గంటలపాటు పని చేయిస్తాయి. భద్రతా హామీలు లేకుండా కాంట్రాక్టు ఆధారంగా నియమిస్తారు. ఒక ఉద్యోగి తప్పు చేస్తే వెంటనే తొలగిస్తారు. ఎలాంటి రక్షణ ఉండదు. ఆరోగ్య భీమా, పింఛన్ వంటి సదుపాయాలు చాలా అరుదుగా ఉంటాయి. ఇంత తక్కువ జీతాలతో జీవన ఖర్చులు భరించలేక యువత ఋణాల బారిన పడుతున్నారు. కొంతమంది నైపుణ్యానికి తగిన వేతనం పొందక నిరుత్సాహపడుతున్నారు. కార్పొరేట్ కంపెనీలు ఎక్కువ లాభాలు సంపాదించినా ఉద్యోగులకు తగిన వాటా ఇవ్వడం లేదు. అదనంగా,రాత్రి పూటలు,టార్గెట్లు, ఒత్తిడి కారణంగా ఆరోగ్య సమస్యలు వస్తున్నాయి. ఉద్యోగ భద్రత లేకపోవడం వలన రేపటికి ఏమవుతుందో అన్న భయం ఎప్పుడూ వెంటాడుతోంది. ఈ దోపిడి పరిస్థితి యువతను మరోసారి ప్రభుత్వ ఉద్యోగాలవైపు తిరిగి పరుగెత్తేలా చేస్తోంది. మన విద్యార్థులు పుస్తక చదువులో మెరుగ్గా ఉన్నా, పరిశ్రమలకు కావాల్సిన ప్రాక్టికల్ నైపుణ్యాలు చాలావరకు లోపిస్తున్నాయి. యంత్రాలు, టెక్నాలజీ, ప్రాజెక్టు అనుభవం లాంటివి చాలా మందికి ఉండవు.ఫలితంగా, ఉద్యోగ ఇంటర్వ్యూలలో వెనుకబడిపోతున్నారు. ఇంజనీరింగ్ లేదా డిగ్రీ పూర్తిచేసినప్పటికీ, వర్క్‌ప్లేస్‌లో అవసరమైన కమ్యూనికేషన్ స్కిల్స్,



టీమ్‌వర్క్, ప్రాబ్లమ్ సాల్వింగ్ సామర్థ్యాలు తక్కువగా ఉంటాయి. కొన్ని సంస్థలు ప్రత్యేక శిక్షణ ఇచ్చి ఉద్యోగులను తయారు చేసుకుంటున్నా,అంతవరకు యువతకు అవకాశాలు దొరకడం లేదు. నైపుణ్యాలోటు వల్ల చాలా సార్లు బాహ్య రాష్ట్రాల నుండి లేదా విదేశాల నుండి నిపుణులను కంపెనీలు తీసుకువస్తున్నాయి. ఇది మన విద్యా విధానం లోపాలను బయటపెడుతోంది. పరిశ్రమ అవసరాలకు తగ్గట్టుగా శిక్షణ అందించకపోవడం వల్ల ఈ సమస్య మరింత పెరుగుతోంది. విద్యార్థులు కూడా తాము నేర్చుకుంటున్న దాన్ని వృత్తిలో ఎలా ఉపయోగించుకోవాలో అన్వయించుకోలేకపోతున్నారు. దీని వలన విద్యాకాలం తర్వాత కూడా వారు తిరిగి కోచింగ్ సెంటర్లకు లేదా ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్లకు వెళ్లాల్సి వస్తోంది. మన విద్యా విధానం చాలా వరకు పుస్తకాలకే పరిమితమైపోయింది. కోర్సులు రూపకల్పనలో ఉద్యోగ అవకాశాలను పట్టించుకోకపోవడం వల్ల విద్యార్థులు మార్కులు తెచ్చుకున్నా, వృత్తిపరమైన అవకాశాలుదొరకడం లేదు. పాత సిలబస్ ఆధారంగా బోధించడం వల్ల కొత్త టెక్నాలజీలు, పరిశ్రమలో జరుగుతున్న మార్పులు విద్యార్థులకు తెలియవు. ఇంతకీ, చాలా మంది విద్యార్థులు నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారు. కొన్నిసార్లు నిరుపయోగమైన కోర్సులు కూడా నడుస్తూనే ఉన్నాయి. విద్యార్థులకు వృత్తి శిక్షణ,స్టార్టప్ ప్రోత్సాహం, పరిశ్రమలతో అనుసంధానం వంటి అంశాలు చాలా తక్కువ స్థాయిలో మాత్రమే అమలవుతున్నాయి. ఫలితంగా, విద్య పూర్తి చేసినా వారి చేతిలో సరైన పనులు ఉండడం లేదు. మరోవైపు, ప్రభుత్వ విధానాలు కూడా సమయానికి మార్పులు చేయకపోవడం వల్ల ఈ లోపాలు కొనసాగుతున్నాయి. ఒక కోర్సు చదివిన విద్యార్థి ఆ రంగంలో పని దొరకక, వేరే రంగాల్లో తక్కువ వేతనాలతో పని చేయాల్సి వస్తోంది. ఇది విద్యార్థులలో నిరాశను పెంచుతుంది. ప్రభుత్వం ఏ దేశానికైనా ఆర్థికాభివృద్ధికి ప్రధాన ఆధారం. కానీ, మన రాష్ట్రంలో, దేశంలో వేల సంఖ్యలో ప్రభుత్వ ఉద్యోగాల ఖాళీలు సంవత్సరాల తరబడి భర్తీ చేయకుండా ఉంచడం వలన నిరుద్యోగులలో ఆందోళన పెరిగింది. పాఠశాలలలో ఉపాధ్యాయుల కొరత, ఆసుపత్రుల్లో డాక్టర్ల కొరత, కార్యాలయాల్లో సిబ్బంది కొరత వల్ల ప్రజా సేవలు దెబ్బతిన్నాయి. ఖాళీలు ఉన్నా వాటిని భర్తీ చేయకుండా కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానాలను ప్రోత్సహించడం వల్ల నాణ్యత తగ్గి, నిరుద్యోగులకు శాశ్వత ఉపాధి దొరకడం లేదు. పారదర్శకమైన రిక్రూట్‌మెంట్ ప్రక్రియ ఉండకపోవడం,పరీక్షలలో ఆలస్యం, కోర్టు కేసులు, అవినీతి కారణంగా విద్యార్థుల జీవితాలు ఇబ్బందులకు గురవుతున్నాయి.ప్రభుత్వం ఖాళీల సంఖ్యను స్పష్టంగా ప్రకటించి, సమయానికి నోటిఫికేషన్లు విడుదల చేసి, పారదర్శకంగా నియామకాలు జరపాలి. అనేకమంది ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్,ఇతరకోర్సులు చదివి ప్రైవేట్‌రంగంలో ఉద్యోగాలు చేస్తున్నారు. కానీ అక్కడ జీతాలు తక్కువగా, పని గంటలు ఎక్కువగా ఉండటం, ఉద్యోగ భద్రత లేకపోవడం ప్రధాన సమస్య. చాలా కంపెనీలు ఫ్రెషర్స్‌కు కేవలం కొన్ని వేల రూపాయలే ఇస్తాయి. ఇది వారికష్టానికి సరిపోదు.అందువల్ల చాలామంది నిరుత్సాహానికిలోనై, నిరుద్యోగుల్లాగే తిరుగుతున్నారు.ప్రైవేట్‌రంగంకూడా ఉద్యోగులను కేవలం శ్రమ శక్తిగా కాకుండా మానవ వనరులుగా చూడాలి.వారి నైపుణ్యాలకు తగ్గజీతాలు ఇవ్వాలి.సెక్యూరిటీ, పీఎఫ్, ఇన్సూరెన్స్,ప్రమోషన్ అవకాశాలు కల్పించాలి. నేటి నిరుద్యోగ సమస్యలో పెద్ద కారణం మన విద్యావ్యవస్థ. హెల్త్‌కేర్, డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ మార్కెటింగ్ వంటి రంగాల్లో ఉద్యోగాలు పెరుగుతున్నాయి.కానీ మన కాలేజీల్లో ఆ కోర్సులు చాలాపరిమితంగా ఉన్నాయి. అందువల్ల విద్యావ్యవస్థను పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా మార్చాలి. యువత కేవలం ఉద్యోగాలకోసం కాకుండాస్వయం ఉపాధి, స్టార్టప్‌లు,నైపుణ్యాభివృద్ధి వైపుదృష్టి సారించాలి. యువతలో చాలా మంది కేవలం ప్రభుత్వ ఉద్యోగాలపైనే ఆధారపడుతున్నారు. కానీ వాస్తవానికి ప్రతిఒక్కరికీ ప్రభుత్వ ఉద్యోగం దొరకదు.కాబట్టి యువత తనఆలోచనా విధానాన్ని మార్చుకోవాలి. కొత్త తరహా ఉపాధిఅవకాశాలను అన్వేషించాలి. ●

# మట్టి గణపతే మన పర్యావరణ హితుడు

డాక్టర్ మోటె చిరంజీవి

వినాయక చవితి సందర్భంగా ఇళ్లల్లో కొలువుదీర్చే గణపయ్యలను ముఖ్యంగా విద్యావంతులు, పర్యావరణ ప్రేమికులు మట్టితో చేసిన విగ్రహాలనే కొలువుదీర్చి పూజలు చేస్తున్నారు. అందువల్ల వివిధ రాష్ట్రాలలో, జిల్లాలో, వివిధ ప్రాంతాల్లో కళాకారులు మట్టితో చిన్న విగ్రహాలను తయారు చేస్తున్నారు. ప్రస్తుతం వినాయక చవితి పండుగకు అతి తక్కువ సమయం ఉండటంతో వ్యాపారులు మట్టితో తయారు చేసిన విగ్రహాలను సిద్ధం చేస్తున్నారు. మట్టితో తయారు చేసే విగ్రహాలకు మంచి డిమాండ్ కూడా ఉంది. మట్టికి, మనిషికి విడదీయరాని బంధం ఉంది. ఒక్క మాటలో చెప్పాలంటే మానవ మనుగడ ప్రకృతితో ముడిపడి వుంది. ప్రకృతి ఆరాధనతో మొదలైన పూజలు ఇప్పుడు విగ్రహ ఆరాధన వరకు వచ్చాయి. సాధారణంగామిగతా దేవతామూర్తుల విగ్రహాలను కళాకారులు రాయితో మలుచుతారు. అయితే వినాయక చవితి ఉత్సవాల అనంతరం స్వామివారి విగ్రహాన్ని నిమజ్జనం చేయాల్సి వున్నందున కళాకారులు సులువుగా విగ్రహాలను తయారు చేసేందుకు ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో గణపయ్య విగ్రహాలను తయారు చేస్తున్నారు. ఇటీవల కాలంలో విగ్రహాల ఏర్పాటు సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. వేల సంఖ్యల్లో పెద్ద విగ్రహాలను మండపాల్లో ఏర్పాటు చేస్తున్నారు. ఈ విగ్రహాల వల్ల పర్యావరణానికి పెనుముప్పు సంభవించే ప్రమాదముందని విద్యావంతులు, పర్యావరణ ప్రేమికులు ఆందోళన చెందుతున్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో చేసిన ఎత్తయిన విగ్రహాలు నీటిలో కరిగి దానినుంచి వెలువడే వ్యర్థాలతో ఆయా చెరువులు పూర్తిగా కలుషితం కావడం ఎంతో దారుణం. ఆ నీటిలో ఆవాసాన్ని ఏర్పరచుకున్న చేపలు, చిన్న చిన్న జీవులు, ఆ చెరువు నీటిని తాగేందుకు దిగివచ్చే పక్షులు, ఇలా ఆ నీటితో ప్రత్యక్షంగా సంబంధమున్న జీవుల మనుగడ ప్రశ్నార్థంగా మారుతుంది. దేశ వ్యాప్తంగా ప్రతిష్టించిన విగ్రహాలలో దాదాపు ప్లాస్టర్ పారిస్ విగ్రహాల సంఖ్య అధికంగా ఉంది. ఉత్సవాల అనంతరం ఎంతో అట్టహాసంగా సాగిన నిమజ్జనం తర్వాత ఆయా చెరువుల్లో చెత్తను వెలికి తీయడం పెద్ద పని. దాని ప్రకారం గత



ఏడాది కంటే ఈ ఏడాది విగ్రహాల కంటే వ్యర్థాలు బాగా పెరిగినట్టుగా చెబుతున్నారు. నిమజ్జనం చేసిన విగ్రహాలతో పాటు పూజలో వినియోగించిన సామగ్రిని కూడా చెరువులోనే వేస్తారు భక్తులు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ అనగా పీఓపీ విగ్రహాల వల్ల నీటి కాలుష్యం, ఆక్సిజన్ స్థాయిలు తగ్గడం, జలచరాలకు హాని, మట్టి ఆరోగ్యం దెబ్బతినడం వంటి పర్యావరణ నష్టాలు ఉన్నాయి. పర్యావరణానికి హాని కలిగించే ఈ పదార్థాన్ని వాడకుండా, సంప్రదాయ మట్టి విగ్రహాలను ప్రోత్సహించాలని అధికారులు, పర్యావరణ నిపుణులు సూచిస్తున్నారు. మట్టి గణపతిని పూజించటంలో యోగశాస్త్ర రహస్యాలు కూడా ఉన్నాయి. మానవ శరీరంలో ఉండే షట్చక్రాల్లో మొదటిది మూలాధార చక్రం. ఇది వెన్నుపూస ప్రారంభంలో ఉంటుంది.యోగశాస్త్రం ప్రకారంమూలాధార చక్రానికి అధిష్ఠాన దేవత గణపతి. మూలాధారం పృథ్వీతత్తం కలిగి ఉంటుంది.పృథ్వి అంటే భూమి. కాబట్టి, భూమికి సంకేతంగా మట్టితో విగ్రహం చేసి, మూలాధారానికి అధిదేవుడైన గణపతికి అర్చించాలి. దీనివల్ల గణపతి అనుగ్రహం సత్వరమే కలు గుతుంది. ఇలా మట్టి వినాయకున్ని నిమజ్జనం చేయడం వల్ల చెరువులు, నదులు కలుషితం కావు. పర్యావరణానికి ఎంతో మేలు చేసినట్టవుతుంది. భగవంతుని పూజకు భక్తి ప్రధానం. భక్తి లేకుండా బంగారు విగ్రహాన్ని పూజించినా ఫలితం ఉండదు. త్రికరణ శుద్ధితో, భక్తి శ్రద్ధలతో చిన్న వినాయకుని పూజించినా ఫలితం ఉంటుంది. అంతేకాని ఆర్భాటాలకు, గొప్పలకు పోయి పెద్దపెద్ద విగ్రహాలను పెట్టి తరువాత వాటిని నిమజ్జనం చేసేటప్పుడు ఎన్నో ఇబ్బందులు పడాల్సి వస్తుంది. పెద్ద విగ్రహాల తయారీలో వాడే వస్తువులు నీటిలో కరిగిపోవు. నీటి కాలుష్యానికి కారణమయ్యే అనేక రకాల కృత్రిమ రంగులు, కెమికల్స్ వీటిలో ఉంటాయి. వినాయక చవితిని సింపుల్‌గా చేసు కోవడం వల్ల నష్టమేమీ లేదు.ఎంత భక్తిగా దేవుని పూజి స్తున్నామో ముఖ్యం గానీ, ఎంత ఆడంబరంగా చేస్తున్నా మన్నది ముఖ్యం కాదు. మనచుట్టూ ఉండే ప్రకృతే దైవ స్వరూపం. కనిపించే ప్రకృతిని నాశనం చేస్తూ కనబడని దేవుని పూజిస్తే ఎలాంటి ప్రయోజనం లేదు. ప్రకృతిని దైవంగా భావిస్తూ మట్టి గణపతి పూజిద్దాం.పర్యావరణాన్ని పరిరక్షిద్దాం. ●

# చిన్నారులపై సోషల్ మీడియా విధ్వంసాన్ని ఆపేదెలా?

సంపతి రమేష్ మహారాజ్

నేటి ఆధునిక యుగంలో సామాజిక మాధ్యమాలు,ఓటిపి వెబ్ సిరీస్ వినియోగం విపరీతంగా పెరుగుతుంది. ఇవీ పిల్లల మనస్తత్వంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. హింసాత్మక ఘటనలకు దారి తీస్తున్నాయి. ఇటీవల కూకట్‌పల్లిలో జరిగిన బాలిక హత్యకేసులో మైనర్ బాలుడు క్రైమ్ వెబ్ సిరీస్‌తో ప్రేరణ పొందినట్లు పోలీసులు గుర్తించారు. చోరీ చేయడం ఆన్లైన్ వేదికలలో తెలుసుకొని చేశాడు. చోరీని బాలిక చూడడంతో ఆమెను కిరాతకంగా చంపాడు. బెంగళూరులో ఓ బాలుడు (14) వెబ్ సిరీస్ చూసి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సిరీస్‌లోని ఓ క్యారెక్టర్ బొమ్మను కూడా తన గదిలో గీశాడు. కొందరు యువకులు ఒక బైక్ పై ఎనిమిది మంది ఎక్కి నడపడం వంటి సాహసాలకు ఒడిగడుతున్నారు. పిల్లల్లో ఇలాంటి విపరీత ప్రవర్తనకు స్మార్ట్ ఫోన్ వినియోగం, ఓటీటీ వెబ్ సిరీస్లు ప్రధాన కారణమని పలు అధ్యయనాలు చెప్తున్నాయి. చిన్నారులు ఎదుగుతున్న దశలో సోషల్ మీడియా, ఆన్లైన్ గేమ్స్‌లకు బానిసవడం వలన వారిలో విపరీత ప్రవర్తన, దూకుడు స్వభావం పెచ్చురిల్లుతుంది. పగ, శత్రుత్వం, దాడులకు ఉసిగొలుపుతున్నాయి. తద్వారా నేరాల బారిన పడుతున్నారు. కొన్నిసార్లు ఇవి శాంతిభద్రత సమస్యలుగా మారుతున్నాయి. సామాజిక మాధ్యమాలు తరచూ వీక్షించడం వలన పిలల్లో ఓపిక, సహనం, ఆలోచన శక్తి నశిస్తుంది. విద్య విషయాలలో వెనకబడుతున్నారు. విలువలు పతనమవుతున్నాయి. పిల్లలు పెద్దలపట్ల గౌరవం మర్యాద లేకుండా ప్రవర్తిస్తున్నారు. ప్రస్తుతం వాట్సప్, ఫేస్బుక్, ఎక్స్, ట్విట్టర్, ఇన్స్టాగ్రామ్, యూట్యూబ్, వంటి ఆన్లైన్ వేదికలు సామాజిక, విద్య, ఆర్థిక, రాజకీయ సంబంధిత విషయాల తెలుసుకోవడానికి ఎంతగానో దోహదపడుతున్నాయి. మారుమూల ప్రాంతాల అణచివేయబడిన వర్గాల గొంతును వినిపిస్తున్నాయి. సామాజిక చైతన్యానికి ఊపిరిలూదుతున్నాయి. వీటి ద్వారానే కొన్నిసార్లు ప్రభుత్వం, అధికారుల స్పందన కూడా ఉంటుంది. ఒకప్పుడు పెద్దలకే పరిమితమైన ఈ ఆన్లైన్ వేదికలు ఇప్పుడు పిల్లల్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. ఆటపాటలతో సాగే బాల్యం మొబైల్ స్క్రీన్‌ఇరుక్కుపోయింది. వీటినుంచి పిల్లల్ని కట్టడి చేయడం తల్లిదండ్రులకు తలనొప్పిగా మారింది. సామాజిక మాధ్యమాలను నియంత్రించకపోతే భవిష్యత్తు భావి పౌర సమాజం అంధకారమయ్యే ప్రమాదం ఉందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ఈ నేపథ్యంలో పలు దేశాలు సామాజిక మాధ్యమాలనుంచి పిల్లలను దూరంగా చేయాలని ఆలోచిస్తున్నాయి. తల్లిదండ్రులు కూడా ప్రభుత్వాలపై ఒత్తిడి చేస్తున్నారు. గత ఏడాది ఆస్ట్రేలియా ప్రభుత్వం తమ దేశంలో 16 ఏళ్లలోపు పిల్లలు సామాజిక మాధ్యమాలు వినియోగించడంపై నిషేధం విధించింది. ఇప్పుడు ఫ్రాన్స్ కూడా అదే బాటలో నడిచే ప్రయత్నం చేస్తుంది. ఇటీవల తూర్పు ఫ్రాన్స్‌లోని నోజెంట్ పట్టణంలోని ఓ పాఠశాలలో విద్యార్థి దాడి ఘటన తర్వాత 15 ఏళ్ల లోపు వారికి సోషల్ మీడియాను నిషేధించే యోచనలో ప్రభుత్వం ఉందని ఫ్రాన్స్ ప్రధాని పేర్కొన్నారు. ఈ విషయంలో ఈయూ నిర్ణయం కోసం వేచి చూస్తున్నామని లేదా తామే అమలు చేస్తామని ప్రకటించాడు. ఇలాంటి కఠిన నిర్ణయం తీసుకున్న రెండో దేశంగా ఫ్రాన్స్ నిలిచే అవకాశం ఉంది. చిన్నారులు, యువతపై సామాజిక మాధ్యమాల దుష్ప్రభావంపై ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు వ్యక్తమవుతున్న తరుణంలో ఫ్రాన్స్ ప్రభుత్వం నిర్ణయంపై చర్చ జరుగుతుంది. పిల్లల భవిష్యత్తు దృష్ట్యా సామాజిక మాధ్యమాల నియంత్రణపై ప్రపంచ దేశాలు ఆలోచిస్తున్నాయి. ప్రపంచంలో అత్యధికంగా బాల జనాభా గల భారత దేశంలో బాలల్ని సామాజిక మాధ్యమాల వ్యసనం నుంచి దూరం చేయాలి. ప్రభుత్వ పరంగా చట్టపరమైన చర్యలు కూడా తీసుకోవాలి. 2023లో కర్ణాటక హైకోర్టు పాఠశాల పిల్లలు సామాజిక మాధ్యమాలకు అధికంగా వ్యసనం కావడం పట్ల ఆందోళనల వ్యక్తం చేసింది. ఈ మేరకు కోర్టు వీటిని వినియోగించడానికి 21సంవత్సరాల వయోపరిమితిని అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ యాక్ట్ 2023పిల్లలు సోషల్ మీడియా వినియోగించడంలో కొన్ని షరతులను విధించింది. 18సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలు ఆన్లైన్ డేటాను నిర్వహించడానికి కంపెనీలు తల్లిదండ్రుల సమ్మతి తీసుకోవాలని చెప్పింది. బాలల లక్ష్యంగా ఉండే ప్రకటనలపై పరిమితులు విధించింది. పిల్లల్లో నేర ప్రవృత్తి పెరుగుతున్న నేపథ్యంలో పిల్లలను డిజిటల్ పరికరాలకు దూరం చేయడం ముఖ్యమైన అంశం. అప్పుడప్పుడు విద్యా అవసరాలకు వినియోగిస్తున్నప్పుడు ఏం చూస్తున్నారో తల్లిదండ్రులు గమనించాలి. వారిలో విపరీత పోకడలను సరిదిద్దాలి. ఇంట్లో కుటుంబ సభ్యులు వారానికి ఒకసారి ఫోన్ హాలిడే పెట్టుకోవాలి. ఇటీవల ఛత్తీస్‌గఢ్‌లోని రాజ్నంద్ గావ్ జిల్లా గహీరాబేడీ గ్రామ పంచాయతీలో పిల్లలు ఫోన్ గేములు ఆడితే తల్లిదండ్రులకు రూ.3,000 జరిమానా విధిస్తామని ఆంక్షలు పెట్టారు. దీంతో ఆ గ్రామంలో చాలావరకు మార్పు కనిపించింది.ఇలాంటి కట్టడి ప్రతిగ్రామంలోరావాలి. ఆన్లైన్ మనీ గేమ్‌తో యువత ఆర్థికంగా నష్టపోతుంది. ఈ క్రమంలో ఇటీవల కేంద్రం తీసుకువచ్చిన ఆన్లైన్ గేమ్ నియంత్రణ బిల్లు2025 ను ఆమోదించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలకు కుటుంబ బంధుత్వాలు, విలువల గురించి బోధించాలి. పిల్లలతో కలిసి ఆడుకోనివ్వాలి. ●

Main tab page 111_Main tab page 111.qxd 8/27/2025 12:19 AM Page 1



## వినాయక చవితి శుభాకాంక్షలు

**- ఎంపీ మాగుంట, మంత్రి డోలా, ఎమ్మెల్యే దామచర్ల, మాజీ మంత్రులు బాలినేని, శిద్దా**

**ఒంగోలు, ప్రభాతవార్త**







జిల్లా ప్రజలకు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి, ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు, మాజీ మంత్రులు బాలినేని శ్రీనివాసరెడ్డి, శిద్దా రాఘవరావులు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ విఘ్నాలకు సకల దేవగణాలకు అధిపతి, అన్ని శుభకార్యాలలో తొలి పూజ అందుకొని వినాయకస్వామి భాద్రపద మాసం చవితి నాడు జన్మించినందున ఆ రోజున దేశ ప్రజలు వినాయకచవితిగా జరుపుకొంటారు. స్వాతంత్ర్య పోరాట సమయంలో ప్రజల్లో జాతీయ స్ఫూర్తిని పెంపొందించుటకు సామూహిక గణపతి ఉత్సవాలకు శ్రీకారం చుట్టడం జరిగింది. విఘ్నేశ్వరస్వామిని ప్రార్ధించడం వలన ఎలాంటి ఆటంకాలు లేకుండా సకల కార్యసిద్ది జరిగి మనకు ఆనందమయ జీవితం ప్రాప్తించును. కనుక మట్టితో చేసిన విఘ్నేశ్వరస్వామిని నవరాత్రులు జిల్లా ప్రజలందరు ఇండ్లలోను సమూహికంగాను నిష్టతో పూజించి, ఈ పండుగను సాంప్రదాయబద్దంగా జరుపుకోవాలని కోరుచూ మీకు వినాయక చవితి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

## కురిచేటి ఝాన్సీలక్ష్మీ బాయికి సర్టిఫికేటు ప్రదానం

**ఒంగోలుటౌన్, ప్రభాతవార్త**

టంగుటూరు మండలం కొణిజేడు జిల్లాపరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్న కురిచేటి ఝాన్సీలక్ష్మీ బాయి, ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలో నెలరోజుల పాటు ఆన్ లైన్/ఆఫ్ లైన్‌లో నిర్వహించిన వ్యక్తిత్వ వికాస శిక్షణాకార్యక్రమాన్ని పూర్తిచేసినందుకు సందర్భంగా హైదరాబాదులోని శిక్షణాకేంద్రంలో ఇంపాక్ట్ ఫౌండర్ గంపా నాగేశ్వరరావు ఆమెకు ఇంపాక్ట్ సర్టిఫైడ్ ట్రైనర్గా సర్టిఫికేటు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కొణిజేడు పాఠశాలలోని ఉపాధ్యాయులు, సిబ్బంది ఆమెను అభినందించారు. పద్యసారస్వత పరిషత్ జాతీయ అధ్యక్షులు,పద్యభారతి శ్రీచరణ వాద లక్ష్మీనరసింహ రావు, భావితరంలో ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఝాన్సీలక్ష్మీబాయిని ఆశీర్వదించారు. పద్య సారస్వత పరిషత్ కార్యవర్గ సభ్యులందరూ ఆమెను అభినందించారు.

## ఘనంగా బూచేపల్లి పుట్టినరోజు వేడుకలు

**చీమకుర్తి, ఆగస్టు 26, ప్రభాతవార్త**




ప్రకాశం జిల్లా జడ్పీ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పుట్టినరోజు వేడుకలు చీమకుర్తిలో మంగళవారం ఘనంగా జరిగాయి. దర్శి నియోజకవర్గం లోని ఐదు మండలాలు, చీమకుర్తి నుంచే కాకుండా జిల్లా నలుమూలల నుంచి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, బూచేపల్లి అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై బూచేపల్లి వెంకాయమ్మకు శుభాకాంక్షలు తెలిపారు. చీమకుర్తి గాంధీ నగర్ లోని వారి నివాసం ఈ సందర్భంగా ప్రజల రాకతో కళకళ లాడింది. ఇక్కడి నుంచి నేరుగా కాన్వాయ్ తో బూచేపల్లి కమలాకర్‌రెడ్డి పార్కుకు చేరుకున్నారు. పార్కులోని దివంగత బూచేపల్లి సుబ్బారెడ్డి ఘాట్ వద్ద పూలమాలలు అర్పించి నివాళులర్పించారు. అభిమానులు ఏర్పాటు చేసిన భారీ కేకును కట్ చేయగా, వారి తనయుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి ప్రేమ పూర్వకంగా అమ్మకు తినిపించారు. బూచేపల్లి నాయకత్వం వర్ధిల్లాలి అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. సంతనూతలపాడు, ఒంగోలు, కనిగిరి నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జిలు డాక్టర్ మెరుగ నాగార్జున, చుండూరి రవిబాబు, దద్దాల నారాయణ లు బూచేపల్లికి పుష్పగుచ్చాన్ని అందించి శాలువా కప్పి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, జిల్లా సీనియర్ నాయకుడు బత్తుల బ్రహ్మానంద రెడ్డి, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి మన్నం శ్రీధర్ బాబు , చీమకుర్తి మున్సిపల్ చైర్ పర్సన్ గోపురపు రాజ్యలక్ష్మి చంద్ర, జడ్పిటిసి సభ్యులు వేమా శ్రీనివాసరావు, ఎంపిపీ యద్దనపూడి శ్రీనివాసరావు, మండల, పట్టణ పార్టీ అధ్యక్షులు పమిడి వెంకటేశ్వర్లు, క్రిష్టిపాటి శేఖర రెడ్డి, జిల్లాకు చెందిన పలువురు జడ్పిటిసి సభ్యులు, పలువురు కౌన్సిలర్లు సర్పంచులు నాయకులు హాజరై శుభాకాంక్షలు తెలిపారు.

## రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మట్టి వినాయకుల పంపిణీ

**చీమకుర్తి, ఆగస్టు 26, ప్రభాతవార్త**



చీమకుర్తి రోటరీ బస్టాండ్ నందు రోటరీ క్లబ్ ఆఫ్ చీమకుర్తి ఆధ్వర్యంలో మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. అధ్యక్ష ,కార్యదర్శులు తొగటి శ్రీను, పారెళ్ళ శ్రీనివాసరావు ఆర్థిక సహకారంతో,వినాయక చవితి సందర్భంగా భక్తులకు మట్టి వినాయక విగ్రహాలని మంగళవారం అందజేశారు. అలాగే వినాయక వ్రతకల్పం పుస్తకాన్ని కూడా ఉచితంగా పంపిణీ చేయడం జరిగింది. మాజీ అధ్యక్షులు కడవా రామకృష్ణ ,పోకూరి రామకృష్ణారెడ్డి, మాజీ కార్యదర్శులు అంబటి వీరారెడ్డి, ఎడ్లపల్లి సురేష మార్తులతిరుపతిరెడ్డి,నాగళ్ళ సత్యం,పోతుల పెదవీర నారాయణ ఇంకా రోటరీ సభ్యులు పాల్గొన్నారు.మట్టి వినాయక విగ్రహాలు చీమకుర్తి లిటిల్ స్టార్ హై స్కూల్ ఆధ్వర్యంలో లిటిల్ స్టార్ హై స్కూల్ ఆధ్వర్యంలో 500 మట్టి వినాయక విగ్రహాలను మంగళవారం పంపిణీ చేశారు. చీమకుర్తి పట్టణం లోని లిటిల్ స్టార్ హై స్కూల్ సెక్రటరీ అండ్ కరెస్పాండంట్ మారెళ్ళ శ్రీనివాసరావు అధ్యక్షతన మండల విద్యాశాఖ అధికారులు నరసింహ రావు, మరియు శివాజీ చేతులు మీదగా విద్యార్థులుకు మరియు ప్రజలకు పంపిణీ చేసి చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం లిటిల్ స్టార్ హై స్కూల్ యాజమాన్యం చేసినటువంటి కృషిని అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రజియా సుల్తానా, మరియు పాఠశాల ఇంచార్జి సత్యనారాయణ, ఎ. ఒ. చిరంజీవి, టీచర్స్ మమత, శైలజ, సుజాత, విజయలక్ష్మి, తల్లిదండ్రులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## గ్రామాలకు తరలిన గణనాథుడు

**కొండపి, ప్రభాతవార్త**



నేడు వినాయక చవితి పర్వదినం పురస్కరించుకొని భక్తులు గణేష్ విగ్రహాలను ఆయా గ్రామాలకు భారీగా తరలించారు. తెలుగువారి ప్రధాన పండుగలు ఒకటైన వినాయక చవితి సందర్భంగా ప్రతి గ్రామంలో వినాయకుని విగ్రహాన్ని ప్రతిష్టించుకుని పూజలు నిర్వహించుకోవడం జరుగుతుంది. మండలంలోని ప్రతి గ్రామంలో ఒకటి లేదా 2 అంతకు మించి విగ్రహాలు ప్రతిష్టించుకుని పూజలు నిర్వహిస్తారు. కొండపిలో తయారైన విగ్నేశ్వరుని, విగ్రహాలను భక్తులు భారీగానే కొనుగోలు చేశారు. పదివేల నుండి దాదాపు 50 వేల వరకు, ఉన్న విగ్రహాలను భక్తులు ధరకు వెనుకాడకుండా స్వామివారిని కొలి చేందుకు కొనుగోలు చేశారు. మంగళవా రం మధ్యాహ్నం నుంచి భక్తులు విగ్రహాలు కొనుగోలుతో కొండపిలో సందడి నెలకొంది.

**223 విగ్రహాలకు అనుమతులు**

కొండపి సర్కిల్ పరిధిలోని మూడు మండాలలో నేడు జరిగే వినాయకచవితి పండుగ పురస్కరించుకొని 223 విగ్రహాలకు అనుమతులు ఇవ్వడం జరిగిందని కొండపి సర్కిల్ సిఐ సోమశేఖర్ తెలిపారు. కొండపి మండలంలో 76, మర్రిపూడి 68, పొన్నలూరు 79 విగ్రహాలకు అన మతులు ఇవ్వడం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరు ఎటువంటి అవాంచనీయ సంఘటనలు తావు ఇవ్వకుండా పండుగను బాగా జరుపుకోవాలని ఆయన కోరారు. విగ్రహాల ఊరేగింపు రో జు అతిగా బాణా సంచా, డిజేలు వాడకం తగ్గించుకోవాలని సూచించారు.

**సామంతపూడి గ్రామ పంచాయతీ, దర్శి మండలం, ప్రకాశం జిల్లా**
**టెండర్-కం-బహిరంగ వేలం ప్రకటన**

ఆర్.ఓ.సి.నెం. 02/2025 తేది: 26.08.2025

ప్రకాశం జిల్లా, దర్శి మండలం, సామంతపూడి గ్రామ పంచాయతీ పరిధిలో గ్రామ పంచాయతీ చేపల చెరువులో చేపలు వేసి పెంచి పట్టుకొనుటకుగాను 2025-26, 2026-27 మరియు 2027-28 అనగా మూడు సంవత్సరములకు టెండర్-కం-బహిరంగ వేలం తేది04.09.2025న ఉదయం 10.00 గంటల నుండి మధ్యాహ్నం 4.00 గంటల వరకు శ్రీయుత జిల్లా పంచాయతీ అధికారి వారి సమక్షంలో లేదా వారి అనుమతి పొందిన వారి సమక్షంలో సామంతపూడి గ్రామ సచివాలయం వద్ద టెండర్-కం-బహిరంగ వేలం పద్దతి ద్వారా జరపబడును.

షరతులు: 1. సామంతపూడి గ్రామ సచివాలయం వద్ద అదే రోజు రూ. 1,000/-లు చెల్లించి ఉదయం 10.00 గంటల నుండి మధ్యాహ్నం 12.00 గంటల లోపు టెండర్ ఫారం పొందవలెను. 2. పూర్తి చేసిన టెండర్ షెడ్యూలు ఫారం అదే రోజు మధ్యాహ్నం 1.00 గంటల వరకు మాత్రమే స్వీకరించబడును. 3. సీల్డు టెండర్ కం షెడ్యూలు ఫారంతో రూ. 7,87,500/- లు ఏదైనా బ్యాంక్ నుండి పంచాయతీ కార్యదర్శి, గ్రామ పంచాయతీ, సామంతపూడి పేరు మీద డి.డి. తీసి జతపరచవలెను. 4. బహిరంగ వేలములో పాల్గొనేవారు ధరావత్తు క్రింద రూ.7,87,500/-లు ముందుగా చెల్లించి వేలములో పాల్గొనవలెను. 5. టెండర్-కం వేలములో పాల్గొనువారు రూ.6,00,000/-లకు సాల్వెన్సీ సర్టిఫికేటు సమర్పించవలెను. 6. ప్రభుత్వ మద్దతు ధర రూ. 31,50,000/- రాని యెడల టెండరు కం బహిరంగ వేలము వాయిదా వేయుటకు మరియు రద్దు పరచుటకు పంచాయతీకి పూర్తి అధికారము కలదు. 7. టెండరులోగాని లేదా బహిరంగ వేలంలోగాని ఏది హెచ్చు మొత్తము అయినచో దానిని మాత్రమే స్వీకరించబడును. 8. పాటకు చెల్లించు ధరావత్తును చివరి సంవత్సరము కిస్తీలో జమచేసుకొనబడును. 9. టెండరు కం బహిరంగ వేలంపాటలో వచ్చిన హెచ్చు మొత్తమును మూడు సమాన కిస్తీలుగా విభజించి ఏ సంవత్సరము కిస్తీ ఆ సంవత్సరము జూలై నెల మొదటి వారంలో చెల్లించి చెరువులో చేపపిల్లలను వేసుకొనవలెను. అట్లు చెల్లించనిచో వారి టెండరు కం బహిరంగ వేలం పాటను రద్దు చేసి తిరిగి వేలం పాటను నిర్వహించబడును. మరల జరుగు వేలం పాటలో తక్కువ మొత్తమునకు వచ్చిన ఎడల నష్టమును మొదటి పాటదారుని నుండి వసూలు చేయబడును. 10. రైతుల ప్రయోజనమునకు ఎటువంటి నష్టము కలిగించరాదు. 11. టెండరు కం బహిరంగ వేలంపాట జరిగిన 15 రోజులలో మొదటి సంవత్సరము కిస్తీ చెల్లించి పంచాయతీ వారికి స్టాంప్ మరియు రిజిస్ట్రేషన్ చట్టము ప్రకారం పంచాయతీ వారికి రిజిస్టర్ చేయవలెను.12. ప్రకృతి వైపరీత్యముల వలనగాని మరియు ఏ ఇతర కారణముల వలనగాని చెరువులోని చేపలకు నష్టము కలిగినచో ఆ నష్టమునకు పంచాయతీ వారికి ఎటువంటి బాధ్యత లేదు. అన్నియు పాటదారుడే భరించవలెను.13. ప్రకృతి వైపరీత్యములు వలన నష్టము వాటిల్లినచో వేలం కాలపరిమితి పొడిగించుటకుగాని సదరు మొత్తం వేలంపాట కిస్తీ రద్దుపరుచుటకుగాని వీలుపడదు. 14. వేలం యొక్క కాలపరిమితి 2025-26, 2026-27 మరియు 2027-28 అనగా 3 సంవత్సరములు అనగా తేది 01.07.2025 నుండి 30.06.2028 వరకు అనగా మూడు సంవత్సరములకు మాత్రమే. 15. ప్రకృతి వైపరీత్యముల వలన జరిగిన నష్టములకు గ్రామ పంచాయతీ ఎలాంటి నష్టపరిహారం చెల్లించదు. 16. కిస్తీని పూర్తిగా పంచాయతీ షరతుల మేరకు చెల్లించి పంచాయతీ కార్యదర్శిగారి లిఖిత పూర్వకమైన ఉత్తర్వులు పొంది చెరువులో చేపలను పెంచుకొనవలెను. 17. పంచాయతీకి బకాయిలు ఉన్నవారు వేలం పాటలో పాల్గొనుటకు అనర్హులు. 18. హెచ్చుపాటదారు ఇన్స్యూరెన్సు చేయించుకొనవలెను. 19. టెండరు షరతులు మిగతా వివరములు కార్యాలయం పనిచేయు వేళలో వచ్చి తెలుసుకొనవచ్చును.

సం/- ఏ. శ్రీనువాసులు
పంచాయతీ కార్యదర్శి,
సామంతపూడి గ్రామపంచాయతీ,
దర్శి మండలం, ప్రకాశం జిల్లా.
సెల్ నెం: 9705282132

సం/- అమరా గంగమ్మ
సర్పంచ్
సామంతపూడి గ్రామపంచాయతీ
దర్శి మండలం, ప్రకాశం జిల్లా.

ప్రకాశం
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## జిల్లా పరిషత్ చైర్మన్ వెంకాయమ్మకు నేతల శుభాకాంక్షలు

**ఒంగోలు, ప్రభాతవార్త**



ప్రకాశం జిల్లా పరిషత్ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ పుట్టిన రోజు వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ వేడుకల్లో కనిగిరి వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు, జడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, మండల రైతు అధ్యక్షుడు శ్రీహరిరెడ్డి, కనిగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ డాక్టర్ల వింగ్ అధ్యక్షుడు ఆవుల కృష్ణారెడ్డి, మడతల వెంకటరెడ్డి, తదితరులు పాల్గొని ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రజా సమస్యలపై ఉద్యమాలు మరింతగా ఉధృతం

*- రాష్ట్ర ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను ఖచ్చితంగా అమలు చేయాల్సిందే*
*- బ్లాక్ మార్కెట్లో ఎరువులు*
*- చోద్యం చేస్తున్న డబుల్ ఇంజన్ సర్కారు*
*- జాతీయ మహాసభల అనంతరం రాష్ట్ర కార్యదర్శి వర్గ కమిటీ, నూతన సహాయ కార్యదర్శులు, రాష్ట్ర కార్యదర్శిని ఎన్నుకోవడం జరుగుతుంది*
*- రాష్ట్ర మహాసభల విజయవంతానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు*
*- మీడియా సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే.రామకృష్ణ, రాష్ట్ర మహాసభలు ఆమోదించిన 62 తీర్మాణాలు విడుదల*

**ఒంగోలు, ప్రభాతవార్త**



రానున్న సకాలంలో పేద పక్షాన మరిన్ని ఉద్యమాలు ఉధృతం చేస్తామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే.రామకృష్ణ పేర్కొన్నారు. సీపీఐ రాష్ట్ర మహాసభలు విజయవంతమైన సందర్భంగా ఒంగోలులోని మల్లయ్య లింగం భవనంలో మంగళవారం సీపీఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే.రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర మహాసభలలో ప్రజలు నిత్యం ఎదుర్కొంటున్న సమస్యలపై 62 తీర్మాణాలను ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. ఈ 22 తార్మాణాలను రాష్ట్ర మహాసభల ప్రతినిధులు ఏకగ్రీవంగా ఆమోదించడం జరిగిందన్నారు. రానున్న కాలంలో ఆయా సమస్యలపై పోరాటాలు మరింత ఉధృతం చేసి ప్రజల పక్షాన నిలుస్తామని పేర్కొన్నారు. 32 మంది బలిదానంతో తెలుగు ప్రజలు సాధించుకున్న విశాఖ స్టీల్ ప్లాంట్ ను ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రాష్ట్ర మహాసభలలో తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు హామీ ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను ఖచ్చితంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని పేదలకు పట్టణ ప్రాంతంలో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతంలో మూడు సెంట్లు వంతున నివేశిత స్థలాలు ఇవ్వాలని, ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ఇవ్వాలని కోరారు. లేని పక్షంలో పేదల పక్షాన నిలిచి సీపీఐ ఇళ్ల స్థలాలు వచ్చేంత వరకు పోరాటం చేస్తుందని పేర్కొన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చంద్రబాబునాయుడు స్మార్ట్ మీటర్లపై పలు విమర్శలు చేశారని, దీనివల్ల ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని విమర్శలు చేశారన్నారు. జగన్ ప్రభుత్వం చేసుకున్న సోలార్ అగ్రిమెంట్ కారణంగా 25 సంవత్సరాల పాటు రాష్ట్రంలోని పేదలపై రూ.ఒక లక్షల పది వేల కోట్లు భారం పడుతుందని తెలిపారు. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత చంద్రబాబునాయుడు అదే అగ్రిమెంటును అనుసరిస్తూ పేదలపై విద్యుత్ భాగాలు మోపుతున్నారన్నారు. వీటి వ్యతిరేకంగా ఈ నెల 28వ తేదీన కలిసిసొచ్చే అన్ని రాజకీయ పార్టీలను కలుపుకొని ప్రజా ఉద్యమం నిర్మిస్తామని హెచ్చరించారు. సుపరి పాలన, డబుల్ ఇంజన్ సర్కార్ అని పేర్కొంటున్న కూటమి ప్రభుత్వం ఖరీఫ్ సీజన్లో ఎరువులను సక్రమంగా అందించడంలో విఫలం అయ్యారని ఈ సందర్భంగా విమర్శించారు. ఒక వైపు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెం న్నాయుడు 31 లక్షల 15 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమవుతాయని, ప్రస్తుతం రాష్ట్రంలో 21 లక్షల 34,3ల ఎరువులు ఉన్నాయని, మిగిలిన వాటి కోసం కూడా ఇండెంట్ పెట్టామని ప్రకటనలు చేస్తున్నారన్నారు. ఎరువులు ఎంత సమృద్ధిగా ఉంటే నేడు బ్లాక్ మార్కెట్లో 250 రూపాయల బస్తా యూరియా రూ.500 ఎందుకు పలుకుతుందో చెప్పాలని డిమాండ్ చేశారు. రైతులు వేకువజామున వచ్చి లైన్లో నిలబడుతున్న కనీసం బ్లాక్ మార్కెట్లో కూడా ఎరువులు దొరకట్లేదు అని ఈ సందర్భంగా ఆగ్రహం వ్యకతం చేశారు. ఇదేనా స్మార్ట్ ప్రభుత్వం అని ప్రశ్నించారు. డబ్బులు ఇంజన్ సర్కార్లో కేంద్రం నుండి కనీసం ఎరువులు కూడా తెప్పించుకోలేరా అని ప్రశ్నించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనందున యుద్ద ప్రాతిపదికన ప్రభుత్వం వెంటనే ఎరువుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా విలేకర్లు అడిగిన ఒక ప్రశ్నకు సమాధానం చెబుతూ సీపీఐ రాష్ట్ర మహాసభలు రాష్ట్ర కౌన్సిల్ 101 మంది, పది మంది కాండేట్ సభ్యులు ఎన్నోకోవడం జరిగిందన్నారు. అలాగే 31 మంది సభ్యులు ఇద్దరు ఆహ్వానితులతో రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగిందన్నారు. ఇక సెక్రటేరియట్, అసిస్టెంట్ సెక్రటరీ, సెక్రటరీలను పార్టీ జాతీయ మహాసభల అనంతరం విజయవాడలో కౌన్సిల్ ఏర్పాటు చేసి జాతీయ నాయకుల సమక్షంలో ఎన్నుకోవడం జరుగుతుందని తెలిపారు. జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, జాతీయ కార్యదర్శి కే.నారాయణలకు అర్జెంటు పనులు ఉన్న కారణంగా సెక్రటరీ ఎన్నిక వాయిదా పడినట్లు తెలిపారు. వారిచ్చిన సూచనలు మేరకు అప్పటి వరకు సెక్రటేరియట్, అసిస్టెంట్ సెక్రటరీలు, రాష్ట్ర సెక్రటరీ యధాతంగా కొనసాగించాలని సూచించారన్నారు. రాష్ట్ర మహాసభ కేవలం రాష్ట్ర కౌన్సిల్ ఎన్నుకోవడంతో ముగిసిందని అన్నారు. కౌన్సిల్ సమావేశం రాష్ట్ర కార్యవర్గాన్ని, కార్యదర్శి వర్గాన్ని, అసిస్టెంట్ సెక్రటరీలను, సెక్రటరీలను ఎన్నుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. మీడియా రాష్ట్ర మహాసభ విజయవంతంలో పూర్తి స్థాయిలో సహాయ సహకారాలు అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే రాష్ట్ర మహాసభల విజయవంతానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర మహాసభలలో ఏకగ్రీవమైన తీర్మానాలు ఇవే ఈనెల 23వ తేదీ నుండి 25వ తేదీ వరకు ఒంగోలులో జరిగిన సీపీఐ రాష్ట్ర 28వ మహాసభలలో 62 తీర్మానాలను మహాసభ ప్రతినిధులు ఏకగ్రీవంగా ఆమోదించారు. అవి విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా తీర్మానం, కేంద్రంలోని బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో జరుగుతున్న ముస్లిం మైనార్టీలపై దాడులను ఖండిస్తూ ఆచార వ్యవహారాలపై వేదింపులను ఖండిస్తూ ఉపాధి రంగం నుండి ముస్లింలను దూరంగా పెట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్న తీరును విమర్శిస్తూ ముస్లిం మైనార్టీలపై ఉన్న వివక్షను తొలగించాలని డిమాండ్ చేస్తూ ఇన్సాఫ్ ఆధ్వర్యంలో తీర్మానం ప్రవేశపెట్టడం జరిగింది. ఇవే కాకుండా రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న 10 సమస్యలపై తీర్మానాలను రాష్ట్ర మహాసభలను ప్రవేశపెట్టడం జరిగింది. వీటిని మహాసభ ప్రతినిధులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. ఈ మీడియా సమావేశంలో సీపీఐ ప్రకాశం జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ పాల్గొన్నారు.

## మార్కాపురాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేయటమే నా లక్ష్యం

**- ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి**

**మార్కాపురం రూరల్, ఆగస్టు 26 ప్రభాతవార్త :**

మార్కాపురం పట్టణంలో సోమవారం వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ మాలపాటి వెంకట రెడ్డిఇ, వైస్ ఛైర్మన్ దొండపాటి వెంకటేశ్వర్లు, పాలకమండలి డైరెక్టర్ల చేత పదవీ విరమణ స్వీకారోత్సవం శాసన సభ్యులు కందుల నారాయణరెడ్డి చేయించడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డిఇ మాట్లాడుతూ చెరువుకట్ట వెడల్పు చేసి ట్యాంక్‌బండ్‌లా చేయాలని, మార్కాపురం తర్లుపాడు రోడ్డు డబుల్ రోడ్డు చేయాలని ఇది నా కల అని, మార్కాపురం అన్ని విధాలుగా అభివృద్ధి చేయటమే నాలక్ష్యం అని మీ అందరి ఆశీస్సులు, మా నాయకుల ఆశీస్సులు, అండ ఉంటే సాధ్యం చేసుకుందామని తెలిపారు.



**మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ...**

భారతదేశంలో పెన్షన్‌లకు ఇన్నివేల కోట్లు ఖర్చుపెడుతున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అనితెలిపారు. ఇటీవల వైకాపా ఒక కార్యక్రమం తీసుకున్నారు. కూటమి ప్రభుత్వం మోసం, ద్రోహం అని ఇంటింటికివెళ్ళి మీకు పెన్షన్ వస్తుందా, తల్లికి వందనం వస్తుందా అని అడిగితే మాకు పెన్షన్ రూ. 4వేలు వస్తుందని, మా పిల్లలకు ఒక్కొక్కరికి ఎంతమంది ఉంటే అంతమందికి తల్లికి వందనం వస్తుందని తెలుపగా పేపర్ జేబులోపెట్టుకునివెళ్ళిపోయారని తెలిపారు.

**మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి మాట్లాడుతూ...**

కూటమి ప్రభుత్వం వ్యవసాయ, సహకార రంగాలను బలోపేతం చేయటం కోసమే కమిటీలు వేయడం జరుగుతుందని తెలిపారు. రైతులకు న్యాయం చేసే ప్రభుత్వం మా ఎన్‌డిఏ కూటమి ప్రభుత్వం అని 8లక్షల విలువ చేసే డ్రోన్‌లను, 6లక్షల సబ్సిడీతో మండలానికి రెండు డ్రోన్స్ ఇస్తున్నామని, 2019లో ఆనాటి మా ప్రభుత్వం నియోజకవర్గానికి రైతులకు 100ట్రాక్టర్లు రూ.1,50000సబ్సిడీతో ఇచ్చిన ఘనత మాదని తెలిపారు. గత ప్రభుత్వం సిగ్గులేకుండా పూర్తికాని వెలుగొండ ప్రాజెక్టును జాతికి అంకితం చేశారని ఈరోజు వారే ప్రాజెక్టు గురించి అడుగుతూ మోసం ప్రభుత్వం అంటున్నారని ప్రజలు అన్ని గమనిస్తున్నారని అన్నారు.

**ఎంపి మాగుంట శ్రీనివాసుల రెడ్డి మాట్లాడుతూ..**

మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణ రెడ్డి ఇంత చక్కటి గొప్ప కార్యక్రమం ఏర్పాటు చేసి జిల్లా మంత్రులను, అందరు శాసనసభ్యులను ఆహ్వానించడం అభినందనీయమని కృతజ్ఞతలు తెలిపారు. ఎందుకంటే మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మార్కాపురం సభకు వచ్చినప్పుడు మార్కాపురం జిల్లా కేంద్రంగా ప్రకటన, వెలుగొండ ప్రాజెక్టు పూర్తి చేసి సాగునీరు, త్రాగునీరు తద్వారా వెనుకబడిన పశ్చిమ ప్రకాశం అభివృద్ధి చేయడం నా బాధ్యత అని తెలిపారు. అందులో భాగంగా మంత్రుల కమిటీని ఏర్పాటు చేసి నివేదిక ఇవ్వమన్నారని గుర్తు చేశారు. మరో రెండు నెలల్లో మార్కాపురం జిల్లా కేంద్రంగా రాబోతుందని 2026లో ప్రాజెక్టు ద్వారా నీళ్లు ఇస్తామని చంద్రబాబు ఢిల్లీలో తనతో చెప్పినట్లు మాగుంట తెలిపారు.

## మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేసిన గొట్టిపాటి లక్ష్మీ

**దర్శి, ఆగష్టు 26, ప్రభాతవార్త**



వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆర్‌అండ్‌బి అతిధి గృహంలో మంగళవారం దర్శి తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీచేతుల మీదుగా మహిళలకు మట్టి వినాయక బొమ్మలను అందజేశారు. పర్యావరణహితంగా గణేష్ చతుర్థి పండుగ వేడుకలు జరుపుకోవాలని ఆకాంక్షించారు. మట్టి విగ్రహాల వల్ల పర్యావరణ కాలుష్యం అవకుండా ప్రకృతి పరిరక్షించవచ్చని తెలిపారు.

## శానిటేషన్ పనుల్ని పరిశీలించిన డిప్యూటీ ఎంపీడీఓ ఆవుల సుధాకర్

**దర్శి, ఆగష్టు 26, ప్రభాతవార్త**

దర్శి మండలంలోని పొతకమూరు గ్రామంలో మంగళవారం మండల అభివృద్ధి అధికారి డిప్యూటీ ఎంపీడీఓ ఆవుల సుధాకర్ శానిటేషన్ పనుల్ని, గ్రామంలోని స్వచ్ఛ భారత్ పనులను పరిశీలించారు. గ్రామంలో ప్రతి రోజు పనులు జరుగుతున్నాయా లేదా అని ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఇంజనీరింగ్ అసిస్టెంట్, హౌస్ హోల్డ్, కనిగిరి డీడీఓ కేఎస్ రెడ్డి పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా మార్కాపురం ఏఎంసి ఛైర్మన్ ప్రమాణస్వీకారం

**మార్కాపురం రూరల్, ఆగస్టు 26 ప్రభాతవార్త**




మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణ రెడ్డి ఆశీస్సులతో సోమవారం మాలపాటి వెంకట రెడ్డి మార్కాపురం అగ్రికల్చర్ మార్కెట్ యార్డ్ ఛైర్మన్‌గా ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం మార్కాపురం పట్టణంలోని ఏఎంసి ఆవరణలో వైభవంగా నిర్వహించారు. మొదటిగా మాలపాటి వెంకటరెడ్డి ఇంటి వద్ద నుండి ఏఎంసి ఆవరణ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మార్కెట్ యార్డ్ ఆవరణలో మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణ రెడ్డి అధ్యక్షతన సభ



నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, రాష్ట్ర సాంఈక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి, ఒంగోలు పార్లమెంటు సుభ్యులు మాగుంట శ్రీనివాస్ రెడ్డి, ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్, సంతనూతలపాడు శాసనసభ్యులు బిఎన్ విజయ్ కుమార్, కనిగిరి శాసనసభ్యులు ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి, రాష్ట్ర మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య, ఎర్రగొండపాలెం ఇన్చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు, దర్శి టిడిపి ఇన్చార్జి గొట్టిపాటి లక్ష్మీ, లలిత్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర మంత్రి వర్యులు గొట్టిపాటి రవికుమార్, డోలా బాలవీరాంజనేయ స్వామి, మాగుంట శ్రీనివాసరెడ్డి, దామచర్ల జనార్ధన్, కందుల నారాయణ రెడ్డిలు మాట్లాడుతూ వచ్చే రెండు మూడు నెలల్లో మార్కాపురం జిల్లా సాకారం అవుతుందని, వెలుగొండ ప్రాజెక్టును త్వరలోనే పూర్తి చేస్తామని, మార్కాపురం నియోజకవర్గ శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి ఈ రెండు విషయాలపైనే దృష్టిసారించారని, ప్రతీది పట్టుదలతో నియోజకవర్గ అభివృద్ధి పనులపై దృష్టి సారించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం జిల్లా ఆవశ్యకత గురించి జిల్లా శాసనసభ్యులు వివరించారు. ఈ కార్యక్రమానికి తరలివచ్చిన ప్రతిఒక్కరికి ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు.

## ఎరువుల దుకాణాల్లో జేసి ఆకస్మిక తనిఖీ

**కొత్తపట్నం, ఆగస్ట్ 26 ప్రభాతవార్త**



కొత్తపట్నం మండల కేంద్రంలోని శివాలయం వీధి నందు గల షా ఎంటర్ప్రైజెస్ రిటైల్ ఎరువుల దుకాణంను ఆకస్మికంగా ప్రకాశం జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణ తనిఖీ చేయటం జరిగింది. రైతులకు యూరియాను అధిక ధరకు అమ్ముతున్నట్లు రైతుల ద్వారా తెలుసుకొని 6ఎ కేసు ఫైల్ చేయడం జరిగింది. యూరియా ధర 266 రూపాయలకు అమ్మాల్సి ఉండగా 300 కు అమ్ముతున్నట్లు సమాచారం తెలుసుకున్న జేసి షా ఎంటర్ప్రైజెస్‌పై దాడి చేసి సుమారు 4.86 మెట్రిక్ టన్నుల యూరియాను సీజ్ చేయడం జరిగింది.సీజ్ చేసిన యూరియా నిల్వల విలువ రూ. 28782/ఉన్నట్లు ఆయన తెలియజేశారు. అనంతరం రాజుపాలెంలో గల బాలాజీ ఏజెన్సీస్ ను జాయింట్ కలెక్టర్ తనిఖీ చేయడం జరిగింది. నిల్వలు, స్టాక్ తనిఖీ చేయటం జరిగింది. రైతులను కూడా ధరల విషయంపై అడిగి తెలుసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు ఒంగోలు సహాయ వ్యవసాయ సంచాలకులు రమేష్ బాబు, తాసిల్దార్ శాంతి, మండల వ్యవసాయ అధికారి కిషోర్ బాబు, అజయ్ బాబు, వీఐఏ శ్రావణ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

6_6.qxd 8/27/2025 12:47 AM Page 1



# భక్తి గీతాల మాలిక ఆడియో సీడీ ఆవిష్కరణ

**ఒంగోలుకల్చరల్,ఆగష్టు 26,ప్రభాతవార్త**



శ్రీమణికంఠ భజనబృందం పులి పోలురాజు గురుస్వామి ఆధ్వర్యంలో రామలింగారెడ్డి గురుస్వామి పాడిన భక్తి గీతాల మాలిక ఆడియో సీడీని మంగమూరు రోడ్డులోని అయ్యప్పస్వామి క్షేత్రంలో రామలింగారెడ్డి గురుస్వామి కుటుంబసభ్యులు ఆవిష్కరించారు .ఈ సీడీలో విఘ్నేశ్వర, సుబ్రహ్మణ్యేశ్వర, శివపార్వతులు, అయ్యప్ప స్వామి మీద పాడిన 8 పాటలను భక్తులకు వినిపించారు. ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు పొన్నూరు వెంకట శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో యూట్యూబ్‌లో రఘుకుల తిలక రామ అన్న పాటతో సంచలనం కలిగించిన కొండలుస్వామి పాల్గొని కలియుగంలో స్వామి నామస్మరణానికి మించిన సాధనం మరొకటి లేదన్నారు. అయ్యప్ప దీక్ష ద్వారా అనేక కోరికలు నెరవేరుతాయని తెలిపారు.మంచిపాటలను గానం చేసిన రామలింగారెడ్డి గురుస్వామిని అభినందించారు. గత 24 సంవత్సరాలుగా రెండు తెలుగు రాష్ట్రాల్లో తన గానమాధుర్యంతో అలరిస్తున్న రామలింగారెడ్డి గురుస్వామిని మార్కాపురం శ్రీనుస్వామి, కృష్ణ, మారుతీ,శివ,సుబ్బయ్య,కోటి, సుబ్రహ్మణ్యం, అప్పల శంకర్ గురుస్వాములు అభినందించారు. అయ్యప్పక్షేత్రం అర్చక స్వామి పరాంకుశం రంగస్వామితోపాటు అతిధులను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా పాడిన అయ్యప్ప స్వామి భక్తిగీతాలు అలరించాయి.

## దోమలను నివారించండి

**దొనకొండ,ఆగష్టు 26,ప్రభాతవార్త**

దొనకొండ గ్రామ పంచాయతీ పరిధిలోని అరబస్థాన్, శివాజినగర్, పెద్ద మసీదు ఏరియాలలో చెత్తచెదారం మరియు చిల్లకంప, గడ్డి పెరిగి పోయి దోమలకు నివాసం గ మారిపోయాయి కావున దొనకొండ పంచాయతీ అధికారి మరియు సర్పంచ్ తక్షణమే స్పందించి చెత్త, గడ్డి, కంపను తొలగించి ఫాగింగ్, బ్లీచింగ్ చల్లి దోమల బెడద నుండి మరియు విషజ్వరాల నుండి కాపాడవలసిందిగా వార్డ్ సభ్యులు ముజహిద్ కోరుచున్నారు.

పంచాయతీ సభ్యులు అందరు ఫిర్యాదు చేయండి. దొనకొండ మేజర్ గ్రామపంచాయతీలో పరిస్థితి చాలా ఘోరముగా. దోమలు. పందులు. కుక్కలు. పిచ్చిమొక్కలు. మురికి నీరు. చెత్త సేకరణ. తడి చెత్త. పొడిచేత్త. ఫాగింగ్. బ్లీచింగ్. పిచికారీ మందులు ఏమిలేవు. అడిగేవారు లేరు.

# పొలం పిలుస్తోంది కార్యక్రమం

**దొనకొండ,ఆగష్టు 26,ప్రభాతవార్త**



ఆరవల్లిపాడు,తెల్లబాడు గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో దర్శి రీజురీ శాస్త్రవేత్త వెంకటేశ్వర రెడ్డి గారు మాట్లాడుతూ పత్తి మరియు కంది పంటలలో తీసుకోవలసిన సస్య రక్షణ చర్యల గురించి రైతులకు వివరించడం జరిగినది.మండల వ్యవసాయ అధికారి వారు మాట్లాడుతూ పంట వేసిన రైతులందరు అందరూ ఖచ్చితంగా ప్ప్త్ర నమోదుకు మీ యొక్క గ్రామ వ్యవసాయ సహాయకులతో చేపించుకోవలని తెలిపారు.3. యూరియా ను అధిక ధరలకు అమ్మితే ఎరువుల షాపు వారిపై తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపినారు.

## మొక్కుబడిగా మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం

- కోరంలో ఆరవ సభ్యురాలి కోసం మూడుగంటలు అధికారుల ఎదురు చూపులు
- ఎంపీటీసీలకు ఫోన్లు చేసి పిలిపించిన ఏఎంసీ ఛైర్మన్ తేలప్రోలు రమేష్
- వెల్లలచెరువు ఎంపీటీసీ మేకల లక్ష్మి రావడంతో సమావేశం మమ అనిపించిన ఎంపీడీఓ

**సంతమాగులూరు ,ఆగష్టు 26, ప్రభాతవార్త**



సంతమాగులూరు మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం మంగళవారం మొక్కుబడిగా సాగింది. సమావేశం 11 గంటలకు ఎంపీపీ ఎనుబర్ల యల్లమంద అధ్యక్షతన ప్రాంభం కాగా ఎంపీటీసీలు ఎవ్వరూ రాకపోవడంతో ఎంపీడీఓ జ్యోతిర్మయితో పాటు మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఎక్స్అఫిషియో సభ్యుడుగా హాజరైన సంతమాగులూరు వ్యవసాయ మార్కెట్ కమిటి అధ్యక్షులు తేలప్రోలు రమేష్ కాస్తతంత విస్మయానికి గురయ్యారు. సమయం 12.30 అయ్యే సరికి అధికారికంగా సమావేశం ప్రారంభమైన గంటన్నరకు అధ్యక్ష హోదాలో ఎంపీపీ ఉండగా మరో ముగ్గురు ఎంపీటీసీలు చవటిపాలెం ఎంపీటీసీ లీలాదతి రాధాకృష్ణమూర్తి , సంతమాగులూరు ఎంపీటీసీ పిట్టముడుసుల ఎంకారావు, సజ్జాపురం ఎంపీటీసీ శ్రీనివాసరావు లతో పాటు కోఆప్షన్ సభ్యులు వయ్యకంటి మస్తాన్‌వలి (ఉక్కు)లు సమావేశ మందిరంలోకి వచ్చారు. ఐతే మండల పరిషత్ మొత్తం పాలకవరనగ సభ్యులు 17 మంది కాగా కోఆప్షన్ సభ్యునితో కలిపి మొత్తం 18 మంది . సమావేశం కోరం ఉండాలంటే మూడవ వంతు అంటే 6 గురు సభ్యులు తప్పనిసరిగా హాజరుకావాలి.ఆరవ సభ్యుడు ఎవ్వరూ రాకపోవడంతో అటు అధికారులతో పాటు మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఎక్స్ అఫిషియో సభ్యుడుగా హాజరైన సంతమాగులూరు వ్యవసాయ మార్కెట్ కమిటి అధ్యక్షులు తెలప్రోలు రమేష్ కాస్తతంత విస్మయానికి గురయ్యారు.వెంటనే రంగంలోకి దిగిన వ్యవసాయ మార్కెట్ కమిటి ఛైర్మన్ తెలప్రోలు రమేష్ ఎంపీటీసీ సభ్యులకు ఫోన్లు చేసి రావాలనుసందిగా కోరారు.మధ్యాహ్నం 1.30 గంటల సమయం వరకు మొత్తం సమావేశంలో ఉన్న అధికారులు , సర్పంచులు, అన్ని శాఖల సిబ్బంది సమావేశం జరుగుతుందా వాయిదా పడుతుందా అన్న సందేహంతో ఎదురు చూస్తూ మౌనం పాటించారు. ఎట్టకేలకు వెల్లలచెరువు ఎంపీటీసీ సభ్యురాలు మేకల లక్ష్మి సమావేశం వందిరంలోకి రావడంతో ఆమెతో సంతకాలు చేయించుకుని కోరం సరిపోవడంతో అందరికి ఒక వైపు ఆకలి దంచుతుండటంతో ఎజెండాలు , చర్చలు , ప్రగతి నివేదికలు ఏవీ లేకుండానే సమావేశం మమఅనిపించారు.ఈ సమావేశంలో ఎంపీపీఎనుబర్ల యల్లమంద,ఎంపీడీఓ జి.జ్యోతిర్మయి, తహశీల్దార్ కె.రవిబాబు,సంతమాగులూరు వ్యవసాయ మార్కెట్ కమిటి అధ్యక్షులు తెలప్రోలు రమేష్,ఈఓఆర్డీ నల్లూరి శివరాంప్రసాద్ 7గురు సర్పంచులు అన్ని శాఖల అధికారులు వంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ఎక్స్ అఫిషియో సభ్యుడుగా హాజరైన
## వ్యవసాయ మార్కెట్ కమిటి అధ్యక్షులు తెలప్రోలు రమేష్

**సంతమాగులూరు ,ఆగష్టు 26, ప్రభాతవార్త**

సంతమాగులూరు వ్యవసాయ మార్కెట్ కమిటి అధ్యక్షులుగా గత నెలలో బాధ్యతలు స్వీకరించిన కుందుర్రు గ్రామానికి చెందిన తెలప్రోలు రమేష్ ఎక్స్ అఫిషియో సభ్యుడుగా మొదటి సారిగా మండల పరిషత్ సర్వ సభ్య సమావేశంలో పాల్గొన్నారు. ఆయనను ఎంపీడీఓ ఘనంగా స్వాగతించారు.

### సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

**సంతమాగులూరు ,ఆగష్టు 26, ప్రభాతవార్త**



చిలకూరుపేటలోని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ క్యాంపు కార్యాలయంలో వైద్యఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకున్న 46 మంది లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంతమాగులూరు మాజీ ఎంపీపీ నన్నపనేని ఎడుకొండలు, మండల సర్పంచుల సంఘం అధ్యక్షులుపుట్టావారిపాలెం సర్పంచ్‌నన్నపనేని గురుబ్రహ్మం , బండివారిపాలెం మాజీ సర్పంచ్ పసుపులేటి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## పొగాకు సాగు నిషేదం- సంతమాగులూరు ఏఓ సైదా

**సంతమాగులూరు , ఆగష్టు 26, ప్రభాతవార్త**

రైతులు అనుమతులు లేకుండా పొగాకు పంటలు సాగు చేసి నష్టపోకుండా నివారించేందుకు గాను బాపట్ల జిల్లాలో పొగాకు సాగు పూర్తిగా నిషేదిస్తూ జిల్లా కలెక్టర్ వెంకట మురళి ఉత్తర్వులు జారీ చేసినట్లు సంతమాగులూరు వ్యవసాయాధికారి ఎస్.కె సైదా తెలిపారు. రైతులు ఎవ్వరూ కూడా నల్ల బర్లీ, తేదా నల్లబర్లీ పొగాకు సాగు చేయరాదన్నారు. ఎవరైనా సాగు చేసినట్లైతే చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

## వినాయక విగ్రహాల పందిళ్ళలో సీసీ కెమేరాలు
## తప్పని సరిగా ఏర్పాటు చేయాలి - ఎస్సై ఎం.పట్టాభిరామయ్య

**సంతమాగులూరు ఆగష్టు 26 ప్రభాతవార్త**



గ్రామాలలో పోలీస్ అనుమతులతో ఏర్పాటుచేసుకునే వినాయక విగ్రహాల పందిళ్లలో సీసీ కెమేరాలు తప్పని సరిగా ఏర్పాటు చేయాలని సంతమాగులూరు ఎస్సై ఎం.పట్టాభిరామయ్య తెలిపారు. నేర నియంత్రణలో సీసీ కెమేరాలు ఎంతగానో దోహద పడతాయన్నారు. పండుగ ఉత్సవాలలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా నిర్వహణ కమిటీలు పోలీసులకు సహకరించాలన్నారు. ఎవరైనా అనుమతులకు మించి డీజేలు, అసభ్యకర నృత్యాలు ఏర్పాటు చేసినట్లయితే ఆయా కమిటీ సభ్యులందరిపై చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

# రాజకీయ దురుద్దేశంతో షాపులు కూల్చివేత బాధాకరం

- కక్ష సాధింపుగా అధికార వ్యవస్థ వ్యవహారిస్తుంది
- దుకాణాలు దౌర్జన్యంగా పడగొట్టాల్సిన అవసరం ఏముంది
- వైసీపీ కార్యకర్తలకు అండగా ఉంటా - దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

**దర్శి, ఆగష్టు 26, ప్రభాతవార్త**




రాజకీయ దురుద్దేశంతో వైసీపీ కార్యకర్తల షాపులని పడగొట్టడం అన్యాయమని దర్శి ఎమ్మెల్యే వైసీపీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఎప్పుడూ లేని విధంగా శాంతి భద్రతలు కాపాడాల్సిన దర్శి సీఐ రామారావు, ఎస్సైలు మురళి, కమలాకర్, మల్లిఖార్జునలు సుమారుగా 30 మంది కానిస్టేబుల్ ఏఎస్సైలు దౌర్జన్యంగా మంగళవారం ఉదయం 6గంటలకి ముండ్లమూరు మండలంలోని పసుపుగల్లు గ్రామంలో మా మండల కన్వీనర్ చింత శ్రీనివాసులురెడ్డిది వాళ్ళ పట్టాల్యాండ్ లో ఉన్న షాపులని కావాలనే రాజకీయ దురుద్దేశంతో కార్యదర్శి ఫిర్యాదు ఇచ్చారని చెప్పేసి కావాలనే ఫిర్యాదును అడ్డం పెట్టుకుని అమానుషంగా పడేయడం జరిగింది. చూస్తుంటే ఈ స్థలం ఎక్కడో రోడ్డు మార్గంలో సైడు కాలువ మీద ఉంది. పోయే రోడ్డుకి 42 అడుగుల దూరం వదిలేసి షాపులు కట్టుకున్నారు. వారి పట్టాలైన్‌లో వారే ఉంటే కావాలనే కక్ష సాధింపు చర్యలుగా పోలీసు వ్యవస్థ మొత్తం వచ్చి దౌర్జన్యంగా మంగళవారం చింత శ్రీను వాళ్ళ ల్యాండ్‌ని షాపులను కూల్చడం బాధాకరంగా ఉందని అయ్యా పోలీసు వ్యవస్థ మొత్తం కూడా చెప్పి ఇక్కడ ఉన్నటువంటి టీడీపీ ఇన్‌చార్జీ ఎన్నికలు అయిన తర్వాత మేము కక్ష సాధింపు చర్యలు చేయం అభివృద్ధి అని చెప్పుకుంటూ మొన్న తూర్పువీరాయపాలెం గ్రామంలో ముప్పరాజు శ్రీనివాస్ సంబంధించిన బెల్డింగ్ పడగొట్టారు. అంతే కాకుండా మరలా ఈ రోజు మండల కన్వీనర్ శ్రీనివాసరెడ్డి బిల్డింగ్ ని పడగొట్టారు. మీరు నియోజకవర్గంలో పోలీసు వ్యవస్థను అడ్డుపెట్టుకుని పోలీసులు నేరుగా శాంతి భద్రతలను పక్కన పెట్టి వైసీపీ నాయకులు ని ఇబ్బంది పెట్టాలని వైసీపీ నాయకులపై కేసులు పెట్టడం నిజంగా చాలా బాధాకరంగా ఉందన్నారు. మీకు ఉద్యోగం ఇచ్చింది ప్రజల్ని కాపాడతారని అనుకుంటే మీరు ఒక ప్రజా ప్రతినిధిగా అక్కడ ఉన్న మహిళలని ఈడ్చుకెళ్తూ అసభ్యకరంగా పదజాలతో వారిని తిట్టి కొట్టి నానా రకాలుగా వాళ్ళ భార్యల్ని అదే విధంగా వాళ్ళ కుటుంబ సభ్యులను నేరుగా ఎస్సైలు, సీఐలు దారుణంగా లాగేశారు. ఇంతా అవసరం ఏముంది. పంచాయతీ రాజ్ రోడ్డులో ఒక కార్యదర్శికి సంబంధం లేకుండా పంచాయతీ ఏఈ డిఈఎస్సీ రోడ్లు ఆక్రమించారని మీకు ఏమైనా పిర్యాదు వచ్చిందా ఫిర్యాదు లేకుండానే ఎందుకు దౌర్జన్యంగా షాపులు పగలగొట్టారని పడగొట్టాల్సిన అవసరం ఏముంది అని దీన్ని పూర్తిగా వైసీపీ ఎమ్మెల్యేగా నేను ఖండిస్తున్నాను అన్నారు.దర్శి ఇన్‌చార్జీ కొత్తగా వచ్చారు చేతనైతే పేదవారికి సాయం చేయండి నియోజకవర్గఇన్న అభివృద్ధి చేయండి కానీ కక్ష సాధింపు రాజకీయాలు చేసి గతంలో ఎప్పుడు లేని విధంగా గ్రామాల్లో విద్వేషాలు పెంచి పోషించకూడదన్నారు. మీ ప్రభుత్వం వచ్చి సంవత్సరం అయ్యింది. మేము అధికారంలోకి వస్తాం వస్తే మాకు టైం వస్తది ఆ టైం కోసం ఎదురు చూస్తున్నాం దౌర్జన్యాల మానుకోండి, కక్షలు మానుకోంఇ, వీలైతే పేదవారికి సహాయం చేయండి అంతే కాని ఈ రోజు పసుపుగల్లు గ్రామంలోకి పోతే ఆ మహిళలపై మీరు దూషించిన పద జాలం సభ్య సమాజానికి చెప్పుకోలేని విధంగా మహిళలందరిని అసభ్యకరంగా తిడుతూ మండల కన్వీనర్‌ని లాగి చొక్కాచించి నాన్న రకాలుగా ఇబ్బంది పెట్టారు. ఇదే మీరు పోలీసు వ్యవస్థ మీరు చేసేది దయచేసి ఇటువంటి వ్యవస్థను మానుకోవాలని ఈ విషయంపై ఎస్పీకిఫిర్యాదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు వెన్నపూస వెంకటరెడ్డి, పోశం మధుసూదన్‌రెడ్డి, కాకర్ల కృష్ణారెడ్డి, సోము దుర్గారెడ్డి, సూదిదేవర అంజయ్య, బంక నాగిరెడ్డి, టి.రత్నరాజు, ఇత్తడి దేవదానం, ఎన్నాబత్తిన సుబ్బయ్య,మిల్లర్ బుజ్జి, చింత శ్రీనివాసులురెడ్డి, మేడికొండ జయంతి తదితరులు పాల్గొన్నారు.

## ఇది మహిళల పండుగ

- స్త్రీశక్తి సూపర్ సక్సెస్ పండుగ - చంద్రన్నకు వందనం, అభివందనం
- నేను చూడని పదవులు కాదు, మాకు పదవులు కొత్త కాదు
- పదవి లేకపోయినా ప్రజల కోసం పని చేస్తా
- బొట్లపాలెం ఎన్నికల బూత్ వద్ద బీసీ మహిళలపై జరిగిన దాడి నన్ను కలిచి వేసింది
- నాకోసం మీరు నిలబడ్డారు మీ కోసం నేను నిలబడతాను - డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ హామీ

**దర్శి, ఆగష్టు 26, ప్రభాతవార్త**



ప్రతి మహిళామ్మ తల్లి చంద్రన్నకు వందనం పాదాభివందనం స్త్రీ శక్తి పథకాన్ని మాకు అందించి ఇచ్చి మాట నిలుపుకున్న చంద్రబాబుకు జేజేలు. మహిళలకు భరోసానిచ్చావు. మాలో ఆత్మస్థైర్యాన్ని పెంచావు, మహిళలకు ఇచ్చిన ప్రతి హామీ అమలు చేశావు. కుటుంబ పెద్దగా మా కందిస్తున్న అండదండలకు కూటమి పాలన పది కాలాలపాటు కొనసాగాలని మనసార కోరుకుంటున్నాము. మా మహిళామ్మ తల్లుల అండదండలు ఎల్లప్పుడూ మీకు ఉంటాయని వమిళల తరుపు మీకు హామీ ఇస్తున్నాము. స్త్రీ శక్తి గ్రాండ్ సక్సెస్ అయిన సందర్భంగా ఏర్పాటు చేసిన కృతజ్ఞత సభకి తరలివచ్చిన మహిళా మణులకు దర్శి తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. స్తానిక చౌటపాలెం రోడ్డులోని ఆర్అండ్‌బి బంగ్లాలో స్త్రీ శక్తి పథకం గ్రాండ్ సక్సెస్ సభకు పెద్ద ఎత్తున మహిళలు తరలివచ్చారు. డాక్టర్ లక్ష్మీతో పాటు టీడీపీ యువ నాయకులు డాక్టర్‌కడియాల లలిత్, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, దర్శి మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, దర్శి మార్కెట్ యార్డు చైర్మన్ దారం నాగవేణి సుబ్బారావు, మహిళలు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లక్ష్మీ మాట్లాడుతూ నేను పదవుల కోసం రాలేదు, ఇప్పుడు పదవుండి పని చేయడం లేదు. నన్ను నమ్ముకున్న ప్రజల కోసం నాకు అండగా ఉన్న మహిళమ్మ తల్లుల కోసం ప్రజల హృదయాలు గెలిచిన నేను మీ సేవకురాలుగా దర్శిని అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో ముందుకు నడుస్తున్నాను, మీరందరూ నన్ను ముందుండి నడిపిస్తున్నారు. మీ యొక్క అభిమానాన్ని మీ యొక్క ప్రేమను నేను ఎన్నటికి మర్చిపోలేను, మేము చూడని పదువులు లేవు. గ్రామ సర్పంచ్ నుండి ఎమ్మెల్యే, మంత్రి, జడ్పీ చైర్మన్ అన్ని మా కుటుంబంలో ఉన్నాయి. నేను ఎన్నికలకు 40 రోజులు ఉండగా వచ్చినప్పటికి దర్శి ప్రజలు గొట్టిపాటి కుటుంబంపై ఉన్న నమ్మకంతో నాకు లక్ష ఓట్లు వేసి నన్ను గెలిపించేందుకు కృషి చేశారు. అది నేను మర్చిపోను, వైసీపీ కుట్రలు కుతంత్రాలు కులాల మధ్య చిచ్చు పెట్టడం, ప్రలోభాలు పెట్టి ఘర్షణ వాతావరణం సృష్టించి రిగ్గింగులు చేసి స్వల్ప తేడాతో ఓడి గెలిచారు. ఆయినా నేను ప్రజల్లో గెలిచాను, మన ప్రభుత్వం ఏర్పడింది. నాకు చేతనైనంత వరకు దర్శి అభివృద్ధికి కృషి చేస్తానని ఈ సందర్భంగా మహిళమ్మ తల్లులకు మాట ఇస్తున్నాను. గత ఎన్నికల పోలింగ్ రోజున పోలీసుల సాక్షిగా మన నియోజకవర్గంలో బొట్లపాలెం గ్రామంలో బీసీ మహిళలపై కత్తులతో వైసీపీ మూకలు దాడి చేశారు. మాది అభివృద్ధి మంత్రం ప్రజలకు మేలు చేయాలన్న తలంపు ఆనాడు నిర్ణయించుకున్నాను. నా కోసం మహిళలు దాడులు ఎదుర్కొన్నారు. నా కోసం నిలబడ్డారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని మండల పార్టీ అధ్యక్షులు మారెళ్ళ వెంకటేశ్వర్లు, మోడీ ఆంజనేయులు, పిడతల నెమిలయ్య, కూరపాటి శ్రీను, మేడం వెంకటేశ్వరరెడ్డి, దర్శి టౌన్ పార్టీ అధ్యక్షులు చిన్న, పీఏసీఎస్ చైర్మన్‌లు నీటి సంఘం డీసీలు, అధ్యక్షులు, దర్శి మున్సిపల్ వైస్ చైర్మన్ గర్నిపూడి స్టీవెన్, టీడీపీ రాష్ట్ర మహిళ నాయకురాలు శోభారాణి, దర్శి ఆర్యవైశ్య మహిళ మండలి అధ్యక్షురాలు ఇందిరా, కౌన్సిలర్లు నారపుశెట్టి ధనలక్ష్మీ, నక్క చంద్ర, పసుపులేటి శేషమ్మ, ఇత్తడి సునీత, మహిళ టీడీపీ నేతలు నాగమణి, అనూష, పోలవరం విజయలక్ష్మీ, సుజాత, ధనలక్ష్మీ, వెంకటలక్ష్మీ, గౌతమి, దర్శి విజయలక్ష్మీ, తాల్లూరు విజయలక్ష్మీ, సంగు సునీత, కౌన్సిలర్లు, క్లస్టర్లు, యూనిట్, బూత్ ఇన్‌ఛార్జీలు, నియోజకవర్గంలోనిటీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మట్టి వినాయకులను పూజించండి.. పర్యావరణాన్ని కాపాడండి

**చీరాల, ఆగష్టు 26, ప్రభాతవార్త**



మట్టివినాయకులను పూజించండి.. పర్యావరణాన్ని కాపాడండి అనే నినాదంతో బాపట్ల జిల్లా చీరాలలో ఉచితంగా వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. స్థానిక కోట్ల బజారు చెందిన ఓగేటి శ్రీనివాస శాస్త్రి ఆధ్వర్యంలో సిద్దునాథ్,విశ్వనాథ్,యశ్వంత్ సౌజన్యం తో వెయ్యి మట్టి వినాయక ప్రతిమలను వ్రత కల్పం పుస్తకాలను ఆర్డీఓ చంద్రశేఖర్ నాయుడు చేతుల మీదుగా ఉచితంగా పంపిణీ చేశారు. 2015 నుంచి కాలుష్యాన్ని నియంత్రణలో భాగంగా పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఏడాది మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేస్తున్న యువతను ఆర్డీఓ చంద్రశేఖర్ నాయుడు ప్రశంసించారు. ప్రతి ఒక్కరూ వీరిని స్ఫూర్తిగా తీసుకుని మట్టి విగ్రహాలను పూజించి పర్యావరణాన్ని పరిరక్షించేందుకు సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో తహాశీల్దార్ గోపికృష్ణ,డీఐ మునలయ్య, సీఐ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## బూచేపల్లి వెంకాయమ్మను కలిసిన మండల నాయకులు

**నాగులుప్పలపాడు, ఆగష్టు 26, ప్రభాతవార్త**



జిల్లా జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ జన్మదిన వేడుకలు మంగళవారం నిర్వహించారు. రాష్ట్ర నాయకులు నలమలపు కృష్ణారెడ్డి, పోలినేని కోటేశ్వరరావు, ఎంపీటీసీ పోద పవన్, ఇమ్మిశెటిన బాలకృష్ణ, మోహన్‌రావులు బూచేపల్లి వెంకాయమ్మ, జిల్లా అధ్యక్షులు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిలను మర్యాదపూర్వకంగా కలిసి వెంకాయమ్మకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# మట్టి గణపతయే మహా గణపతి

- మట్టి గణపతిని ప్రతితో పూజించడం ఆరోగ్యకరం
- మహిళా క్లబ్ అధ్యక్షురాలు కారంశెట్టి వేంకట సునీత

**ఒంగోలుకల్చరల్,ఆగష్టు 26,ప్రభాతవార్త**



మట్టి గణపతి మహా గణపతి మట్టి గణపతి పత్రితో పూజించడంతో పర్యావరణ పరిరక్షణ మాత్రమే కాకుండా ప్రతి ఒక్కరికి ఆరోగ్యం, సకల శుభాలు కలుగుతాయని వాసవి క్లబ్ మహిళా విజన్ అధ్యక్షురాలు కారంశెట్టి వేంకట సునీత తెలిపారు. 27వ తేదీ వినాయక చవితి పండుగ సందర్భంగా 26వ తేదీ మంగళవారం సాయంత్రము స్థానిక శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయ ప్రాంగణము వద్ద మట్టి గణపతి ప్రతిమలను ప్రజలకు ఉచితముగా పంపిణీ చేశారు. పెద్ద సంఖ్యలో ప్రజలు విచ్చేసి వాసవి మహిళా క్లబ్ సభ్యులు అందించిన గణపతి ప్రతిమలను అందుకొన్నారు.ఈ సందర్భంగా రీజియన్ కార్యదర్శి మద్దు అరవింద లక్ష్మి మాట్లాడుచు వాసవి క్లబ్స్ అంతర్జాతీయ అధ్యక్షులు ఇరుకుల రామకృష్ణ ఆదేశానుసారం మట్టి గణపతి ప్రతిమలను పంపిణీ చేసినట్టు తెలిపారు. కార్యక్రమములో మహిళా విజన్ కార్యదర్శి ఆత్మకూరి శ్రావ్య కోశాధికారి మాడిశెట్టి భవన్ మరియు క్లబ్ సభ్యులు, అధికారులు పలువురు పాల్గొన్నారు.

# రైతులు పంట నమోదు చేసుకోవాలి

**పొన్నలూరు, ఆగష్టు26,ప్రభాతవార్త**




మండలంలోని రైతులు సాగు చేసే పంటలకు పంట నమోదు, ఇన్సూరెన్స్ తప్పనిసరిగా చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి వి.రాము రైతులను కోరారు.మండలంలోని చెన్నుపాడు, బోగనం పాడు గ్రామాలలో వ్యవసాయాధికారి ఆధ్వర్యంలోమంగళవారంపొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భం గా ఏవో మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్లో వేసిన ప్రతి పంటకూ పంటనమోదు కార్యక్రమం సంబంధిత వ్యవసాయ సహాయకులు ద్వారా చేసుకోవాలని సూచించారు. మండలంలో రైతులు సాగు చేసే పంటలకు ఖరీఫ్ సీజన్‌కి సంబంధించి ఇన్సూరెన్స్ చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో చెన్నుపాడు గ్రామ వ్యవసాయ సహాయకులు షేక్ మస్తాన్ భాష, ఎంపీఈఓ షేక్ రసూల్,గ్రామ పశు వైద్య సహాయకులు ఎన్ పుల్లయ్య బోగనంపాడు గ్రామ వ్యవసాయ సహాయకులు షేక్ మోలాలి, గ్రామ పశు వైద్య సహాయకులు షేక్ నూర్జన్ రైతులు పాల్గొన్నారు.

## దుర్గమ్మ దసరా ఉత్సవాల షెడ్యూల్ విడుదల

**దొనకొండ,ఆగష్టు 26,ప్రభాతవార్త**

సెప్టెంబర్ 22 నుంచి అక్టోబర్ 2 దసరా ఉత్సవాలు.11 రోజుల పాటు 11 అలంకారాలలో దర్శనమివ్వనున్న దుర్గమ్మ.దుర్గమ్మ దసరా ఉత్సవాల షెడ్యూల్ ను విడుదల చేసిన ఈవో శినా నాయక్, వైదిక కమిటీ సభ్యులు.దుర్గగుడి స్థానాచార్య శివప్రసాద్ శర్మసెప్టెంబర్ 22 న బాలత్రిపుర సుందరి దేవి అలంకారంలో దర్శనమివ్వనున్న దుర్గమ్మ.23 న గాయత్రీ దేవి గా,24 న అన్నపూర్ణాదేవి గా, 25 న కాత్యాయని దేవి గా 26 న మహాలక్ష్మి గా,27న లలితా త్రిపుర సుందరి దేవి గా,28న మహాచండి దేవి గా,29 న సరస్వతి దేవి గా,30 న దుర్గాదేవి గా,1న మహిషాసుర మర్దిని దేవిగా,2 న రాజరాజేశ్వరి దేవి గా భక్తులకు దర్శనమివ్వనున్న దుర్గమ్మ.అక్టోబర్ 2 వ తేదీ 9:30 కు పూర్ణాహుతి తో ముగియనున్న దసరా ఉత్సవాలు.అదేరోజు సాయంత్రం 5 గంటలకు కృష్ణ నది లో హంస వాహన తెప్పోత్సవం..దుర్గగుడి ఈఓ శినా నాయక్‌సెప్టెంబర్ 22 నుండి ఇంద్రకీలాద్రి పై దేవి నవరాత్రులు..ఈ సారి 11 రోజులు దసరా జరుగుతుంది..సెప్టెంబర్ 29 వ తేదీ మూలనక్షత్రం రోజున మధ్యాహ్నం 3:30 నుండి 4:30 మధ్య సీఎం అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తారు..

## మట్టి గణపతిని పూజిద్దాం పర్యావరణాన్ని కాపాడుదాం

- ఇండస్ వ్యాలీ పాఠశాల విద్యార్థుల ప్రతిభ
- స్వయంగా మట్టి గణపతి విగ్రహాలను తయారు చేసుకున్న 222 మంది విద్యార్థులు

**సంతమాగులూరు ఆగష్టు 26 ప్రభాతవార్త**



కాలుష్యం ప్రజా ఆరోగ్యంపై కోరలు చాస్తున్న నేటి తరుణంలో మట్టి గణపతులను పూజించి పర్యావరణాన్ని పరిరక్షిద్దామని సంతమాగులూరు ఇండస్ వ్యాలీ పాఠశాల విద్యార్థులు ప్రతిన పూనారు. పాఠశాల డైరెక్టర్ అండ్ కరస్పాండెంట్ యశోద శివారెడ్డి పాఠశాల బోధన సిబ్బంది మట్టి గణపతుల తయారీ విధానాన్ని విద్యార్థులకు అవగాహన కల్పించారు. మట్టి గణపతుల ప్రాముఖ్యతను కూడా వారికి వివరించారు. అయ్యవార్ల సూచనలు తెలుసుకున్న విద్యార్థులు తామందరం తమ ఇండ్లలో మట్టి గణపతిని పూజించేందుకు మేమే గణపతి విగ్రహాలను తయారు చేసుకుంటామని ప్రతిజ్ఞ చేయడంతో విగ్రహాల తయారీకి అవసరమైన మట్టిని పాఠశాల నిర్వాహకులు సమకూర్చారు. సరైన పద్ధతిలో మట్టిని నీటితో కలిపి పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన విగ్రహంతో పాటు 2002 మంది విద్యార్థులు స్వయంగా మట్టి గణపతి విగ్రహాలను తయారు చేసుకొని తమ ఇండ్లకు తీసుకువెళ్లారు. స్కూల్ ప్రిన్సిపాల్ తలనాటి రాజేశ్వరి,కే.మాధవి పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

### ఎరువుల మందుల దుకాణాలపై ఎన్ఫోర్స్‌మెంట్ అధికారుల ఆకస్మిక తనిఖీలు

**గిద్దలూరు, ఆగస్టు 26, ప్రభాతవార్త**

గిద్దలూరు పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలపై ఎన్ఫోర్స్‌మెంట్ టీమ్ అధికారులు తహశిల్దార్ ఎం ఆంజనేయరెడ్డి,గిద్దలూరు ఏఓ విజయభాస్కర్‌రెడ్డిలు మంగళవారం ఆకస్మికతనిఖీ నిర్వహించారు.ఈ తనిఖీలో భాగంగా గిద్దలూరు పట్టణంలోని శ్రీకృష్ణ ట్రేడర్స్, చీతిరాల నాగేశ్వరరావు, శ్రీ మణికంఠ రైతు డిపో దుకాణాలు మరియు గోడౌన్‌లను తనిఖీ చేసి స్టాక్ రిజిస్టర్, బిల్ బుక్స్, ఇన్‌వాయిస్‌లను, ఐఎఫ్ఎంఎస్ స్టాక్, మొదలైనవి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూరియ అవసరం ఉన్న రైతులకు మాత్రమే ఇవ్వాలని, పొలాన్ని మరియు వేసిన పంటను బట్టి యూరియా ఇవ్వాలని తెలిపారు. మన జిల్లాకి కేటాయించిన ఎరువులు ఇక్కడ రైతులకు మాత్రమే విక్రయించాలని సూచించారు.ఎవరూ కూడా ఎంఆర్పి ధరలకు మించి అమ్మినయెడల చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. స్టాక్ ఉంచుకొని లేవని రైతులను వెనక్కి పంపకూడదని తెలిపారు. 0ఫార్మ్ లైసెన్స్‌లో జత కానందున 16.2 మెట్రిక్ టన్నులు కాంప్లెక్స్ ఎరువులు మొత్తం రూ.3,15,600లు అమ్మకాలు నిలుపుదల చేయడం జరిగిందని తెలిపారు.

## ఘనంగా జెడ్పీచైర్‌పర్సన్ వెంకాయమ్మ పుట్టిన రోజు వేడుకలు

**తాళ్లూరు, ఆగష్టు 26, ప్రభాతవార్త**



జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పుట్టిన రోజు వేడుకలు గుంటి గంగా భవాని సన్నిధిలో గల తేజా వృద్ధాశ్రమంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, మాజీ ఎంపీపీ పోశం మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసి వృద్ధులకు పండ్లు పంపిణీ, అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు తూము వెంకట సుబ్బారెడ్డి, వెన్నపూస వెంకటరెడ్డి(మహేష్), ఉపాధ్యక్షులు పులి ప్రసాద్‌రెడ్డి, ఆలోకం హరిబాబు, రైతు విభాగం అధ్యక్షులు గువ్వల వెంకట శ్రీనివాసరెడ్డి, నాయకులు బి.సుబ్బారావు, లతీఫ్, సంగు కొండారెడ్డి, యానం గోపి, జి.మోషే, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### కదిరి బాబురావు వ్యవసాయ కళాశాలలో మదర్ థెరిస్సా జయంతి వేడుకలు

**సీఎస్‌పురం, ఆగష్టు 26, ప్రభాతవార్త**



కదిరి బాబురావు వ్యవసాయ కళాశాలలో మథర్ థెరిస్సా జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా కళాశాల డీన్ డాక్టర్ పి.వీరన్న గౌడ్ మదర్ థెరిస్సా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీన్ వీరన్న గౌడ్ మాట్లాడుతూ పేదల సేవలో తరించిన మానవతా మూర్తి జీవితాన్ని అభాగ్యుల కోసం త్యాగం చేసిన త్యాగమూర్తి మదర్ థెరిస్సా అని అన్నారు. సేవ యొక్క ఫలితం సంతృప్తి అంటూ సమాజసేవకే తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయురాలి సేవలను గుర్తు చేసుకుంటూ ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఒడ్డుగూడెంలో మదర్ లవ్స్ ఇండియా అన్నదాన సేవ

**పెద్దదోర్నాల, ఆగష్టు 26, ప్రభాతవార్త**



పెద్దదోర్నాల మండలం ఒడ్డుగూడెంలో మంగళవారం మదర్ లవ్స్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో గిరిజనులకు రుచికరమైన భోజనాన్ని అందిస్తూ మానవత స్ఫూర్తిని చాటారు. తమ సంస్థ పేదలకు అన్నదాన కార్యక్రమాలే కాకుండా బట్టలు, అవసరమైన నిత్యవసర సరుకులు కూడా అందజేసి తమ వంతు సేవలందిస్తున్నట్టు కేతి రజిని తెలిపారు.

# సబ్సిడీ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోండి

## - టీడీపీ మండల అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి



**హనుమంతునిపాడు, ఆగస్టు 26, ప్రభాతవార్త**
ప్రభుత్వం మజూరు చేసిన సబ్సిడీ గడ్డి జొన్న విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఈడీపీ మండలఅధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి అన్నారు.మంగళవారం మండలంలోని హనుమంత పురం రైతుసేవ కేంద్రం నందు ప్రభుత్వం మంజూరు చేసిన సబ్సిడీ గడ్డి జొన్నలను రైతులకు పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గాయం రామిరెడ్డి, చీకటి వెంకట సుబ్బయ్య సుమిత్ర తిరుపతిరెడ్డి, ఉమ్మనపల్లి గ్రామ పార్టీ అధ్యక్షులు ఎలనాటి చిన్న కోటయ్య, బలరాం, రైతు సేవ కేంద్రం సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# సానికొమ్ము కొండారెడ్డి పార్థివదేహానికి ఎస్‌టీఆర్ నివాళి



**హనుమంతునిపాడు, ఆగస్టు 26, ప్రభాతవార్త**
మండలంలోని చిన్న గొల్లపల్లి గ్రామం మాజీ సొసైటీ అధ్యక్షులు సానికొమ్ము రామ రాఘవరెడ్డి సోదరుడు, సానికొమ్ము కొండారెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలిసిన వెంటనే మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సానికొమ్ము తిఉపతిరెడ్డి అక్కడికి చేరుకొని కొండారెడ్డి పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో మాలపాటి శ్రీశైలం రెడ్డి,గాయం రామిరెడ్డి,చీకటి వెంకట సుబ్బయ్య, సుమిత్ర తిరుపతిరెడ్డి, బలసాని కోటయ్య, మాలపాటి మనోహర్, బలసాని సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

# సానికొమ్ము కొండారెడ్డి పార్థివదేహానికి ముక్కు నర్సారెడ్డి నివాళి



**హనుమంతునిపాడు, ఆగస్టు 26, ప్రభాతవార్త**
మండలంలోని చిన్న గొల్లపల్లి గ్రామం మాజీ సొసైటీ అధ్యక్షులు సానికొమ్ము రామ రాఘవరెడ్డి సోదరుడు, సానికొమ్ము కొండారెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలిసిన వెంటనే కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి తండ్రి ముక్కు నర్సారెడ్డి అక్కడికి చేరుకొని కొండారెడ్డి పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో మండల సింగిల్ విండో అధ్యక్షులు కుందురు నారాయణరెడ్డి, టీడీపీ మండల క్లస్టర్ ఇన్‌ఛార్జీ గాయం తిరుపతిరెడ్డి, సీనియర్ నాయకులు కోటపాటి శేషయ్య తదితర నాయకులు పాల్గొన్నారు.

# వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపిన టీడీపీ రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి ముడ్వా రంగ సాయి యాదవ్



**హనుమంతునిపాడు, ఆగస్టు 26, ప్రభాతవార్త**
వినాయక చవితి పండుగ సందర్భంగా కనిగిరి నియోజకవర్గ ప్రజలకు టీడీపీ రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి ముడ్వా రంగ సాయి యాదవ్ వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆది దేవుడు అయినా గణపతి ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలపై ఉండాలని, ప్రజలు పాడి పంటలతో సుఖ సంతోషాలతో ఉండాలని ఆ గణనాథుని ప్రార్థిస్తున్నాను అని పేర్కొన్నారు.

# ఎరువుల దుకాణాల్లో తనిఖీలు



**వెలిగండ్ల, ఆగస్టు 26, ప్రభాతవార్త**
వెలిగండ్ల మండలంలోని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం మండలంలోని ఎరువుల దుకాణాలలో తనిఖీలు నిర్వహించారు. యూరియా కొరతపై ఆందోళన చెందుతున్న నేపథ్యంలో ఎరువుల పంపిణీపై నిఘా పెట్టాల్సిందిగా సంయుక్త కలెక్టర్ ఇచ్చిన ఆదేశాల మేరకు తహశీల్దార్ ఎన్.వాసు, ఏవో టి.శిల్పా, ఎస్సై కృష్ణపావనిలు తనిఖీలు చేశారు. దుకాణంలోని నిల్వలు, రిజిస్టర్ లో వివరాలు పరిశీలించారు. అధిక ధలకు అమ్మిన, అనధికారికంగా నిల్వచేసిన,కృత్రిమకొరత సృష్టించిన లైసెన్సులురద్దుచేయాల్సి వస్తుందని వ్యాపారులను హెచ్చరించారు. వెలిగండ్లలోని మూడు దుకాణాలను ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు చేశారు.

# హుస్సేన్‌పురం, కొట్టాలపల్లిలో పొలం పిలుస్తోంది



**వెలిగండ్ల, ఆగస్టు 26, ప్రభాతవార్త**
వెలిగండ్ల మండలంలోని హుస్సేన్‌పురం, కొట్టాలపల్లి గ్రామాలలో వ్యవసాయశాఖ వారి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాదికారి తమ్మినేని శిల్ప పాల్గొన్నారు. వ్యవసాయాధికారిణి మాట్లాడుతూ ప్రతి రైతు పంట వేసిన తర్వాత ఈ క్రాప్ బుకింగ్ చేసుకోవాలని తెలిపారు. అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ పథకానికి అర్హత పొందాలంటే ప్రతి రైతు ఆధార్ భూమికి అనుసంధానం చేసుకోవాలని తెలిపారు. క్రాప్ ఇన్సూరెన్స్ చేసుకోవడానికి ఆగష్టు 31వరకు సమయం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ భాగ్యలక్ష్మీ, గ్రామ వ్యవసాయశాఖ సహాయకులు షేక్ అజార్,కే.స్టీఫెన్ పశుసంవర్ధకశాఖ సహాయకురాలు వి.రత్నబాబు పాల్గొన్నారు. రెండు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# ఎరువుల దుకాణం, రేషన్ షాపులను ఆకస్మిక తనిఖీ చేసిన తహశీల్దార్



**హనుమంతునిపాడు, ఆగస్టు 26, ప్రభాతవార్త**
మండలంలోని నారప్పల్లి, వీరరామపురం గ్రామాలకు చెందిన రేషన్ షాపులను తహశీల్దార్ ఎస్‌కే నాగూర్ మీరా మంగళవారం ఆకస్మిక తనిఖీచేసి అక్కడిస్టాక్ వివరాలను,వసతులను తెలుసుకొని 65 సంవత్సరాలు పైబడిన వారికి తప్పకుండా ఇంటి వద్దనే రేషన్ పంపిణీ చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యవసర సరుకుల పంపిణీ విషయంలో ఎటువంటి అవకతవకలు జరిగిన తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. తదుపరి వేములపాడు గ్రామంలోని ఎరువుల దుకాణాన్ని మండల వ్యవసాయశాఖ అధికారి వి.రవికుమార్‌తో కలిసి తనిఖీ చేసి అక్కడి స్టాక్ వివరాలను అడిగి తెలుసుకోవడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్‌తో పాటు డిప్యూటీ తహశీల్దార్ రాజేష్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కృష్ణ చైతన్య, జూనియర్ అసిస్టెంట్ రసూల్, గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# పెద్దబొమ్మలాపురం వాసి రోడ్డు ప్రమాదంలో మృతి

## - ట్రాక్టర్లు అడ్డంపెట్టి కర్నూలు- గుంటూరు జాతీయ రహదారిలో ధర్నా

## - అనుమతులు లేకుండా రోడ్డుపై ధర్నాతో అడ్డగిస్తే చర్యలు తప్పవు

## - చిన్నగుడిపాడు వద్ద ట్రాఫిక్ జామ్ - ఎస్సై వి.మహేష్ హెచ్చరిక



**పెద్దదోర్నాల, ఆగస్టు 26, ప్రభాతవార్త**
పెద్దదోర్నాల మండలం పెద్దబొమ్మలాపురం గ్రామానికి చెందిన ఒకరు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో గ్రామస్తులు మంగళవారం చిన్న గుడిపాడు వద్ద కర్నూలు – గుంటూరు జాతీయ రహదారిలో ట్రాక్టర్లు అడ్డంపెట్టి ధర్నాకు దిగారు. దీంతో ట్రాఫిక్‌కు ఇరువైపులా నిలిచిపోయింది. సమాచారం అందుకున్న దోర్నాల ఎస్సై వి.మహేష్ హుటాహుటీన సంఘటనా స్థలానికి చేరుకుని ఆందోళన కారులతో చర్చించి అదుపులోకి తెచ్చారు. అనుమతులు లేకుండా రోడ్డుపై వాహనాల రాకపోకలకు ఆటంకం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు. సమస్యలు ఉన్న వాటిని చట్టపరంగా పరిష్కరించుకోవాలని హెచ్చరించారు. దీంతో ఆందోళన కారులు ధర్నాను విమమించడంతో వాహనాలు సజావుగా కొనసాగాయి.

# కరణంను కలిసిన జేసీఎస్ నేతలు



**బల్లికురవ, ఆగస్టు 26, ప్రభాతవార్త**
కొరిశపాడు మండల జేసీఎస్ నేతలు మంగళవారం చీరాల వైకాపా ఇన్‌ఛార్జీ కరణం వెంకటేష్‌బాబును కలిశారు. మండల కన్వీనర్ మామిళ్ళపల్లి వేణునివాస గృహంలో పలువురు నేతలు వెంకటేష్‌బాబును కలిసి, యోగక్షేమాలు అడిగి తెలుసు కున్నారు.ఈ సందర్భంగా ఆయా గ్రామాల నేతలను పేరు పేరునా పలకరించి, గ్రామాల్లోని పరిస్థితులను ఆరా తీశారు.

# ఎరువుల దుకాణాలను తనిఖీ చేసిన అధికారులు



**పెద్దదోర్నాల, ఆగష్టు 26 ప్రభాతవార్త**
పెద్దదోర్నాలలోని ఎరువుల దుకాణాలను ఎన్‌ఫోర్స్‌మెంట్ టీం బృందం ఎరువుల దుకాణాలను మంగళవారం ఆకస్మిక తనిఖీ చేయడం జరిగింది. ఈ ఎరువుల దుకాణాలను జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశాల మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అయినా తహశీల్దార్ అశోక్ కుమార్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి జవహర్‌లాల్ నాయక్, పోలీసు శాఖ అధికారులు సంయుక్తంగా మంగళశారం 4 ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి యజమానులకు పలు సూచనలు చేశారు. యూరియా, ఇతర ఎరువులు పొలం ఉన్న రైతులకు, పంటలు సాగు చేసిన రైతులకు, మండలంలో ఉన్న రైతులకు మాత్రమే ఎరువులు అమ్మకాలుచేయాలని, అలాగే ఎరువుల మీద కృత్రిమ కొరత ఉన్నట్లు చేస్తే అట్టి ఆదుకాణాలపై యాజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అలాగే ఎమ్మార్పీ ధరలకే ఎరువులు అమ్మకాలు చేయాలని అధికారులు తెలిపారు. అనుమతి పత్రాలు లేని కారణంగా 12.100 మెట్రిక్ టన్నులు గల రూ.4,22,000 విలువ గల ఎరువులను అమ్మకాలు నిలుపుదల చేసినట్లు మండల వ్యవసాయాధికారి డి.జవహర్‌లాల్ నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలురాజు తదితరులు పాల్గొన్నారు.

# ఈ పంట నమోదుపై రైతులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలి



**సంతనూతలపాడు, ఆగష్టు 26, ప్రభాతవార్త**
సంతనూతలపాడు మండలంలోని సంతనూతలపాడు పిడతల గుడిపాడు గ్రామాల్లో మంగళవారం నాడు వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా సంతనూతలపాడు మండల వ్యవసాయాధికారిణి పి.పావని రైతులతో మాట్లాడారు. ఈ ఖరీఫ్ 2025 సీజన్లో ఈ పంట నమోదు చేయించుకున్న రైతులు ఈ పంట నమోదు తో పాటు ఈకేవైసీ కూడా తప్పనిసరిగా చేయించుకోవాలని తెలియజేశారు. ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజన పథకం కింద ఈ ఖరీఫ్ సీజన్లో సాగు చేసిన పంటలకు ప్రీమియం చెల్లించిన రైతులు కూడా ఈ పంట నమోదుతో పాటు ఈకేవైసీ కూడా చేయించుకుంటేనే ఈ పథకానికి అర్హులు అవుతారని తెలిపారు. పొలాలు కౌలుకు తీసుకుని సాగు చేసుకుంటున్న కౌలు రైతులు గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామరెవెన్యూ అధికారులను సంప్రదించి తప్పనిసరిగా సీసీఆర్సీ కార్డుల్ని పొందినట్లయితే సొంత భూమి కలిగి ఉన్న రైతులకి వర్తించే పథకాలు అన్ని కౌలు రైతులకు కూడా వర్తిస్తాయి అని తెలిపారు. అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించిన ఏమైనా సమస్యలు ఉన్నట్లయితే మీ యొక్క రైతు సేవా కేంద్రంలో గ్రామ వ్యవసాయ సహాయకుని సంప్రదించి మీ సమస్యలు సరి చేయించుకోవాల్సి ఒదిగాతెలియజేశారు.ఈకార్యక్రమంలో వ్యవసాయవిస్తరణఅధికారులు ఎస్.వెంకటరావు, కేవీ.సుబ్బారెడ్డి,గ్రామఉద్యానవన సహాయకురాలు కే.శృతి,పశుసంవర్ధక సహాయకులు కే.వంశీ, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వైసీపీ రాష్ట్ర యువనేత కిరణ్‌కుమార్‌ను పరామర్శించిన మాజీ మంత్రి నాగార్జున



**సంతనూతలపాడు, ఆగష్టు 26, ప్రభాతవార్త**
సంతనూతలపాడు మండలం వేములపాడు గ్రామంలో వారి గృహం నందు మంగళవారం నాడు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ రాష్ట్ర వైసీపీ మేధావుల సంఘం జాయింట్ సెక్రటరీ మండవ కిరణ్ కుమార్‌ను మాజీ మంత్రి సంతనూతలపాడు నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త డాక్టర్ మేరుగ నాగార్జున తదితరులు పరామర్శించారు. ఈ కార్యక్రమంలో సంతనూతలపాడు మండల వైసీపీ కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, ఎంపీపీ బుడంగుంట విజయ, జడ్పీటీసీ దుంపా రమణమ్మ, మద్దిపాడు ఎంపీపీ వి.అరుణ కోటిరెడ్డి, వేములపాడు సర్పంచ్ ఈర్ల విజయలక్ష్మీ, వైస్ ఎంపీపీ మండవ సులోచన, వెంకట నారాయణ, వైసీపీ నేత మండవ సుబ్బారావు, బి.నాగేశ్వరరావు, ఎం.నరసింహారావు తదితరులు పాల్గొని కిరణ్ కుమార్‌ను పరామర్శించిన వారిలో ఉన్నారు. ఇటీవల వేములపాడులో గాయపడ్డ కిరణ్ కుమార్ ను మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, మండల వైసీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు ఎం.సీతమ్మ తదితరులు పరామర్శించారు.

# రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోటు పుస్తకాలు బహుకరణ



**మార్టూరు, ఆగష్టు 26, ప్రభాతవార్త**
మార్టూరు మండలంలోని తాటివారిపాలెం గ్రామంలోని ఎంపీపీ స్కూల్ వద్ద ఉదయం 11గంటలకు రోటరీ క్లబ్ ఆఫ్ మార్టూరు వారి ఆధ్వర్యంలో సేవకు మారుపేరు అయినటువంటి మదర్ థెరిసా జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా 60 మంది విద్యార్థినీ, విద్యార్థులకు రోటరీ క్లబ్ ఆఫ్ మార్టూరు ఆధ్వర్యంలో శ్రీనివాసరావు సహకారంతో సుమారు 5వేలు రూపాయల నోట్ బుక్స్, పెన్సిళ్లు, స్టేషనరీ ఐటమ్స్, స్వీట్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు మాదాల సాంబశివరావు, కిషోర్ కుమార్, హెడ్ మాస్టర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రకు మాలలు ఘన స్వాగతం

## - ఎస్సీ వర్గీకరణను రద్దు చేయాలి - నాయకులు అశోక్‌బాబు, చెన్నకేశవులు



**టంగుటూరు, ఆగష్టు 26, ప్రభాతవార్త**
ఈనెల 3న ముఖ్యమంత్రి చంద్రబాబు నియోజకవర్గం అయిన కుప్పం నుంచి ఇచ్ఛాపురం వరకు బయలుదేరిన రాజ్యాంగ పరిరక్షణ యాత్ర మంగళవారం ఉదయం టంగుటూరులోకి ప్రవేశించగానే రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర టంగుటూరులోకి ప్రవేశించగానే మాలలు, మాల సంఘాలు, అంబేద్కర్ వాసులు, యువత, మహిళలు యాత్రకు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా టంగుటూరులోని అంబేద్కర్ విగ్రహానికి రాష్ట్ర మాల ఉద్యోగుల సంఘం అధ్యక్షులు టంగుటూరు వాసి తుల్లిబిల్లి అశోక్‌బాబు, నాయుడుపాలెంకు చెందిన రిపబ్లికన్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, మాల ఉద్యోగ సంఘాల నేత దాసరి చెన్నకేశవులు మాట్లాడుతూ కుట్ర పూరితంగా తెలుగు రాష్ట్రాలు అయిన ఏపీ, తెలంగాణ ముఖ్యమంత్రులు నారా చంద్రబాబునాయుడు, రేవంత్‌రెడ్డిలు వర్గీకరణ చేయడం సిగ్గుచేటని, మాలలను విస్మరించిన ప్రభుత్వాలు గతంలో కనుమరుగయ్యాయని అంధకారంలోకి పోయాయని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేసిన వర్గీకరణను పూర్తి స్థాయిలో వ్యతిరేకిస్తూ వారి పనితీరు పట్ల తీవ్ర స్థాయిలో ఆవేదన వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు ద్వారా వర్గీకరణను అడ్డుకుంటామని వారు మాలలకు పిలుపునిచ్చారు. యాత్ర టంగుటూరులోని ఆర్టీసీ డిపో నుండి ఫైర్‌ఆఫీసు వరకు భారీ స్థాయిలో కొనసాగింది. ఈ కార్యక్రమంలో మాల ఉద్యోగులు, మాలమేధావులు, జైభీం అంబేద్కర్ సంఘాల వాదులు, యువత, మహిళలు, భారీ స్థాయిలో పాల్గొన్నారు.

# ఆక్రమణలను తక్షణమే గుర్తించి చర్యలు తీసుకోవాలి

## - ఎమ్మెల్యే కొండయ్య



**చీరాల టౌన్, ఆగష్టు 26, ప్రభాతవార్త**
కుందేరును సమిష్టిగా అభివృద్ధి చేసి ప్రజలకు ఉపయోగపడేలా తీర్చిదిద్దుతాం అని చీరాల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఆర్డీఓ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించి పరిస్థితులను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుందేరు పరిసర ప్రాంతాలు గతంలో పర్యవేక్షణ లోపంతో కుందేరు భూమి అన్యాక్రాంతం అయ్యాయి అన్నారు. వాటిని గుర్తించాలని అన్నారు. అదే విధంగా కుందేరుకు భూమి సరిహద్దులలో సర్వే రాళ్లను ఏర్పాటు చేయాలన్నారు. ప్రత్యేకంగా ఆక్రమణల విషయంలో ఎటువంటి రాజీ ఉండదని హెచ్చరించారు. ఈ సమస్యలను అధికారులు సీరియస్‌గా పరిగణించి వెంటనే నివేదికలు సమర్పించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కుందేరును ఆధునీకరణ చేసి అన్ని విధాలుగా అభివృద్ధి చేసేలా అందరూ సహకరించాలని అన్నారు. ప్రజలు కూడా అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. కుందేరును కాపాడుకోవడం మనందరి బాధ్యత అని అన్నారు. అలాగే కుందేరు శుద్ధి, రక్షణ పర్యావరణ పరిరక్షణకు వలనువైన చర్యలు తీసుకోవాలని సూచించారు. కుందేరును పర్యాటక దృక్కోణంలో కూడా అభివృద్ధి చేసే అవకాశాలపై పరిశీలన జరుగుతోందన్నారు. మౌలిక వసతులపై దృష్టి సారించి, కాలుష్యాన్ని నియంత్రించే చర్యలు చేపట్టాలని సూచించారు. ఆర్డీఓ చంద్రశేఖర్ నాయుడు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్‌కమీషనర్ అబ్దుల్‌రషీద్,తహశీల్దార్ గోపికృష్ణ,నీటిపారుదలశాఖ, పర్యావరణశాఖ, పట్టణ ప్రణాళిక శాఖల అధికారులు పాల్గొన్నారు.

# వెంకయ్య ఆశ్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ మార్టూరు వారి ఆధ్వర్యంలో అన్నదానం



**మార్టూరు, ఆగష్టు 26, ప్రభాతవార్త**
మార్టూరు కోరిగుంట్ల గవర్నమెంట్ హాస్పిటల్ పక్క రోడ్డులోని వెంకయ్య ఆశ్రమంలో బాపట్ల జిల్లా బల్లికురవ మండలం కొత్తపల్లి గ్రామ వాస్తవ్యులు దూళిపాళ్ళ శ్రావణి పుట్టిన రోజు సందర్భంగా భర్త ధూళిపాళ్ళ పున్నారావు, కుటుంబ సభ్యులు ఆశ్రమంలో అన్నదానం చేశారు. స్వీట్లు , పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షులు మాదాల సాంబశివరావు చేతుల మీదుగా నిర్వహించడం జరిగింది. ఆశ్రమ అధ్యక్షుడు తన్నీరు శివరాజేష్ దాతలకు ధన్యవాదాలు తెలిపారు. ధూళిపాళ్ళ శ్రావణికి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.

# సజ్జలను కలిసిన మండల కన్వీనర్లు



**బల్లికురవ, ఆగష్టు 26, ప్రభాతవార్త**
వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డిని మంగళవారం పార్టీ కేంద్ర కార్యాలయంలో బల్లికురవ మండల కన్వీనర్ దేవినేని కృష్ణబాబు, సంతమాగులూరు మండల కన్వీనర్ నాగేశ్వరరావు కలిశారు. ఈ సందర్భంగా ఆయా మండలాలోని సంస్థాగత పరిస్థితులను ఆయనకు వివరించారు.పార్టీపరంగా చేపట్టబోయే కార్యక్రమాలను వివరించారు.

# రాయల్ స్కూల్‌లో మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ




**మార్టూరు, ఆగష్టు 26, ప్రభాతవార్త**
వినాయక చతుర్థి పండుగ సందర్భంగా ముందస్తుగా మార్టూరు రాయల్ స్కూల్ నందు పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయక ప్రతిమలను ప్రతి విద్యార్థినీ, విద్యార్థులకు పంపిణీ చేయటం జరిగింది.ఈ కార్యక్రమంలో సంస్థల అధినేత పేరం రవీంద్రబాబు,పేరంస్వప్న, ఇన్‌ఛార్జీ కే.మధుబాబు,ప్రధానోపాధ్యాయులు డీవీ.బాలసుబ్రహ్మణ్యం,రాయల్ పయనీర్స్ ప్రిన్సిపాల్ కే.సుజాత,ఏవో కే.భానుప్రకాష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యాజమాన్యం వారు విద్యార్థినీ, విద్యార్థులచే రూపొందించిన వినాయకుని ఆకృతి విశేషంగా ఆకర్షించింది. ప్రతి ఏటా యాజమాన్యం వారు 2000 మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తారు.

# ఎరువుల షాపులను తనిఖీ చేసిన ఏవో శివగంగ ప్రసాదు



**అర్ధవీడు, ఆగష్టు 26, ప్రభాతవార్త**
మండలంలోని ఎరువుల షాపులను మండల తహశిల్దార్ నాగార్జున రెడ్డి, మండల వ్యవసాయ శాఖ అధికారి జి శివగంగ ప్రసాద్‌లు మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మండలంలోని దొనకొండ,పెద్ద కందుకూరు గ్రామాల్లోని ఎరువుల దుకాణాలను వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. దొనకొండ గ్రామంలోని ఎరువుల షాపులను,శ్రీ వెంకటేశ్వర ట్రేడర్స్ దుకాణాన్ని తనిఖీ చేసి యూరియా ఎరువుల నిలువలను పరిశీలించి షాపుకు సంబంధించిన పత్రాలను తనిఖీ చేశారు.ఎటువంటి వ్యత్యాసాలు లేకపోవడంతో అధికారులు సదరు షాపు యజమానికి కృత్రిమంగా యూరియా నిల్వలను ఉంచి అధిక ధరలకు అమ్మినచో కఠిన చర్యలు తీసుకొని సదరు షాపుయొక్క లైసెన్స్‌ను రద్దు చేయడం జరుగుతుందని తెలిపారు.

# ఎరువుల షాపులను తనిఖీ చేసిన విజిలెన్స్ అధికారులు



**పామూరు, ఆగష్టు 25, ప్రభాతవార్త**
విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల బృందం పామూరులో ఎరువుల దుకాణాలను మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. శ్రీలక్ష్మీ శ్రీనివాస ఎరువుల దుకాణం తనిఖీ చేసి తగిన పత్రంలు లేనందున భౌతిక నిల్వలో తేడాలు ఉన్నందున 31.29 ఎంటీకు సంబంధించి రూ.588920 స్టాక్ సీజన్ చేసి 6ఏ కేసు నమోదు చేశారు. తదుపరి ముప్పసాని ఎరువుల దుకాణం తనిఖీ చేసి 29.235 ఎంటీకు సంబంధించి రూ.244762 స్టాక్ చేసి 6 ఏ కేసు నమోదు చేశారు. మొత్తం 60 మెట్రిక్ టన్నులకు సంతాది రూ.833,682 స్టాక్‌ను సీజ్ చేసినట్లు విజిలెన్స్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రవిబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ ఎమ్మార్వో పాల్, మండల తహశీల్దార్ వాసుదేవ, వ్యవసాయాధికారి అబ్రహం లింకన్ పాల్గొన్నారు.

# చవితికి మట్టి వినాయక విగ్రహాలనే వినియోగించాలి



**సీఎస్‌పురం, ఆగష్టు 26, ప్రభాతవార్త**
మట్టి గణపతే మహాగణపతి అని మండలంలోని అనికాలపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం జే.భారతి అన్నారు. వినాయక చతుర్థి బుధవారంను పురస్కరించుకుని స్థానిక పాఠశాలలో హెచ్‌ఎం భారతి ఆధ్వర్యంలో పాఠశాలలోని విద్యార్థులకు మట్టి వినాయక విగ్రహాల తయారీపై అవగాహన ,ఆశ్యకత, ప్రయోజనాలు వివరించారు. ఈ సందర్భంగా సహచర ఉపాధ్యాయుని, విద్యార్థులతో కలిసి 87 మట్టి వినాయక విగ్రహాలను తయారు చేసి విద్యార్థుల తల్లిదండ్రులకు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి విగ్రహాలనే వాడాలని, పండుగ ముగిసిన తరువాత పూజలో వినియోగించిన గణనాథుని ఇంటోని పూలమొక్కల కుండీల మొదట్లో వేసి నీరుపోస్తే కరిగిపోతుందని ఇది ఎంతో ఉపయోగకరమన్నారు. రంగులతో చేసిన విగ్రహాలు నీటి కుంటలు, వాగులు, వంకలు, చెరువుల్లో నిమజ్జనం చేయడం ద్వారా నీరు కలుషితమవుతుందని ప్రతి ఇంటా మట్టి వినాయకునే వాడాలని విద్యార్థులకు, తల్లిదండ్రులకు సూచించి గ్రామస్తులకు మట్టి విగ్రహాలను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుని నారాయణం అలేఖ్య, విద్యార్థుల తల్లులు పాల్గొన్నారు.

# మట్టి వినాయక విగ్రహాలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యం

## - ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య



**చీరాల, ఆగష్టు 26, ప్రభాతవార్త**
మట్టి వినాయక విగ్రహాలను పూజించడం వలన పర్యావరణ సురక్షితంగా ఉండి గ్రీన్ ఆంధ్రప్రదేశ్ సాధ్యమవుతుందని ఆ దిశగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యేమద్దులూరి మాలకొండయ్య అన్నారు. మంగళవారం చీరాల గడియార సెంటర్లో తెలుగు యువత ఆధ్వర్యంలో వినాయక చవితి పండుగను పురస్కరించుకుని మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్య క్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన ఎమ్మెల్యే కొండయ్య స్వయంగా విగ్రహాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణానికి హానీ కలిగించే ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు బదులుగా సహజమైన మట్టి వినాయక విగ్రహాలను ప్రజలు ఎంచుకోవాలని సూచించారు. గణేష్ నవరాత్రి వేడుకల్లో పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఆయన పిలుపునిచ్చారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పసుపుగల్లులో ఉద్రిక్తల నడుమ దుకాణాలు కూల్చివేత



**ముండ్లమూరు, ఆగష్టు 26, ప్రభాతవార్త**
మండలంలోని పసుపుగల్లు గ్రామంలో మంగళవారం ఉద్రిక్తత చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఉదయం 6గంటల సమయంలో గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ వైసీపీ మండల అధ్యక్షులు చింత శ్రీనివాసులురెడ్డికి సంబంధించిన మూడు దుకాణాలు సెంటర్లో గత 20 సంవత్సరాల నుండి నిర్మించుకోగా వాటికి సంబంధించిన దుకాణాలను మంగళవారం ఉదయం 6గంటల సమయంలో ఇది ప్రభుత్వ స్థలంలో మీరు నిర్మించుకున్నారని అధికార యంత్రాంగం అధికారులు, పోలీసు యంత్రాంగం ఆ దుకాణాలని ప్రొక్లేయన్ సాయంతో తొలగించారు.ఈ తొలగించే సమయంలో చింతా శ్రీనివాసులురెడ్డి కుటుంబ సభ్యులు మా దుకాణాలు తొలగించవద్దు అని ప్రొక్లెన్ కి అడ్డం వెళ్ళగా ఈ సమయంలో పోలీసులకు చింతా శ్రీనివాసరెడ్డికి కుటుంబ సభ్యులకు తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ క్రమంలో పోలీసులు చింతా శ్రీనివాసరెడ్డి కుటుంబ సభ్యుల్ని మహిళలని పక్కకు నెట్టివేశారు. ఈ స్థలంలో గత 25 సంవత్సరాల నుండి మా సొంత స్థలంలోనే ఉంది అని మా స్థలంలో ఏర్పాటు చేసుకున్న దుకాణాలన్ని తొలగించడం అన్యాయమని ఈ స్థలం పంచాయతీ రాజ్ జడ్పీకి సంబంధించినది వీరికి సంబంధం లేదని రాజకీయంగా ఎదుర్కోలేక నేను వైసీపీ మండల అధ్యక్షులుగా ఉన్నందుకే మా ఆస్తులను ధ్వంసం చేస్తున్నారని, మేము ప్రజల పక్షాన నిలబడే నాయకులమని చింతా శ్రీనివాసులురెడ్డి అన్నారు. దుకాణాలను తొలగించడం అన్యాయమని గ్రామస్తులు అన్నారు.

**వీఆర్వో గురవయ్య వివరణ :**
ఈ మూడు దుకాణాలు ప్రభుత్వ స్థలంలోనే ఉందని, ఈ దుకాణాల వెనుక ఉన్న స్థలం చింత శ్రీనివాసులు రెడ్డి స్థలం అని ఈ దుకాణాలను తొలగించి ఇదే స్థలంలో బస్సు షెల్టర్ నిర్మించడం జరుగుతుందని వీఆర్వో గురవయ్య వివరణ ఇచ్చారు.

## ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్‌కు దేవకి శుభాకాంక్షలు

**కనిగిరి,ఆగస్టు 26,ప్రభాతవార్త**
ప్రజాసేవే పరమావధిగా కష్టపడి పని చేసే వారికి జనసేన పార్టీలో తప్పక గుర్తింపు ఉంటుందని అఖిల భారత ఆర్యవైశ్య అన్నదాన సత్రాల కమిటీ ఛైర్మన్ దేవకి వెంకటేశ్వర్లు వ్యాఖ్యానించారు. నిజాయితీ, నిబద్ధత గల నేతలకు సముచిత స్థానం కల్పించడంలో పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ఎప్పుడూ ముందుంటారని ఆయన స్పష్టం చేశారు. ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్‌గా షేక్ రియాజ్ నియామకమే అందుకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు.ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్‌గా నియమితులైన జనసేన నేత షేక్ రియాజ్‌ను అఖిల భారత ఆర్యవైశ్య అన్నదాన సత్ర సముదాయాల కమిటీ ఛైర్మన్ దేవకి వెంకటేశ్వర్లు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.షేక్ రియాజ్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపిన వారిలో అఖిల భారత ఆర్యవైశ్య అన్నదాన సత్ర సముదాయాల కమిటీ కమిటీ గౌరవ అధ్యక్షులు సిద్ధ నాగేశ్వరరావు, కనిగిరి పట్టణ ఆర్యవైశ్య సంఘ నాయకులు, కనిగిరి పట్టణ ఆర్యవైశ్య వాసవి క్లబ్ నాయకులు, కనమర్లపూడి హరి, మువ్వల నాగరాజు, గుర్రం రంగనాథ్, చలువాది సుబ్రహ్మణ్యం తదితరులు ఉన్నారు.

# ప్రజలందరికి సకల శుభాలు కలగాలి

**- వైసీపీ ఇన్‌ఛార్జీ దద్దాల నారాయణ వినాయక చవితి శుభాకాంక్షలు**



**కనిగిరి, ఆగష్టు 26, ప్రభాతవార్త**
కనిగిరి నియోజకవర్గ ప్రజలందరికి వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేస్తూ వైఎస్సార్‌సీపీ కనిగిరి ఇన్‌ఛార్జ్ దద్దాల నారాయణ యాదవ్ మంగళవారం ప్రత్యేక సందేశం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో మంచి పనులకు విఘ్నాలు తొలగిపోయి ప్రజలందరికి సకల శుభాలు కలగాలని ఆకాంక్షించారు.గణనాథుని ఆశీస్సులతో ప్రజలకు క్షేమం, స్థైర్యం,ఆయురారోగ్యాలు,సకల సంపదలు సిద్ధించాలని అభిలాషించారు. విఘ్నేశ్వరుడి కరుణా కటాక్షాలతో ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో అభివృద్ధి చెందాలని కోరుతూ, వినాయక చవితి పర్వదినం అందరికి ఆనందం, సౌఖ్యం, ఐశ్వర్యాన్ని అందించాలని దద్దాల నారాయణ యాదవ్ ఆకాంక్షించారు.

## వినాయక చవితి పర్వదినం ఆనందం, ఐశ్వర్యం అందించాలి

**- చింతలచెరువు సత్యనారాయణ**



**కనిగిరి, ఆగష్టు 26, ప్రభాతవార్త**
కనిగిరి నియోజకవర్గ ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలుపుతూ వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు,రాష్ట్ర మాజీరెడ్డి కార్పొరేషన్ ఛైర్మన్ చింతలచెరువు సత్యనారాయణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణనాథుని ఆశీస్సులతో ప్రజల జీవితాల్లోని అన్ని విఘ్నాలు తొలగిపోయి సుఖసంతోషాలు, ఆరోగ్యం, ఐశ్వర్యం కలగాలని ఆకాంక్షించారు. ప్రతి కుటుంబం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని, వినాయకుడి కరుణా కటాక్షాలతో ప్రజలందరికి సౌభాగ్యం సిద్ధించాలని చింతలచెరువు సత్యనారాయణ అభిలాషించారు.

# కనిగిరి రాజకీయాలపై జగన్ - దద్దాల కీలక చర్చలు



**కనిగిరి, ఆగష్టు 26, ప్రభాతవార్త**
కనిగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌ఛార్జీ దద్దాల నారాయణయాదవ్ మంగళవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇద్దరూ నియోజకవర్గ రాజకీయ పరిణామాలు, పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యచరణపై విస్తృతంగా చర్చించారు. కనిగిరి నియోజకవర్గంలో పార్టీ కార్యకర్తలు, నాయకులకు కష్టకాలంలో అండగా నిలుస్తున్న దద్దాల తీరును జగన్ అభినందించారు. అలాగే పార్టీ కార్యక్రమాల నిర్వహణ, ప్రజలతో అనుసంధానం, భవిష్యత్ ప్రణాళికలు అంశాలపై జగన్‌మోహన్‌రెడ్డి ఇన్‌ఛార్జీ దద్దాలకు కొన్ని కీలక సూచనలు చేసినట్లు సమాచారం.

## డీఎస్సీ జిల్లా టాపర్ గాలి లావణ్యకు తొగట వీర క్షత్రియుల ఘన సన్మానం

**కనిగిరి, ఆగష్టు 26, ప్రభాతవార్త**



ప్రకాశం జిల్లా డీఎస్సీ- 2025 లో ఎస్జీటీ విభాగంలో జిల్లా టాపర్‌గా నిలిచిన గాలి లావణ్యకు మంగళవారం తొగల వీర క్షత్రియుల ఆధ్వర్యంలో ఘన సన్మానం జరిగింది. చిన్ననాటి నుంచే తల్లిదండ్రులను కోల్పోయి అమ్మమ్మ వద్ద పెరిగిన లావణ్య కష్టాలను జయిస్తూ పట్టుదలతో ముందుకు సాగి జిల్లా ర్యాంకు సాధించడం విశేషమని వక్తలు ప్రసందించారు. తొగల వీర క్షత్రియుల నాయకులు శిగా కృష్ణారావు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్న ఆకాంక్షను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గాలి నాగేశ్వరరావు, పీవీ శేషయ్య, గొరిగె లక్ష్మీనారాయణ, గాలి భోగేశ్వరరావు, గాలి ఏడుకొండలు, పూజలరమణయ్య, గొరిగె మాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు. అభినందన సభలో లావణ్య మాట్లాడుతూ ఇప్పటి వరకు నేను ఒంటరిగా ఉన్నానని అనుకున్నాను.కానీ ఈ సన్మానం తర్వాత నాకు ఒక పెద్ద కుటుంబం దొరికినట్టుంది. నేను పొందిన విజయాన్ని పేద విద్యార్థులకు అందించేందుకు కృషి చేస్తాను అని తెలిపారు.

## జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ వెంకాయమ్మకు దద్దాల నారాయణ జన్మదిన శుభాకాంక్షలు



**కనిగిరి, ఆగష్టు 26, ప్రభాతవార్త**
ప్రకాశం జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పుట్టినరోజు సందర్భంగా మంగళవారం దర్శి పార్టీ కార్యాలయంలో కనిగిరి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌ఛార్జీ దద్దాల నారాయణయాదవ్ మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు,దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి,జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మలను దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పీసీపల్లి మండల పార్టీ నాయకులు పెద్దిరెడ్డి ఒకే రెడ్డి, గోవవరపు బొగ్గారెడ్డి,భూమిరెడ్డి కొండారెడ్డి,మాలేరాజశేఖర్‌రెడ్డి,పాతకొట్టుచిన్నిరెడ్డి, సైకం ఏడుకొండలు పాల్గొని బూచేపల్లి వెంకాయమ్మకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# కనిగిరి ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు

**తెలిపిన ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి**



**కనిగిరి, ఆగష్టు 26, ప్రభాతవార్త**
కనిగిరి నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి వినాయక చవితి పర్వదినం సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి కుటుంబంలో సుఖశాంతులు నెలకొని,ఐశ్వర్యం సమృద్ధిగా రావాలని, విఘ్నవినాశకుడు గణనాథుడు ప్రజలందరికి ఆరోగ్యాన్ని,ఆనందాన్ని ప్రసాదించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వినాయక చవితి పండుగను పర్యావరణ హితంగా జరుపుకోవాలని, మట్టితో తయారు చేసిన విగ్రహాలను ప్రతిష్ఠించుకోవడం ద్వారా ప్రకృతిని కాపాడాలని పిలుపునిచ్చారు. ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని, సమాజ శ్రేయస్సు కోసం అందరూ ఐక్యమత్యంతో ముందుకు సాగాలని ఆయన సూచించారు. అలాగే నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయని, ప్రజల ఆశీర్వాదంతో మరిన్ని శ్రేయోభిలాష కార్యక్రమాలను అమలు చేయడానికి కట్టుబడి ఉన్నానని ఎమ్మెల్యే నరసింహారెడ్డి తెలిపారు.

## యూరియా సరఫరా సమృద్ధిగా - అధికారుల భరోసా

**కనిగిరి, ఆగష్టు 26, ప్రభాతవార్త**



రైతులకు అవసరమైన యూరియా ఎరువుల కొరత లేదని అధికారులు స్పష్టం చేశారు. కనిగిరి రెవెన్యూ డివిజన్ ఆర్డీఓ కేశవర్ధన్‌రెడ్డి, ఏడీఏ జైసింహాలిన్, మండల తహశిల్దార్ ఆకుల వెంకట రవికుమార్ ఆకస్మికంగా పట్టణంలోని పలుఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా శ్రీ వాసవి ఫర్టిలైజర్స్, ఆంధ్ర జనరల్ మర్చంట్స్, మన గ్రోమోర్ సెంటర్, ఎన్టీ ఆగ్రో క్లినిక్ దుకాణాల్లో యూరియా నిల్వలు, అమ్మకాల వివరాలను పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్, ఈ పాస్ మిషన్ లెక్కలు సరిపోలుతున్నాయా లేదా అని నిశితంగా తనిఖీ చేశారు. అధికారులు మాట్లాడుతూ ప్రస్తుతం ప్రైవేట్ డీలర్ల వద్ద 44 టన్నులు, రైతు సేవా కేంద్రాల్లో 111 టన్నుల యూరియా నిల్వ ఉందని తెలిపారు. రైతులు ప్రధానంగా గడ్డి జొన్న, వరి, మొక్కజొన్న, సజ్జ పంటలకు యూరియాను వినియోగిస్తున్నారని వివరించారు. అలాగే గ్రామ వ్యవసాయ సహాయకులకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. రైతుకు నిజంగా అవసరమైనంతే యూరియాను ఇవ్వాలని, ఒక్కో రైతుకు ఐదు బస్తాలకు మించి విక్రయించరాదని సూచించారు. అక్రమ రవాణా, నిల్వలు, అధిక ధరలు, బ్లాక్ మార్కెట్ వంటి చర్యలను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు అవసరమైన యూరియా ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండేలా అన్ని చర్యలు తీసుకుంటామని అధికారులు భరోసా ఇచ్చారు.

# సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడిగా సయ్యద్ యాసిన్ ఎంపిక



**కనిగిరి, ఆగష్టు 26, ప్రభాతవార్త**
భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) రాష్ట్ర సమితి సభ్యుడిగా కనిగిరి ప్రాంతానికి చెందిన కామ్రేడ్ సయ్యద్ యాసిన్ ఎన్నికయ్యారు. ఇటీవల ఒంగోలులో జరిగిన సీపీఐ 28వ రాష్ట్ర మహాసభల ప్రతినిధుల సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. సీపీఐ కనిగిరి నియోజకవర్గం కార్యదర్శిగా, ఏఐటీయుసీ జిల్లా అధ్యక్షునిగా సయ్యద్ యాసిన్ పని చేస్తున్న నేపథ్యంలో సీపీఐ రాష్ట్ర సమితిలో సభ్యునిగా ఎన్నిక కావడం హర్షించే విషయం. సయ్యద్ యాసిన్ విద్యార్థి దశ నుంచే కమ్యూనిస్టు భావజాలంతో ముందుకు సాగిన యాసిన్, ఏఐఎస్ఎఫ్, ఏఐటీయుసీ జిల్లా పార్టీ, ప్రజా సంఘాల్లో పలు పదవులు నిర్వహించారు. పేదలు, కార్మికులు, బడుగు, బలహీన వర్గాల కోసం నిరంతరం పోరాడుతూ సేవా కార్యక్రమాల్లోనూ చురుగ్గా పాల్గొన్న ఆయన సేవలను గుర్తించి రాష్ట్ర పార్టీ ఈ గౌరవభారాన్ని అప్పగించింది. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, కార్మిక- కర్షక వర్గాల సమస్యల పరిష్కారానికి మరింతగా కృషి చేస్తానని యాసిన్ స్పష్టం చేశారు. ఆయన ఎంపిక పార్టీ బలోపేతానికి, ప్రజా ఉద్యమాలకు దోహదం చేస్తుందన్న అభిప్రాయం పార్టీ వర్గాల్లో వ్యక్తమవుతోంది.

## జిల్లా నియోజకవర్గం ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు

**- సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి**

**- గణనాథులు మండపాలకు కూటమి ప్రభుత్వం ఉచిత విద్యుత్**



**సింగరాయకొండ, ఆగష్టు 26,ప్రభాతవార్త**
ప్రకాశం జిల్లా, కొండేపి నియోజకవర్గం ప్రజలకు సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మంగళవారం వినాయకచవితి శుభాకాంక్షలు తెలిపారు.సకల శాస్త్రాలకు అధిపతిగా, బుద్ధికి, జ్ఞానానికి ఆరాధ్యుడిగా,ఆటంకాలను తొలగించే విఘ్నేశ్వరుడిగా భక్తిశ్రద్ధలతో హిందువులు గణనాథుడిని ఆరాధిస్తారని ఆయన పేర్కొన్నారు.గణపతి నవరాత్రి ఉత్సవాలను ప్రజలంతా ఘనంగా జరుపుకోవాలన్నారు. గణనాథుని ఆశీసులు అందరిపై ఉండాలని,అందరికి మంచి జరగాలని ఆయన ఆకాంక్షించారు.వినాయక చవితి అంటే కేవలం ఒక పండుగ మాత్రమే కాదని భారత స్వాతంత్ర్య ఉద్యమానికి ప్రజలను ఏకం చేసి, వారిలో జాతీయ భావాన్ని నింపేందుకు దోహదపడిన ఒక సామాజిక స్ఫూర్తి అన్నారు. అటువంటి గణనాథుని మండపాలకు రాష్ట్ర వ్యాప్తంగా కూటమి ప్రభుత్వం ఉచిత విద్యుత్ అందిస్తోందని తెలిపారు.

## వినాయక చవితి శుభాకాంక్షలు పిఏసి సభ్యులు ఆదిమూలపు సురేష్



**సింగరాయకొండ, ఆగష్టు 26, ప్రభాతవార్త**
వినాయక చవితి సందర్భంగా రాష్ట్ర ప్రజలకు, కొండేపి నియోజకవర్గ ప్రజలకు వైఎస్సార్సీపీ రాష్ట్ర పీఏసీ సభ్యులు,కొండేపి నియోజకవర్గ ఇంచార్జ్ డాక్టర్ ఆదిమూలపు సురేష్ వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేసారు. మొదటి పూజలన్నీ గణనాథుడికే. విఘ్నాలను తొలగించే ఆ వినాయకుడి ఆశీస్సులతో తెలుగు రాష్ట్రాల ప్రజలు, కొండేపి నియోజకవర్గ ప్రజలు చేపట్టే ప్రతి పని విజయవంతం కావాలని కోరుకుంటున్నాను. ఏకదంతుడి కృపతో సుఖ సంతోషాలు, క్షేమం, స్థైర్యం,ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షిస్తున్నాను" అని ఆయన అన్నారు.పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా మట్టి గణపతులను పూజించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బంధుమిత్రులతో ఆనందోత్సాహాలతో పండుగను జరుపుకోవాలని కోరారు.

# గణపతి నవరాత్రోత్సవాలు సంతోషంగా జరుపుకోవాలి

**- ప్రజలందరికి వినాయక చవితి శుభాకాంక్షులు - ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు**



**మార్టూరు, ఆగష్టు 26, ప్రభాతవార్త**
విజయ గణపతినవరాత్రిఉత్సవాలు ప్రజలందరూ ఐక్యమత్యంతో ఆనందంగా జరుపుకోవాలని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. తెలుగు ప్రజలకు ఆయన వినాయక చతుర్థి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. శాంతి, సౌభ్రాతృత్వం వెల్లివిరిసేలా ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలతో నవరాత్రోత్సవాలు జరుపుకోవాలని ఆకాంక్షించారు. విగ్నేశ్వరుడు శుభారంభాలకు సంకేతం, విజయానికి ప్రతీక అని గణపతి ఆశీస్సులతో ఆరోగ్యంగా, సుఖసంతోషాలతో ఉండాలన్నారు. సమాజంలో ఐక్యత,సౌభ్రాతృత్వం,సమగ్రఅభివృద్ధినెలకొనేలా ఈ పండుగ తోడ్పడాలన్నారు.గణేష్‌ని ఆశీస్సులతో అందరి జీవితాల్లో ఆరోగ్యం,సంపదను నింపాలని ఆకాంక్షించారు. గణేష్ చతుర్థి సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మికతలకు ప్రతీక అన్నారు. ప్రతి వాడలో ప్రతి గడపలో ప్రతి వీధిలో పండుగ ఆనందోత్సాహాలతో జరుపుకోవాలన్నారు. ప్రగతి సారధి ముఖ్యమంత్రి చంద్రబాబుసారధ్యంలో రాష్ట్రం అభివృద్ధిదిశగా పయనిస్తూ,ప్రజలకు సంక్షేమానికి బాటలు వేస్తుందన్నారు.పర్యావరణ పరిరక్షణ కోసం గణపతినిమజ్జనాన్ని పర్యావరణహితంగా జరుపు కోవాలన్నారు. భవిష్యత్ తరాలకు పచ్చని వాతావరణాన్ని అందించడం మనందరి బాధ్యత అని ఎమ్మెల్యే ఏలూరి పిలుపునిచ్చారు.ప్రజలు సంతోషం, శాంతి,అభివృద్ధి, ఐశ్వర్యాలతో నిండిన కొత్త ఆరంభాలు సాధించాలని, విగ్నేశ్వరుడు అందరికి శక్తి ధైర్యం ప్రసాదించాలని వేడుకున్నారు. వినాయక చవితి వేడుకలను రాజకీయాలకు అతీతంగా భక్తి భావంతో ఐక్యతతో జరుపుకోవాలని పిలుపునిచ్చారు. గణనాథుడి ఆశీస్సులతో రాష్ట్రం అభివృద్ధిలో అగ్రగామిగా నిలవాలని కోరుకుంటున్నానని ఎమ్మెల్యే ఏలూరి పేర్కొన్నారు.

## చింత శ్రీనివాసరెడ్డిని పరామర్శించి కూల్చిన షాపుల స్థలాలని పరిశీలించిన

**దర్శి ఎమ్మెల్యే వైసీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి**



**ముండ్లమూరు, ఆగష్టు 26, ప్రభాతవార్త**
ముండ్లమూరు మండలంలోని పసుపుగల్లు గ్రామంలో మంగళవారం ఉదయంకూటమి ప్రభుత్వం కక్షపూరితంగా మండల పార్టీ అధ్యక్షులు చింతా శ్రీనివాసరెడ్డి షాపును కూల్చి పోలీసులు దాడి చేసిన విషయంతెలుసుకుని వెళ్ళి ఆదివారం సాయంత్రం పరామర్శించిన ప్రకాశం జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ.ఈ సందర్భంగా సంఘటనస్థలాన్ని పరిశీలించి జరిగిన విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. వైసీపీ నాయకులపై జరుగుతున్న దాడుల్ని ఆపాలని కక్షపూరిత రాజకీయాలు చేయడం ఆపాలని చింతా శ్రీనివాస్ రెడ్డి కుటుంబానికి అండగా ఉంటామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు టి.రత్నరాజు, వెన్నపూస వెంకటరెడ్డి, సూదిదేవర అంజయ్య, బంక నాగిరెడ్డి, బెజ్జం కృష్ణారెడ్డి, పాలడుగు చిరంజీవి, దుగ్గిరెడ్డి నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అద్దంకి సీనియర్,జూనియర్ సివిల్ కోర్టుల అసిస్టెంట్ ప్రభుత్వ లాయర్‌గా బత్తుల రామకోటయ్య

**- సీనియర్ న్యాయవాది రామకోటయ్యను ప్రభుత్వం నియమించడపట్ల పలువురు హర్షం**

**- రామకోటయ్యకు అభినందనల వెల్లువ**



**సంతమాగులూరు ,ఆగష్టు 26, ప్రభాతవార్త**
సంతమాగులూరు మండలం పుట్టవారిపాలెం గ్రామానికి చెందిన సీనియర్ న్యాయవాది బత్తుల రామకోటయ్యకు అద్దంకి నియోజకవర్గంలో అరుదైన గౌరవం దక్కింది. రామకోటయ్యను అద్దంకి సీనియర్, జూనియర్ సివిల్ కోర్టులకు అసిస్టెంట్ ప్రభుత్వ న్యాయవాదిగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం త్తుర్వులు జారీ చేసింది.బత్తుల రామకోటయ్యను ప్రభుత్వ న్యాయవాదిగా నియామకం కావడం పట్ల నియోజకవర్గంలోని అన్నిమండలాలనుండి పలువురు మర్షం వెలుబుచ్చడంతో పాటు రామకోటయ్యకు అభినందలు తెలిపారు. సంతమాగులూరు మండలం పుట్టవారిపాలెం గ్రామానికి చెందిన బత్తుల రామకోటయ్య నిరుపేద కుటుంబానికి చెందిన బత్తుల ఆదినారాయణ రాగమ్మల పెద్దకుమారుడు. రామకోటయ్య అక్షరాభ్యాసం నుండి 7వ తరగతి వరకు పుట్టవారిపాలెం లోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలోనూ,ఆ తరువాత సంతమాగులూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల,జూనియర్‌కళాశాలలో విద్యనభ్యసించారు. విద్యార్థి దశనుండే నాయకత్వ లక్షణాలు కలిగిన రామకోటయ్య కళాశాలలో విద్యార్థి నాయకుడిగ కొనసాగారు. ఏలూరు లోని సీఆర్ రెడ్డి న్యాయ కళాశాలలో లా పట్టభద్రుడయ్యారు. ఆసమయంలో ఎస్ఎఫ్ఐ లో చేరి న్యాపోరాటాలు ఆనాటినుండే రామకోటయ్య ప్రస్థానం మొదలు పెట్టారు. న్యాయవాదిగా పట్టా తీసుకుని 2001 నుండి అద్దంకి లో న్యాయ వాదిగా వృత్తిని ఆరంభించి పలు సమస్యాత్మక కేసుల్లో రామకోటయ్య వాదనలకు న్యాస్థానం ఏకీభవించి తీర్పులు వచ్చేలా వాదించి న్యాయవాద వృత్తిలో తనదైన ముద్ర వేసుకున్నారు.న్యావాదిగా వృత్తి లో కొనసాగుతున్నా రాజకీయాలలో చురుకైన పాత్ర పోషిస్తూ వచ్చారు. ఒక వైపు న్యాయవాద వృత్తిని సమర్ధవంతంగా నిర్వహిస్తూ జిల్లా కోర్టులలోనూ,హైకోర్టులోనూ రామకోటయ్య పలు కేసులు వాదించి సోషల్ మీడియాలో హైకోర్టు న్యాయవాదిగా ఆరామకోటయ్య గుర్తింపు పొందారు.రాష్ట్ర సర్వోన్నత న్యాస్థానం అనుమతి మేరకు పేదలకు ఉచిత న్యా సలహామండలిలోనూ పనిచేశారు. గొట్టిపాటి రవికుమార్ అద్దంకి నియోజకవర్గంలో అడుగిడిన నాటినుండి ఆయనకు అండగా నిలుస్తూ వచ్చారు. ఈనేపథ్యంలోనే గతంలో టీడీపీ బాపట్ల జిల్లా లీగల్ సెల్ అధ్యక్షులుగా కూడ ఆపనిచేశారు. వృత్తి పరంగా, రాజకీయ పరంగా సమర్ధవంతమైన బత్తుల రామకోటయ్యను ప్రభుత్వ న్యాయవాదిగా రాష్ట్ర విద్యుత్‌శాఖా మంత్రిగొట్టిపాటి రవికుమార్ సిఫారసు మేరకు అద్దంకి లోని రెండు సివిల్ న్యాయస్థానాల్లో ప్రభుత్వ న్యాయవాదిగా నియమించడం జరిగింది.ఈనేపథ్యంలో రామకోటయ్యను ప్రభుత్వన్యాయవాదిగా నియమించడం పట్ల సంతమాగులూరు మండలంలోని టీడీపీ,జనసేన క్యాడర్లు హర్షం వెలుబుచ్చడంతో పాటు రామకోటయ్య నియామకానికి సహకరించిన మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు అడినమాటకు కట్టుబడే వ్యకి గొట్టిపాటిరవికుమార్ అనికొనియాడుతున్నారు.ఈ సందర్భంగా రామకోటయ్య మాట్లాడుతూ తనను ఆదరించి ప్రభుత్వ న్యాయవాదిగా నియమకానికి సహకరించన మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు,నియోజకవర్గంలోని పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు,

# సచివాలయాలను తనిఖీ చేసిన ఎంపీడీఓ



**నాగులుప్పలపాడు, ఆగష్టు26,ప్రభాతవార్త**
నాగులుప్పలపాడు మండలంలోని చీర్వనుప్పలపాడు అగ్రహారంనందు గల గ్రామసచివాలయం, నాగులుప్పలపాడు గ్రామ సచివాలయంను స్థానిక ఎంపీడీఓ తేళ్ళ రవికుమార్ మంగళవారంఆకస్మిక తనిఖీ చేశారు. హాజరు మూమెంట్ రిజిస్టర్ పలు అంశాల ప్రగతి గురించి పరిశీలించడం జరిగింది. ముందస్తు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరైన ఫంక్షనల్ అసిస్టెంట్స్ పై క్రమశిక్షణ చర్యలు తీసుకోబడునని తెలిపారు. స్వమిత్వ, కౌశలం, స్వేలు, స్వచ్ఛ సర్వేక్షన్, సీజనల్ వ్యాధులు, సోక్ పిట్ల నిర్మాణం, తదితర విషయాలపైన సచివాలయం సిబ్బందితో సమీక్ష నిర్వహించడం జరిగింది. అనంతరం కల్లూరి నాగేశ్వరరావు అనే రైతు ఉపాధి హామీ పథకం ద్వారా సాగు చేస్తున్నా మునగమొక్కలు తోటను పరిశీలించారు. తేళ్ళరవికుమార్‌తో పాటు ఏపీడీఓ డి.రవిబాబు, ఎంఆర్‌సీ అంజయ్య, పంచాయతీ సెక్రటరీలు శ్రీదేవి, శరత్, చీర్వానుప్పలపాడు మురళీ, తదితరులు ఉన్నారు.

## నాలుగు మూల స్తంభాలు లాంటి హీరోలతో చిత్రాలు


**- సినీ నటుడు అజయ్ ఘోష్ వెల్లడి**



**నాగులుప్పలపాడు, ఆగష్టు 26, ప్రభాతవార్త**
నేను చేసిన కొన్ని సినిమాలు చిరస్థాయిగా నిలిచిపోయాయని అది నా దృష్టం అంటూ సినీ నటుడు అజయ్ హోస్ వెల్లడించారు. సోమవారం నాడు ఒంగోలు నుండి చీరాల వైపు సామాన్య మానవుడుగా బైకుపై వెళ్తూ నాగులుప్పలపాడు గ్రామంలోని బెల్లం వెంకటరావు టీ స్టాల్ వద్ద ఆగారు ముందుగా గ్రామస్తులాయన గుర్తించకపోయినా ఆలస్యంగా గుర్తించి ఆయనను సెల్ఫీలు ఫొటోలతో పాటు సినీ జీవితం గురించి ప్రశ్నల పరంపరం సాగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సినిమా అంటే వినోదం కాదు, సమాజానికి సందేశాన్నిచ్చే వైవిద్యమైన చిత్రాలు కూడా చేస్తున్న అందుకే నా సినిమాలు గురించి గర్వంగా చెప్పుకుంటూ ఉంటానని అన్నారు. థియేటర్లో ఎవరి సినిమాలు విజిల్స్ కొట్టారు ఆ హీరోలతో కలిసి రంగ స్థలం పుష్ప సరిలేరు నీ కెవ్వరూ మరి ఇంకెన్నో వివరణ పాత్రలో సినిమాలు నటించడం అదృష్టంగా భావిస్తాను అన్నారు. సామాన్యుడిగా అందరితో కలిసి సరదాగా ఉండటం నాకు ఇష్టమని షూటింగ్ లేని టైంలో స్నేహితులు బంధువులు అందరితో కలిసి కలివిడిగా ఉంటానన్నారు. మా బంధువులు గ్రామానికి వెళ్తూ మార్గమధ్యంలో టీ తాగడానికి షాపు వద్ద ఆగానని చెప్పారు. నా స్నేహితుడు సీనియర్ జర్నలిస్టు ఉప్పుటూరి రాజశేఖర్ కలవడం కోసం వేచి చూస్తున్నానని అన్నారు. అనంతరం గ్రామస్తులతో సరదాగా సినీ కబుర్లతో ప్రయాణాన్ని ముందుకు సాగించి అక్కడి నుండి వెళ్లిపోయారు.

## భక్తిశ్రద్ధలతో వినాయక చవితి పండుగను జరుపుకోవాలి

**- శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే ముత్తుముల**



**గిద్దలూరు, ఆగస్టు 26, ప్రభాతవార్త**
నియోజకవర్గ ప్రజలు వినాయక చవితి పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి కోరారు. గిద్దలూరు నియోజకవర్గ ప్రజలకు ఆయన మంగళవారం ఒక ప్రకటనలో వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయకుడు జ్ఞానం, ఐశ్వర్యం, సుఖశాంతుల ప్రసాదకుడని, ప్రతి ఇంటిలో ఆనందం,ఆరోగ్యం, అభివృద్ధి నిండాలని మనసారా కోరుకుంటున్నాని అన్నారు. గిద్దలూరు నియోజకవర్గ ప్రజల ఆకాంక్షలు సఫలీకృతమవుతూ సమాజంలో సేవాగుణం మరింత పెరగాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు.పండుగను ఆనందంగా జరుపు కోవాలని ప్రతిఒక్కరు వినాయకుని ఆశీస్సులు పొందాలని ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి కోరారు.

### ఎరువుల దుకాణాలు తనిఖీ చేసిన

# ఏఓ బుజ్జిభాయి

**మార్కాపురంరూరల్, ఆగస్టు 26 ప్రభాతవార్త**
మార్కాపురం మండలంలో మండల వనయవసాయ అదికారిణి కె.బుజ్జిభాయి, తహశిల్దార్ చిరంజీవిలు మంగళవారం ఎరువుల షాపులను తనిఖీ చేయడం జరిగింది. ఈ తనిఖీల సందర్భంగా ఎరువుల షాపుల డీలర్లతో మాట్లాడుతూ అన్ని ఫైల్స్ తనిఖీ చేయడం జరుగుతుందని,అందుబాటులో ఉన్న ఎరువులను రైతులకు ఎంఆర్‌పి ధరలకు అమ్మాలని తెలిపారు.అలాగే యూరియాకు కొరత కనిపించి నట్లయితే కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే గాయత్రి ట్రేడర్స్, సాయిభాగ్యలక్ష్మి ట్రేడర్స్ నందు 22,7493 ఓఫామ్ లేకపోవడంతో ఎరువుల అమ్మకం ఆపివేశారు. వీరి వెంట వ్యవసాయశాఖ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# పర్యావరణ పరిరక్షణలో ముందడుగు

**- వార్త దినపత్రిక ఆధ్వర్యంలో ఉచిత మట్టి వినాయక విగ్రహాల పంపిణీ**





**కనిగిరి, ఆగష్టు 26, ప్రభాతవార్త**
పర్యావరణ హిత పండుగలకు ప్రాధాన్యతనిస్తూ, ప్రజల్లో అవగాహన పెంచేందుకు వార్త దినపత్రిక విశేష ముందడుగు వేసింది. వినాయక చవితి సందర్భంగా మట్టి వినాయక విగ్రహాలనే పూజించాలి, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను ఉపయోగించవద్దు అనే నినాదంతో మంగళవారం కనిగిరి పట్టణంలోని బొడ్డుచావడిలో మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి మహిళలు, చిన్నారులు, పెద్దలు అధిక సంఖ్యలో హాజరై విగ్రహాలను స్వీకరించారు. పర్యావరణాన్ని కాపాడడంలో భాగంగా ఇలాంటి గొప్ప కార్యక్రమాన్ని చేపట్టినందుకు ప్రజలు వార్త దినపత్రికకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. వారు మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు నీటిలో కరగక పర్యావరణానికి ముప్పు తెస్తాయి. అలాంటి విగ్రహాలను వదిలి మట్టి విగ్రహాలను పూజించడం వల్ల నదులు,చెరువులు కాలుష్యానికి గురికావు. భవిష్యత్ తరాలకు మంచి వాతావరణం అందుతుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సోదరులు, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ ఐవీ నారాయణ, వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థాన అధ్యక్షులు దేవకి శ్రీనివాసులు, ఓలేటి చిన్న, వెలుగురు చంద్రశేఖర్, రాచపూడి వెంకటేశ్వర్లు,



తడికమల్ల వెంకటేశ్వరరావు, వంశి, సురేష్, గోనుగుంట్ల పవన్ కుమార్, కొలిపాకుల సురేష్ కుమార్, గోనుగుంట్ల రామ్ కుమార్, పేరూరి అనుదీప్, అయితా మహేంద్ర,పైడిమర్రి అంజన్‌కుమార్,పొట్లూరి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొని మట్టివినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ పర్యావరణ హిత వినాయక విగ్రహాలను అందిస్తున్న వార్త దినపత్రిక కార్యక్రమం ఇతర ప్రాంతాలకు కూడా ఆదర్శంగా నిలవాలని అభినందించారు.

# 'ఓట్ల చోరీ'పై ప్రజాభిప్రాయం

## ● ఇసి కీలక నిర్ణయం ● ఐదు ప్రశ్నలను సంధిస్తున్న ఇసి ● గుజరాత్ వ్యక్తులు బీహార్‌లో ఓటర్లుగా మారుతున్నారని విపక్షాల ఆరోపణ




**న్యూఢిల్లీ, ఆగస్టు 26:** కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీఏ సర్కార్ ఎన్నికల సంఘంతో కుమ్మక్కై బీహార్ ప్రజల ఓట్లను దొంగిలించే ప్రయత్నాలు చేస్తోందని ప్రతిపక్షాలు ఆరోపణలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కేంద్ర ఎన్నికల కమిషన్ కీలక నిర్ణయం తీసుకుంది. తాము చేపట్టిన బీహార్ ఓటర్ల జాబితా సవరణకు సంబంధించిన వివిధ అంశాలపై తమ అభిప్రాయం తెలపాలని రాష్ట్ర ప్రజలను కోరేందుకు పోల్‌ప్యానల్ అయిదు ప్రశ్నలను సిద్ధం చేసినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి.

- ఓటర్ల జాబితాలను సవరించి, విస్తృతంగా పరిశీలించాలా?
- చనిపోయిన వారి పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించాలా?
- రెండు ప్రాంతాల్లో నమోదైన ఓటర్ల పేర్లను ఒకదగ్గరి నుంచి తొలగించాలా?
- ఇతర రాష్ట్రాల్లో స్థిరపడిన ఓటర్లను జాబితా నుంచి మినహాయించాలా?
- విదేశీయులు, ఇతర రాష్ట్రాల ప్రజలు ఓటు హక్కును తిరస్కరించాలా?

ఈ ప్రశ్నల ఆధారంగా బీహార్ వ్యాప్తంగా సర్వే చేసి ఓటర్ల జాబితా సవరణపై ప్రజలు ఏమనుకుంటున్నారనే విషయాన్ని స్వయంగా తెలుసుకోవడానికి ఎన్నికలకమిషన్ ఈచర్యలు తీసుకుంటున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. అనంతరం ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలపై తగిన సమాధానం చెప్పేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. బీహార్‌లో ఓటరు జాబితా నుంచి దాదాపు 65 లక్షల మంది ఓటర్లను తొలగించామని పేర్కొంటూ ఇసి ఇటీవల ముసాయిదా విడుదల చేసింది. ఓటర్ల జాబితాలో అక్రమాలు చోటుచేసుకున్నాయంటూ విపక్ష పార్టీలు ఆరోపిస్తున్నాయి.

గుజరాత్ వ్యక్తులు బీహార్‌లో ఓటర్లుగా మారుతున్నారని, ప్రాణాలతో ఉన్న వారిని చనిపోయినట్లుగా పేర్కొంటూ వారిని జాబితా నుంచి తొలగిస్తున్నారని పేర్కొన్నాయి. తొలగించిన ఓటర్ల పేర్లను వెల్లడించాలని డిమాండ్‌చేస్తూ విపక్షాలు సుప్రీంకోర్టులో పిటి షన్లు వేశాయి. వీటిపై విచారణచేపట్టిన న్యాయ స్థానం ఎస్ఐఆర్ కింద తొలగించిన 65 లక్షల మంది పేర్లను వెల్లడించాలని ఇసికి సూచించింది.



# జమ్మూకాశ్మీర్‌లో భారీ వర్షాలు

**శ్రీనగర్, ఆగస్టు 26:** జమ్మూ కాశ్మీర్‌లో కురిసిన అతివృష్టి, వరదలు, కొండచరియల విరిగిపడటం తీవ్ర విషాదానికి దారితీసింది. దోడా జిల్లాలో మేఘవిస్ఫోటం, వరదల కారణంగా కనీసం ఐదుగురు ప్రాణాలుకోల్పోగా, అనేక ఇళ్లు, రహదారులు ధ్వంసమయ్యాయి. అర్ధక్వారిలోని వైష్ణోదేవి ఆలయం మార్గంలో జరిగిన భారీ కొండచరియ ప్రమాదంలో పలువురు భక్తులు గాయపడి, మరికొందరు మృతి చెందినట్టు అధికారులు వెల్లడించారు. దోడా జిల్లాలో ఒక ఇల్లు కూలిపోవడంతో ఇద్దరు వ్యక్తులు ప్రాణాలు కోల్పోగా, మరో ఇద్దరు ఆకస్మిక వరదల్లో కొట్టుకుపోయారు. ప్రధాన నదులు ఉప్పొంగి పోతుండటంతో ప్రజలు నది తీరాలకు దూరంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు. జోజిలా పాస్‌వద్ద కురిసిన భారీ మంచుకారణంగా శ్రీనగర్‌లేహ్ హైవే నిలిచిపోయింది. అలాగే, వందే భారత్ ఎక్స్‌ప్రెస్, శ్రీశక్తి ఎక్స్‌ప్రెస్, హేమకుంట్ ఎక్స్‌ప్రెస్‌తో సహా అనేక రైళ్లు రద్దు చేశారు.

# చైనా విద్యార్థులకు యుఎస్‌లో గేట్లు ఎత్తేస్తాం

## డొనాల్డ్ ట్రంప్ ప్రకటనతో గందరగోళం



**వాషింగ్టన్, ఆగస్టు 26:** చైనా విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ద్వంద్వ వైఖరి ఆశ్చర్యపరుస్తోంది. ఓ వైపు టారిఫ్‌లపై బీజింగ్‌కు వార్నింగ్ ఇస్తూ వాణిజ్య యుద్ధానికి కాలు దువ్వుతూనే.. చైనా విద్యార్థులకు అమెరికా తలుపులు తెరుస్తున్నారు. ఏకంగా ఆరు లక్షల మంది చైనీస్ విద్యార్థులను అగ్రరాజ్యానికి ఆహ్వానిస్తున్నారు. ట్రంప్ తీరు సొంత పార్టీ నేతలను అసహనానికి గురిచేస్తోంది. ట్రంప్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వలసదారులు, విదేశీ విద్యార్థుల విషయంలో కఠిన నిబంధలను అమలుచేస్తోన్న సంగతి తెలిసిందే. ముఖ్యంగా చైనాలో కమ్యూనిస్టు పార్టీకి చెందిన వారు, పరిశోధన రంగంలో ఉన్న వారికి వీసాలు రద్దు చేస్తామని బహిరంగంగానే హెచ్చరికలు చేశారు. భారత్ సహా ఇతర దేశాల విద్యార్థుల వీసాల ప్రక్రియను కూడా కఠినతరం చేశారు. ఈ క్రమంలోనే తాజాగా చైనా విషయంలో ట్రంప్ యూటర్న్ తీసుకోవడం గమనార్హం.

తాజాగా వైట్‌హైస్‌లో విలేకరులతో మాట్లాడిన ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'చైనీస్ విద్యార్థులను అమెరికాలోకి మేం అనుమతించబోమంటూ వచ్చిన వార్తలను విన్నాం. కానీ, మే వారికి మన విశ్వవిద్యాలయాల్లో ప్రవేశాలు కల్పించాలనుకుంటున్నాం. మనకు అది చాలా ముఖ్యం కూడా. 6 లక్షల మంది చైనా విద్యార్థులు అమెరికాకు వచ్చేందుకు అనుమతిస్తాం. ఆ దేశంతో సంబంధాలు మెరుగుపరుచుకోవాలనుకుంటున్నాం'అని ట్రంప్ వెల్లడించారు. ప్రస్తుతం అమెరికా వర్సిటీల్లో దాదాపు 2.70 లక్షల మంది చైనీస్ విద్యార్థులు చదువుకుంటున్నారు. ట్రంప్ తాజా ప్రకటన రాజకీయ వివాదానికి దారితీసింది.

ఆయన నిర్ణయాన్ని సొంత పార్టీ నేతలు, మేక్ అమెరికా గ్రేట్ అగైన్ (మాగా) మద్దతుదారులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. చైనా విద్యార్థులకు అవకాశం కల్పించడం అంటే.. 'అమెరికా ఫస్ట్' అజెండాకు ద్రోహం చేసినట్టేనని మండిపడుతున్నారు. అమెరికా విద్యార్థులకు రావాల్సిన అవకాశాలను చైనీయులకు ఎలా కల్పిస్తారని ప్రశ్నిస్తున్నారు. అయితే, ట్రంప్ నిర్ణయాన్ని అధ్యక్షుడి యంత్రాంగం సమర్థించింది. 'చైనీస్ విద్యార్థులను అనుమతించకపోతే.. అమెరికాలో 15 శాతం యూనివర్సిటీలకు పని లేకుండా పోతుంది. ఆర్థిక విధానాలను పరిగణనలోకి తీసుకునే ట్రంప్ హేతుబద్ధంగా వ్యవహరించారు' అని అమెరికా వాణిజ్య మంత్రి హోవర్డ్ లుట్నిక్ తెలిపారు.

# ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగియలేదు

## పాకిస్థాన్‌కు సిడిఎస్ పరోక్ష హెచ్చరిక



**న్యూఢిల్లీ, ఆగస్టు 26:** ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగియలేదు. అది ఇప్పటికీ కొనసాగుతోంది. త్రివిధ దళాధిపతి జనరల్ అనిల్ చౌహాన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. భారత్ శాంతినే కోరుకుంటుందని, అయితే దానిని బలహీనతగా పొరబడకూడదని ఆయన స్పష్టం చేశారు. మధ్యప్రదేశ్‌లోని మౌలో ఆర్మీవార్ కాలేజీలో ప్రారంభమైన 'రణ్ సంవాద్' సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతిస్పందగా చేపట్టిన ఆపరేషన్ పేరును ప్రస్తావిస్తూ పాకిస్తాన్‌కు పరోక్షంగా గట్టి హెచ్చరికలు పంపారు. ఈ సందర్భంగా జనరల్ చౌహాన్ మాట్లాడుతూ, భారత్ ఎల్లప్పుడూ శాంతివైపే నిలబడుతుంది. మేము శాంతిని ప్రేమించే వాళ్లం. అయితే దానిని ఆసరాగా చేసుకుని మమ్మల్ని దెబ్బకొట్టాలని చూస్తే మాత్రం ఊరుకునే ప్రసక్తి లేదు అని అన్నారు.

గతంలో జరిగిన యుద్ధాలకు, ప్రస్తుతం జరగుతున్న యుద్ధాలకు వ్యత్యాసం ఉందని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులో యుద్ధాల స్వరూపం పూర్తిగా మారిపోతుందని ఆయన విశ్లేషించారు. దీనిని ప్రభావితం చేసే నాలుగు ముఖ్యమైన అంశాలను ఆయన వివరించారు. రాజకీయ లక్ష్యాలను సాధించడానికి చిన్నపాటి యుద్ధాలను ఉపయోగించే ధోరణి దేశాల మధ్య పెరిగింది. యుద్ధం, శాంతి మధ్య తేడా చెరిగిపోతోంది. ఒకప్పుడు యుద్ధాలు భూభాగం కోసం జరిగితే, ఇప్పుడు ప్రజల ప్రాణాలకు ఎక్కువ విలువ ఇస్తున్నారు. గతంలో శత్రువులకు కలిగించిన నష్టం ఆధారంగా విజయాన్ని అంచనావేసేవారు. కానీ ఇప్పుడు ఆపరేషన్ల వేగం, కచ్చితత్వంతో కూడిన దాడులు విజయాన్ని నిర్ధారిస్తున్నాయి అని ఆయన తెలిపారు. వికసిత భారత్ లక్ష్యాన్ని చేరుకోవాలంటే దేశం సశస్త్ర, సురక్షిత్, ఆత్మనిర్భర్‌గా ఉండాల్సిన అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు. కేవలం సాంకేతికతలోనే కాకుండా, ఆలోచనలు, ఆచరణలో కూడా స్వయం సమృద్ధి సాధించాలన్నారు.

మారుతున్న కాలానికి అనుగుణంగా వాయు, జల, భూతల మార్గాల్లో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోవడానికి త్రివిధ దళాల మధ్య మరింత సమన్వయం అవసరమని ఆయన పేర్కొన్న విషయం తెలిసిందే. రెండు రోజుల పాటు జరిగే ఈ రణ్‌సంవాద్ సదస్సు ముగింపు కార్యక్రమంలో రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ప్రసంగించారు.

# గాంధీ కుటుంబమే నా దైవం

## కర్ణాటక డి.సిఎం డికె శివకుమార్

**బెంగళూరు, ఆగస్టు 26:** బిజెపిని విమర్శించేందుకే నేను ఆ పాటపాడాను. కానీ కొందరు దీని ద్వారా రాజకీయ లబ్ధి పొందాలని అనుకుంటున్నాను. ప్రజల్లో గందరగోళం సృష్టించాలని చూస్తున్నారు. నేను ఎవరి మనోభావాలు దెబ్బతీయాలని అనుకోవడం లేదు. ఈ వ్యవహారంతో ఎవరైనా బాధపడిఉంటే అందుకు చింతిస్తున్నాను. నేను క్షమాపణలు చెప్తాను. అయితే అవి రాజకీయ ఒత్తిడివల్ల చెప్పే క్షమాపణలు కాదుఅని డికె వెల్లడించారు. అలాగే గాంధీ కుటుంబం కాంగ్రెస్ పార్టీపై తనకున్న నిబద్ధత తిరుగులేనిదని వ్యాఖ్యానించారు. నేను కాంగ్రెస్ వ్యక్తిగానే జన్మించా. అలాగే మరణిస్తా. గాంధీ కుటుంబం నాకు దైవంతో సమానం. నేను వారి భక్తుడిని అని స్పష్టంచేశారు.



# ప్రధాని మోడీ, పుతిన్‌కు చైనా అధ్యక్షుని ఆహ్వానం

## ఎస్‌సిఒ సమ్మిట్‌కు రావాలని పిలుపు

**బీజింగ్, ఆగస్టు 26:** ఆగస్టు చివరలో తియాంజిన్ వేదికగా జరగనున్న షాంఘై సహకారం సదస్సు(ఎస్‌సిఒ)లో పాల్గొనేందుకు భారత ప్రధాని మోడీ చైనా వెళ్తున్నారు. ఈ సదస్సు సందర్భంగా మోడీతోపాటు రష్యా అధ్యక్షుడు పుతిన్‌ను చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ స్వయంగా ఆహ్వానించనున్నారట. అమెరికా టారిఫ్‌ల వేళ.. గ్లోబల్ సౌత్ దేశాలకు (వర్ధమాన దేశాలు) సంఘీభావంగా శక్తివంతమైన ప్రదర్శనలో భాగంగానే ఈ చర్య ఉండనుందని అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి.

మోడీ, పుతిన్‌తోపాటు మధ్య, పశ్చిమ, దక్షిణ, ఆగ్నేయాసియా దేశాల నేతలకు ఈ ఎస్‌సిఒ సమ్మిట్‌లో పాల్గొనేందుకు ఆహ్వానం అందింది. ఈ నెల 31 నుంచి సెప్టెంబరు ఒకటి మధ్య తియాంజిన్ వేదికగా ఈ సదస్సు జరగనుంది. ప్రధాని మోడీ చైనాలో చివరిసారిగా 2018లో పర్యటించారు. తర్వాత చైనా అధ్యక్షుడు 2019లో భారత్‌లో పర్యటించారు. ఈ తర్వాత 2020లో లద్దాఖ్ సరిహద్దుల్లో భారత్-చైనా సైనికుల మధ్య ఘర్షణతో ఇరుదేశాల మధ్య దౌత్య సంబంధాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. వీటిని పునరుద్ధరించేందుకు సైనిక, దౌత్యాధికారుల మధ్య అనేక దఫాల్లో చర్చలు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే గతేడాది రష్యాలో జరిగిన బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో చైనా అధ్యక్షుడితో ప్రధాని మోడీ భేటీ అయిన సంగతి తెలిసిందే.

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాలతో భారత్‌పై విరుచుకుపడుతోన్న వేళ.. మోడీ చైనా పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ సుంకాలను డ్రాగన్ ఖండించింది. వాణిజ్య, సుంకాల యుద్ధాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తున్నాయని వ్యాఖ్యానించింది. ఈ వ్యవహారంలో భారత్ వెన్నంటి నిలుస్తామని ప్రకటించింది.

మరోపక్క ఢిల్లీలోని రష్యా రాయబారి మాట్లాడుతూ.. భారత్, చైనాతో కలిపి త్వరలో త్రైపాక్షిక చర్చలు జరుగుతాయని భావిస్తున్నట్లు మీడియాతో వెల్లడించారు. ఆ సదస్సు వేళ ఈ ముగ్గురు నేత మధ్య సమావేశం జరగొచ్చని తెలుస్తోంది.

కాగా.. 'చైనా, ఇరాన్,రష్యా.. ఇప్పుడు భారత్‌పై వాషింగ్టన్ తీసుకుంటున్న చర్యలు ఎలాంటి ప్రభావం చూపలేదు. ఈ తరుణంలో అమెరికా ఆధిపత్యానికి ప్రత్యామ్నాయంగా అంతర్జాతీయ క్రమం ఎలా ఉండనుందో తెలియజేసేందుకు జిన్‌పింగ్ ఈ సదస్సును ఉపయోగించుకోవాలని అనుకుంటున్నారు' అని చైనాగ్లోబల్‌సౌత్ ప్రాజెక్టు ఎడిటర్ ఇన్ చీఫ్ ఎరిక్ ఒలాండర్ అభిప్రాయపడ్డారు. ఎస్‌సిఒ చరిత్రలో ఇదే భారీ సమావేశంగా నిలుస్తుందని ఆ దేశ విదేశాంగ శాఖ సహాయమంత్రి ఇప్పటికే వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే.

# సంక్షిప్తంగా..

## శ్రీలంక మాజీ అధ్యక్షుడు విక్రంసింఘేకు బెయిలు

**కొలంబో, ఆగస్టు 26:** శ్రీలంక మాజీ అధ్యక్షుడు రణిల్‌విక్రమ్‌సింఘేకు మంగళవారం కొలంబో ఫోర్ట్ మెజిస్ట్రేట్ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేశారనే ఆరోపణలపై రణిల్‌విక్రమ్‌సింఘేను ఈ నెల 22న అరెస్టు చేసిన విషయం విదితమే. ఓవైపు రణిల్ మద్దతుదారులు కోర్టు ఆవరణలో గుమిగూడిన సందర్భంలో అత్యంత కట్టుదిట్టమైన భద్రత మధ్య మంగళవారం మధ్యాహ్నం కోర్టుకు ఆయనకు అనారోగ్య కారణాలరీత్యాత బెయిల్ మంజూరు చేసింది. ఈ నెల 22న విక్రమ్‌సింఘేను కస్టడీలోకి తీసుకోగానే ఆయనను జైలులోని ఆస్పత్రికి తరలించారు. ఆ తర్వాత కొలంబో నేషనల్ హాస్పిటల్‌లోని ఐసియులో ఉంచి అప్పటి నుంచి చికిత్స అందజేస్తున్నారు. ఈ సందర్భంగా ఆస్పత్రి అధికారులు స్థానిక మీడియాతో మాట్లాడుతూ 76 యేళ్ల వయసున్న రణిల్‌కు హైబిపి, మధుమేహానికి సంబంధించి చికిత్స అందిస్తున్నామన్నారు.

## శ్రీదేవి ఆస్తి కబ్జా అయిందని కోర్టును ఆశ్రయించిన బోనీ కపూర్

**హైదరాబాద్, ఆగస్టు 26, ప్రభాతవార్త:** ఒకప్పటి బాలీవుడ్ అగ్ర హీరోయిన్ దివంగత శ్రీదేవి ఆస్తిని చెన్నై నగరానికి చెందిన ముగ్గురు వ్యక్తులు ఆక్ర మించుకున్నారని ఆరోపిస్తూ ఆమె భర్త బోనీ కపూర్ చెన్నై హైకోర్టును ఆశ్రయించారు. 1988 ఏప్రిల్‌లో శ్రీదేవి మద్రాసులో సంబంద మొదలియార్ అనే వ్యక్తి దగ్గర ఒక స్తిరాస్తిని కొన్నారు. మొదలియార్‌కు ముగ్గురు కుమారులు, ఇద్దరు కూతుళ్లు వున్నారు. అందరి సంతకాలు చేసిన తరువాత తన భార్య శ్రీదేవి ఈ ఆస్తిని కొన్నదని ఆయన హైకోర్టుకు తెలిపారు. అయితే ఈ ఆస్తిలో తమకూ వాటా వుందని చెబుతూ మొదలియార్ రెండవ భార్య కుమారులు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అప్పీల్ చేసి చట్టవిరుద్ధంగా హక్కులు పొందారని బోనీ కపూర్ తెలిపారు. చట్ట విరుద్దంగా తన భా ర్య ఆస్తిని మరొకరికి రావడంలో అధికారుల పాత్ర వుందని బోనీ కపూర్ ఆవేదన చెందారు. దీనిపై విచారించిన న్యాయమూర్తి ఆనంద్ ఈ కేసును నాలుగు వారాల్లో తేల్చాలని తాంబరం తహసీల్దార్‌ను ఆదేశించారు.

## పాక్ గూఢచారి మోతీరాంకు భారీ నెట్‌వర్క్

**హైదరాబాద్, ఆగస్టు 26, ప్రభాతవార్త:** సిఆర్‌పిఎఫ్‌లో ఎఎస్‌ఐగా పనిచేస్తూ పాక్ గూఢ చార సంస్థ ఐఎస్‌ఐతో జతకట్టి అరెస్టయిన మోతీరాంకు అ టు పాక్ ఇటు భారత్‌లో భారీ నెట్‌వర్క్ వున్నట్లు జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఎ) గుర్తించింది. మోతీరాం జాట్ భారత సైన్యంతో పాటు పారా మిలటరీ బలగం, ప్రభుత్వ విభాగాల్లో కీలక హోదాలో వున్న పలువురు టచ్‌లో వున్నట్లు ఎన్‌ఐఎ గుర్తించింది. వీరిలో నలుగురు మిలటరీ అధికారులు, మరో ఇద్దరు పారా మిలటరీ అధికారులు మిగతా వారు ప్రభుత్వ విభాగాలకు చెందిన వారుగా ఎన్‌ఐఎ గుర్తించింది. మోతీరాం జాట్‌ను గత మే నెల 27వ తేదీన ఎన్‌ఐఎ అరెస్టు చేయడం తెలిసిందే. జాట్‌ను అరెస్టు చేసిన తరువాత ఈ కేసు విచారణను ఎన్‌ఐఎ చేబట్టడం విదితమే. దీని తరువాత అతని ఫోన్‌ను స్వాధీనం చేసుకున్న ఎన్‌ఐఎ అందులోని నంబర్లను విశ్లేషించగా 15 మందితో అతను తరచూ మాట్లాడుతున్నట్లు తేలింది. ఇందులో అనేక కాల్స్ ఇంటర్నెట్‌విగా వున్నాయి. జాట్ పాకిస్తాన్‌లోని లాహోర్‌కు చెందిన సలీం అనే ఆపరేటర్‌తో తరచూ సంభాషించేవాడని ఎన్‌ఐఎ తేల్చింది.

## భారీ వరదలతో మనాలిలో కొట్టుకుపోయిన రోడ్లు, హోటళ్లు



**మనాలీ, ఆగస్టు 26:** హిమాచల్ ప్రదేశ్‌పై మళ్లీ ప్రకృతి తన ప్రకోపాన్ని చూపించింది. తీవ్ర స్థాయి వర్షాల వల్ల కొండచరియలు విరిగిపడ్డాయి. భారీ వరదలు వల్ల కిరాట్పూర్, మనాలీ జాతీయ రహదారిపై నష్టం జరిగింది. దీంతో మండీ, మనాలీలో ట్రాఫిక్ పూర్తిగా స్తంభించిపోయింది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల బియాస్ నది ఉప్పొంగుతున్నది. దాని ఉప నదులు కూడా ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. అనేక ప్రాంతాల్లో ఎమర్జెన్సీ చర్యలు చేపడుతున్నారు. జాతీయ రహదారి పలు ప్రదేశాల్లో బ్లాక్ అయింది. మనాలీ సమీపంలో ఉన్న బిందు ధంక్ వద్ద బియాస్ నది వరద నీటికి జాతీయ హైవే కొట్టుకుపోయింది. దీంతో పాపులర్ టూరిస్టు కేంద్రానికి రాకపోకలు తెగిపోయాయి. మనాలీలో నది సమీపంలో ఉన్న ఓ హోటల్ ఆ వరదలో కొట్టుకు పోయింది. మండి, కులు ప్రాంతాల్లో డేంజర్ మార్క్ దాటి నది ప్రవహిస్తున్నది. లోతట్టు ప్రాంతాల్లో జీవిస్తున్న వారి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. బహంగ్, అలూ గ్రౌండ్ ప్రాంతాల నుంచి జనాలను తరలిస్తున్నారు. మరో 24 గంటలపాటు నది సమీపానికి వెళ్లవద్దు అని టూరి స్టులకు అధికారులు వార్నింగ్ ఇచ్చారు.

# అమెరికా టారిఫ్‌ల ప్రభావం తగ్గొచ్చు

## భారత్, యుఎస్ వాణిజ్య చర్చలు సఫలం అయ్యే అవకాశం

## ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా ఆశాభావం



**ముంబై, ఆగస్టు 26:** భారత్‌అమెరికా మధ్య వాణిజ్య ప్రతినిధుల చర్చలు సఫలం కాగలవన్న ఆశాభావాన్ని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) గవర్నర్ సంజయ్ మల్హోత్రా వ్యక్తం చేశారు. రష్యా నుంచి పెద్ద ఎత్తున ముడి చమురు కొనుగోళ్లకుగాను దేశీయ ఎగుమతులపై 25 శాతం జరిమానాలను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన విషయం తెలిసిందే. బుధవారం నుంచే ఇవి అమల్లోకి రానున్నాయి. దీంతో అగ్రరాజ్యంలోకి దిగుమతయ్యే భారతీయ వస్తూత్పత్తులపై సుంకాల భారం 50 శాతానికి చేరబోతున్నది. ఇప్పటికే ఆ దేశంతో వాణిజ్య ఒప్పందం ఆలస్యానికిగాను వేసిన 25 శాతం టారిఫ్‌లు అమల్లో ఉన్నాయి మరి. ఈ క్రమంలోనే ఇరు దేశాల నడుమ వాణిజ్య ఒప్పందం కుదురుతుందన్న ఆకాంక్షను సోమవారం ఇక్కడ ఫిక్కి, ఐబీఏ (ఫిబక్) నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ కనబర్చారు. వాణిజ్య చర్చలు సఫలమైతే భారత ఆర్థిక వ్యవస్థపై టారిఫ్‌ల ప్రభావం తగ్గొచ్చన్న విశ్వాసాన్ని వెలిబుచ్చారు. అమెరికా టారిఫ్‌లు భారత్‌పై 50 శాతానికి పెరిగితే వస్త్ర, రొయ్యల ఎగుమతులు ఖరీదెక్కనున్నాయి. ఇదే జరిగితే దేశంలో ఆయా రంగాలపై ఆధారపడ్డ వ్యాపారాలు, పరిశ్రమలు, ఉద్యోగులు, రైతులు ఇబ్బందుల్లో పడ్డట్టేనన్న ఆందోళనలు కనిపిస్తున్నాయి.

**ద్రవ్య విధానంపై..**

దేశంలో ద్రవ్యోల్బణం, జిడిపి వృద్ధిరేటు రెండింటిపైనా ఆర్బీఐ దృష్టి పెడుతుందని, వాటికి అనుగుణంగానే తమ ద్రవ్య విధానం కొనసాగుతుందని ఈ సందర్భంగా మల్హోత్రా స్పష్టం చేశారు. ఈ ఏడాది మొదలు ద్రవ్య సమీక్షల్లో కీలక వడ్డీరేటైన రెపో రేటును ఆర్బీఐ క్రమేణా తగ్గిస్తూ వస్తున్న సంగతి విదితమే. ఇప్పటిదాకా 4 ద్రవ్య సమీక్షలు జరుగగా.. మూడింటిలో 1 శాతం రెపో రేటు దిగింది. ఈ నెల సమీక్షలో మాత్రం యథాతథంగానే ఉంచింది. ఈ నేపథ్యంలో ఇక రాబోయే ద్రవ్య సమీక్షల్లో కేవలం జిడిపి బలోపేతంపైనేగాక, ధరల అదుపు కోణంలోనూ ఆలోచించి నిర్ణయాలుంటాయని ఆర్బీఐ గవర్నర్ స్పష్టం చేశారు. అమెరికా టారిఫ్‌లు, అంతర్జాతీయ అనిశ్చిత పరిస్థితులకుతోడు ద్రవ్యోల్బణం అంశాలూ ఆర్బీఐ ముందు కీలకంగా ఉన్నాయంటున్నారు.

**పెట్టుబడులకు కలిసి..**

వృద్ధి లక్ష్యాలను ఆర్బీఐ విస్మరించట్లేదన్న మల్హోత్రా.. టారిఫ్‌లు, భౌగోళికరాజకీయ ఆందోళనల నుంచి సవాళ్లు ఎదురవుతున్న దృష్ట్యా కార్పొరేట్లు, బ్యాంకులు కలిసి పెట్టుబడులకు ఊతమివ్వాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో దేశ ఆర్థికాభివృద్ధికున్న అవకాశాలను వదులుకోలేమని, ఆర్థిక విస్తరణకున్న అన్ని మార్గాలనూ మరింత పెంచుకోవాలని సూచించారు. అందుకే బ్యాంకుల బ్యాలెన్స్ షీట్లు, కార్పొరేట్ల పనితీరు అత్యుత్తమంగా కనిపిస్తున్న ప్రస్తుత తరుణంలో ఆయా రంగాల్లో పెట్టుబడులకు దన్నుగా నిలవాలని చెప్పారు.

**క్రెడిట్ డిమాండ్ తగ్గింది: శెట్టి**

కార్పొరేట్ల నుంచి రుణాల డిమాండ్ తగ్గిందని ప్రభుత్వ రంగ ఎస్బీఐ చైర్మన్ సీఎస్ శెట్టి అన్నారు. నేడు మెజారిటీ కార్పొరేట్ సంస్థలు ప్రైవేట్ క్రెడిట్ పట్ల ఆసక్తి చూపిస్తున్నాయని, నిధుల సమీకరణ కోసం క్యాపిటల్ మార్కెట్లలోకి ప్రవేశిస్తున్నాయని చెప్పారు. దీంతో దేశ వృద్ధి లక్ష్యాల సాధన కోసం పెద్ద ఎత్తున వచ్చే పెట్టుబడులకు దన్నుగా నిలవడానికి బ్యాంకులు చూస్తున్నాయని తెలిపారు. ఈ క్రమంలోనే బ్యాంకులపైనున్న కొన్ని రకాల ఆంక్షలు తొలగిపోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. అయితే ఇందుకు ఆర్బీఐ గవర్నర్ మల్హోత్రా సానుకూలంగా స్పందించారు.

**ఎఐతో బ్యాంకింగ్‌కు కొత్త రూపు**

భారతీయ బ్యాంకింగ్ రంగం కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ లేదా ఎఐ)తో కొత్తరూపును సంతరించుకోగలదని ఓ నివేదిక అభిప్రాయపడింది. ఉద్యోగాలపై ఏఐ ప్రభావంపట్ల ఆందోళనలు కనిపిస్తున్న వేళ ఇదిప్పుడు మిక్కిలి ప్రాధాన్యాన్ని దక్కించుకుంటున్నది. కాగా, బ్యాంకులు ఏఐని అందిపుచ్చుకుంటే ఎన్నో లాభాలను పొందగలవని బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్ (బిసిజి) ఈ రిపోర్టులో పేర్కొన్నది. గడిచిన దశాబ్ద కాలంలో బ్యాంకులు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీపై చేసే ఖర్చులు ఐదింతలు పెరిగాయని, ఉత్పత్తిలో అందుకు ఒనగూరిన లాభం మాత్రం 1 శాతమేనని గుర్తుచేసింది. అయితే ఎఐతో ఈ తరహా నష్టాలను అధిగమించవచ్చని చెప్పింది. నిజానికి ఇప్పటికే అనేక బ్యాంకులు ఏఐ సాధనాలు వినియోగిస్తున్నాయని తెలిపింది.

# రాష్ట్రం అంతటా వినాయకచవితి ఉత్సవాల సందడి

**విజయవాడ,ఆగస్టు26,ప్రభాతవార్తప్రతినిధి:** వినాయక చవితి బుధవారం జరుగుతుండటంతో పల్లె నుంచి నగరాల వరకు ఉత్సవ సందడి నెలకొంది. పాలవెల్లి, పత్రి కోసం భక్తులు అప్పుడే మార్కెట్లల్లో హడావిడి చేస్తున్నారు. భాద్రపద మాసం వచ్చిందంటే చాలు. వినాయక చవితి పండగ సందడి మొదలవుతుంది. పిల్లలు, పెద్దలు కలిసి నవరాత్రి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. కొన్ని చోట్ల 11,21 రోజుల వరకు ఉత్సవ పందిళ్లలో స్వామిని వెంచేయింపచేస్తారు. నిజానికి భారతీ సంస్కృతిలో ఈ వర్షరుతువు ఒక మధువుతునక, ప్రకృతి పండే ఎన్నో సదుపాయాలను స్వామి పేరిట భక్తులు అన్వేషించి భద్రపర్చుకుంటారు. వినాయకుని పండుగను ఊరువాడ అంతా ఎంతో ఉత్సాహంగా విగ్రహాలను ప్రతిష్టించి పూజలు చేస్తారు. చాలామంది తమ ఇళ్లల్లో, అపార్ట్ మెంట్ ప్రాంగణాల్లో వినాయకుడి విగ్రహాలను పెట్టి పూజలు చేస్తుంటారు. ఇవి మతాలకతీతంగా జరుగడం ఒ విశేషం. ఈ క్రమంలో రాష్ట్రవ్యాప్తంగా పండగ శోభ సంతరించుకుంది. స్వీట్ షాపులు, మార్కెట్ ప్రాంతాలు కొనుగోళ్లతో కళకళలాడుతున్నాయి. మట్టి వినాయకుని పూజించాలనే భావన ప్రజల్లో ప్రతి ఏటా పెరుగుతోంది. పర్యావరణ హితమైన గణనాథుల వైపు జనం మొగ్గు చూపుతున్నారు. నీటి కాలుష్యం గాలి కాలుష్యం తగ్గించాలని ఎకో ఫ్రెండ్లీ వినాయకులను ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులతో ప్రత్యేకంగా మట్టి గణనాథులను తయారు చేసి వీటిని విరివిగా పంపిణీ చేస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లో వినాయక చవితికి మంచి క్రేజ్ ఉంది. పిల్లలు, పెద్దలు కలిసి ఈ పండుగ జరుపుకుంటారు. ఆంధ్రప్రదేశ్ లో విజయవాడలో అద్భుతంగా ఈ గణనాథుని ఉత్సవాలు జరుగుతుంటాయి. గత శతాబ్దపు తొలినాళ్ళ ఇక్కడ ఆరంభమైన వినాయక చవితి ఉత్సవాలు తెలంగాణాకు విస్తరించాయి. గణేశుడికి ఇష్టమైన స్వీట్స్, వంటలు చేసి నైవేద్యంగా పెడతారు. ఇందుకు అవసరమైన వస్తువులు కొనుగోలు చేసేందుకు ప్రజానీకం మార్కెట్లకు నగరాలను క్యూ కట్టారు. విజయవాడలోని ప్రధాన మార్కెట్లు, ముఖ్యమైన రహదారుల కూడళ్లలో గరిక, వెలక్కాయలు, సీతాఫలాలు, అరటి పిలకలు సహా పూలకు అవసరమైన వస్తువులన్నీ విక్రయిస్తున్నారు. ఎక్కువగా గ్రామీణ ప్రాంతాల నుంచి వీటిని ఆటోలు, ద్విచక్రవాహనాల్లో తెచ్చి అమ్ముతున్నారు. పండుగల్లో ఇది మొదటిది కాబట్టి ఘనంగా చేసుకుంటామని ప్రజలు చెబుతున్నారు. మండపాల్లోని ఇప్పటికే ఆకర్షణీయమైన వినాయకులు కొలువుదీరారని, స్నేహితులు కుటుంబ సభ్యులతో కలిసి దర్శనం చేసుకుంటామని అంటున్నారు. ఈ పండగ వేళ ధరలు మండుతున్నాయని పలువురు అంటున్నారు. మల్లెపూలు మూర 60 రూపాయలు చెబుతున్నారని, ఒక్కో కొబ్బరి కాయ రూ.50 అని తెలిపారు. ఎటులూ 10 రకాలు వస్తువులు: పండుగలు వస్తే ధరలు పెంచేస్తారని అన్నారు. సామాన్యులకు ధరలు అందుబాటులో లేవని, ఇలా అయితే పండుగ ఎలా చేసుకోవాలని నగర వాసులు అడుగుతున్నారు. వినాయక చవితికి బాగా వ్యాపారాలు ఉన్నాయని విక్రయదారులు చెబుతున్నారు. మంగళవారం మధ్యాహ్నం నుంచే స్వీట్లు, పూజ సామాగ్రి కొనుగోలుకు జనం వస్తున్నారని తెలిపారు. 10 రకాలు పూజా వస్తువులు సెట్ లుగా విభజించి ఒక్కొక్కటి రూ.100కి విక్రయిస్తున్నట్లు వెల్లడించారు.



వైద్యాధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

# వైద్యాధికారులు దృక్పధాన్ని మార్చుకోవాలి

## సృజనాత్మకతతో పనిచేయాలి - ఉన్నతాధికారులకు మంత్రి సత్యకుమార్ హితవు

**విజయవాడ,ఆగస్టు 26,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ఆరోగ్య రంగంలో నూతన శకాన్ని ఆవిష్కరించడానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిరంతరం తపిస్తున్నారని, వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ వ్యాఖ్యానించారు. వైద్య శాఖ ఉద్యోగులు వైఖరిని మార్చుకుని ముఖ్యమంత్రి ఆలోచనలు, ఆధునికత, వేగానికనుగుణంగా పనిచేయాలని హితవు పలికారు. మంగళవారంనాడు వెలగపూడిలోని ఏపీ సచివాలయంలో ఉన్నతాధికారులతో మంత్రి పలు విషయాలపై సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సృజనాత్మకత, ఆధునిక సాంకేతిక విజ్ఞాన అవలంబన, ఆవిష్కరణల ఆధారంగా ప్రజారోగ్యాన్ని కొత్తపుంతలు తొక్కించడానికి అహర్నిశలూ కృషి చేస్తున్నారని మంత్రి అన్నారు. ఆయన బాటలో నడవడానికి ప్రభుత్వ వైద్యులు, ఇతర సహాయక సిబ్బంది కంకణబద్ధులు కావాలని మంత్రి పిలుపునిచ్చారు. వైద్య సిబ్బంది ఆత్మవిమర్శ చేసుకోవాలి.. తాము విధులు నిర్వహిస్తున్న తీరు ముఖ్యమంత్రి ఆశయాల సాధనకు తోడ్పడుతుందా లేదా అనే వైద్యులు, ఇతర సిబ్బంది ఆత్మవిమర్శ చేసుకుంటూ ముందుకుసాగాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ ఉన్నతాధికారులతో అన్నారు. బండి నడుస్తోందిలే అన్న రీతిలో కాకుండా యావత్తు సిబ్బంది వినూత్నంగా ఆలోచించి ఆరోగ్యాంధ్రప్రదేశ్ సాధనకు కృషి చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. ప్రజాప్రతినిధులు, సామాన్యులు పలు ప్రజాసమస్యల్ని తన దృష్టికి తెచ్చినప్పుడు వాటిని సంబంధిత అధికారులు శీఘ్రమే పరిశీలించి తగు సమాచారాన్ని అందజేయాలని, ఈ విషయంలో ఆలస్యం జరగడంపై మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాసమస్యల్ని పట్టించుకోకపోతే అది ప్రజాస్వామ్య ఉల్లంఘనకిందకు వస్తుందని, ఈ విషయంపై వైద్యులు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు. సమావేశంలో ఈ ఏడాది జూన్‌లో వైద్యారోగ్య శాఖ చేపట్టిన సాధారణ బదిలీల తీరు, ఫలితాలపై మంత్రి విభాగాధిపతులతో చర్చించారు. 7,200కు పైగా వైద్యులు, పాలనా సిబ్బందిని బదిలీ చేయగా వారిలో నిర్ణీత గడువులో 99 శాతం మంది కొత్త పోస్టింగ్ ల్లో చేరినట్లు ఉన్నతాధికారులు వివరించారు. నియమాల మేరకు వివాద రహితంగా భారీ స్థాయిలో సాధారణ బదిలీల ప్రక్రియను విజయవంతంగా ముగించినందుకు విభాగాధిపతులను, అధికారులను మంత్రి సత్యకుమార్ యాదవ్ అభినందించారు. గతానికి భిన్నంగా వివాద రహితంగా బదిలీలు జరిగాయనడానికి 99 శాతం మంది ఉద్యోగులు బదిలీ ఆదేశాలను ఆమోదించడం నిదర్శనమని మంత్రి అన్నారు. విభాగాల వారీగా వివిధ స్థాయిల్లో మంజూరైన పోస్టులు, ఖాళీలను మంత్రి సమీక్షించారు. గతేడాది జూన్ నుండి వివిధ విభాగాలు చేపట్టిన నియామకాల వివరాలను మంత్రి తెలుసుకున్నారు. ప్రజారోగ్య పరిరక్షణకు అవసరమైన ఖాళీలను ప్రణాళికాబద్ధంగా భర్తీ చేయాలని మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ ఆదేశించారు. ఆయుష్, మందుల నియంత్రణ విభాగం,

ఆహార పదార్థాల కల్తీ నిరోధక విభాగాల్లో భారీగా ఉన్న ఖాళీలను భర్తీ చేసి ఈ విభాగాలు సమర్ధవంతంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు.

# కొలిక్కిరాని తిరుపతి పార్లమెంట్ టిడిపి అధ్యక్ష ఎన్నిక




**తిరుపతి,ఆగస్టు 26ప్రభాతవార్తప్రతినిధి:** తెలుగుదేశంపార్టీ సంస్థాగత ఎన్నికల్లో భాగంగా మంగళవారం తిరుపతి పార్లమెంట్ కమిటీ అధ్యక్ష అనుబంధ కమిటీల ఎన్నికలకు సంబంధించి మంత్రి సమక్షంలో పార్టీ నాయకులు ఒక అవగాహనకు రాలేకపోయారు. ఈ కమిటీ సమావేశం ఆద్యంతం ప్రశాంతంగా ముగిసినా అధ్యక్ష పదవికి పలువరు సీనియర్ నేతలు పోటీపడటంతో ఎవరినీ నియమించాలనే అంశాన్ని అధిష్టానానికి అప్పగించారు. మంగళవారం రేణిగుంటలోని వై కన్వెక్షన్‌లో తిరుపతి పార్లమెంటరీ సమావేశం జరిగింది. రాష్ట్రమంత్రి సవిత అధ్యక్షత జరిగిన ఈ సమావేశంలో తిరుపతి పార్లమెంట్ అధ్యక్షుడు నరసింహయాదవ్, పచ్చదనం, సుందరీకరణ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ సుగుణమ్మ, ఎమ్మెల్యేలు పాశంసునీల్‌కుమార్, నెలవల విజయశ్రీ, బోర్డు సభ్యురాలు పనబాకలక్ష్మి, పార్టీరాష్ట్రకమిటీ ప్రతినిధి మల్యాద్రి, రాష్ట్రపార్టీ కార్యదర్శులు వి.పుష్పావతియాదవ్, దంపూరి భాస్కర్, తుడ ఛైర్మన్ దివాకర్‌రెడ్డి, పార్టీ నాయకులు హేమలత, పరసారత్నం, నెలవలసుబ్రమణ్యం, శ్రీదర్‌వర్మ తదితరులు పాల్గొన్నారు. పార్టీలో క్రమశిక్షణ ముఖ్యమని, పార్టీకోసం కష్టపడిపనిచేసేవారికి పదవులు వస్తాయని మంత్రి సవిత తెలిపారు. రానున్న కాలంలో తెలుగుదేశం పార్టీ ప్రజల్లో మరింత విస్తృతంగా ఓటుబ్యాంకు సంపాదించుకుంటుందన్నారు. పార్టీలో యువతకు అధిక ప్రాధాన్యతనిచ్చేందుకు సిఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ ఆలోచనతో ఉన్నారన్నారు. అందరినీ కలుపుకుని వెళ్ళే నాయకులకు పదవులు తప్పవన్నారు.

# మట్టి వినాయకుల విగ్రహాలు దేదీప్యమానంగా అలంకారాలు

**శ్రీకాళహస్తి,ఆగస్టు 26 ప్రభాతవార్త** శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో పండగలంటే యువకుల్లో కొత్త జోష్. ఇక్కడ నిర్వహించే ప్రతి పండగకు శ్రీకాళహస్తీశ్వరాయంతో సంబంధాలు ముడిబడి ఉంటాయి. ఈ నేపథ్యంలో వినాయక చవితి అంటే నవసంధి వినాయకులు గుర్తుకు వస్తారు. ఈ ఆలయాలకు దేవస్థానం సారె అందించే సంప్రదాయం ఉంది. ఈ సారె అందించే కార్యక్రమాలను ఓ పండగలా నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది బుధవారం సారెను శ్రీకాళహస్తి శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి మాతృమూర్తి బొజ్జల బృందమ్మ తెలుగుదేశం నాయకులుఅ ందిస్తారని ప్రకటించారు. శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో 400 చోట్ల వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసారు. పది రోజుల నుంచి ఆర్‌డిఓ భాను ప్రకాష్‌రెడ్డి, డివైయస్‌పి నరసింహామూర్తి, సిఐలు డి.గోపి, నాగార్జున్‌రెడ్డి, తిమ్మయ్యలు పీస్ కమిటి సమావేశాలు నిర్వహించి ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచనలు చేసారు. మంగళవారం ఉదయం నుంచి విక్రయ కేంద్రాల నుంచి వినాయక విగ్రహాలు తరలి పోతున్నాయి. యువకులు జైబోలో వినాయక మహారాజ్ అ ంటూ నినాదాలుచేస్తూ ట్రాక్టర్లలో తమ స్థావరాలకు విగ్రహాలను తరలిస్తున్నారు. ఇక శ్రీకాళహస్తిలోని బేరివారి మండపం వద్ద 9 రోజుల పాటు నిర్వహించే కార్యక్రమాలను బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్ సారథ్యంలో నిర్వహిస్తున్నారు. బెంగుళూరు నుంచి రూ.75వేల విలువ చేసే విగ్రహాన్ని తరలించుటకు రూ.20వేలు వెచ్చించి రప్పించారు. హంసవాహనంపై వినాయకుని కన్నుల పండువగా తీర్చి దిద్దారు. ఇక ఎపెండ్లి మండపం వద్ద వినాయకుని పంచముఖ వినాయకుని తీర్చి దిద్దారు. ఈ ఏడాది వినాయక చవితి నిర్వాహకులకు సామాజిక బాధ్యతగా ప్రభుత్వం ఉచిత విద్యుత్ సదుపాయం కల్పించారు. దాంతో నిర్వాహకులైన యువకుల్లో ఇంకా జోష్ చోటు చేసుకుంది. శ్రీకాళహస్తి పట్టణంలో సుమారు 200 మండపాల వద్ద కిలోమీటర్ల దూరంలో విద్యుత్ తోరణాలతో ముస్తాబు చేసారు. వివిధ రకాల విద్యుత్ దేవుళ్లను ఏర్పాటు చేసారు. ఎటు చూసినా విద్యుత్ దీపాల వెలుగులతో శ్రీకాళహస్తి



అమ్మకానికి సిద్ధంగా ఉన్న వినాయక విగ్రహాలు

కాంతులీనుతుంది. విఘ్నాలకు అధిపతి వినాయకునికి పూజాది కార్యక్రమాలు నిర్వహించిన తర్వాతే ఏకార్యక్రమమైన ప్రారంభించడం మన సాంప్రదాయం. అందుకే ప్రతి ఒక్కరు చేపట్టే శుభకార్యాలు శుభప్రదంగా జరగాలని మొదటి పండుగ వినాయకుని చవితి ఉత్సవాన్ని దేశావ్యాప్తంగా కాకుండా ప్రపంచ వ్యాప్తంగా వైభవంగా జరుపుకుంటున్నారు. అయితే రూపాన్ని వివిధ ఆకృతుల్లో వైవిద్యంగా తయారుచేసి అనేక చోట్ల యువకులు చలువ పందిళ్లు వేసి ప్రతిష్టించి పూజలు జరుపుతున్నారు. శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో కూడా యువకులు పోటీలు పడి వినాయచవితి ఉత్సవాలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈఏడాది శ్రీకాళహస్తి పట్టణంలో వివిధ రూపాల్లో గణపతి కొలువుదీరనున్నాడు. పర్యావరణానికి ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారైన బొమ్మలు వద్దు 'మట్టివినాయకులే ముద్దు' అని కొన్ని సంస్థలు ర్యాలీలు కూడా నిర్వహించారు.

శ్రీకాళహస్తి పట్టణంలోని బాబుఅగ్రహారం పురపాలక సంఘం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహించిన పోలస్వామి.స్వర్ణమూర్తి రిటైర్డ్ అయిన తరువాత కూడా ధార్మిక కార్యక్రమాల్లో తమ భాగస్వామ్యం నిర్వహిస్తున్నారు. మిధున రాశి గణపతిగా రూపొందించారు. దీన్ని ముత్యాలమ్మ గుడివీధిలోని చక్రేశ్వరస్వామి దేవాలయం ఎదురుగా వున్న పోలస్వామి లేన్‌లో ప్రతిష్టించి మూడు రోజుల పాటు ఉంచి నిమజ్జనం చేయనున్నట్లు తెలిపారు.

## సీమలో విద్యుత్ రైలు మార్గాలను తనిఖీ చేసిన ఇఐజి

**గుంతకల్లు రైల్వే, ఆగస్టు 26,ప్రభాతవార్త** రాయలసీమలోని దక్షిణ మధ్య రైల్వే గుంటూరు-గుంతకల్లు ప్రధాన రైలు మార్గంలో పూర్తయిన రైల్వే విద్యుదీకరణ మార్గాలను విద్యుత్ తనిఖీల(ఇఐజి) అధికార బృందం విస్తృత తనిఖీలు నిర్వహించింది. నిర్ణీత కార్యక్రమం మేరకు ప్రత్యేక ఇఐజి, స్పిక్, టవర్ కార్‌లలో పాణ్యం-నంద్యాల, ఎర్రగుంట్ల-నంద్యాల మధ్య తాజాగా పూర్తయిన రెండో రైలు మార్గం విద్యుదీకరణ ప్రాజెక్టులను అందుబాటులోకి తెచ్చే క్రమంలో రైల్వే విద్యుత్, ఇంజనీరింగ్, సిగ్నల్, టెలికాం విభాగాలకు చెందిన సంబంధిత ఉన్నతాధికారులు మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా నెంబర్ 181లెవెల్ క్రాసింగ్ గేట్‌ను, పాణ్యం-నంద్యాల మధ్య 14.53కి.మీల డబ్లింగ్ విద్యుత్ రైలు మార్గానికి, నంద్యాల-ఎర్రగుంట్ల మధ్యన పూర్తైన విద్యుత్ రైలు మార్గాలను, నంద్యాల యార్డును, విస్తృత తనిఖీలు నిర్వహించారు. ట్రైల్ రన్, వేగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. కె.దౌర్యా, సిహెచ్‌ఎస్ రెడ్డి, సుధాకర్, సుదర్శన్ రెడ్డి, అనిల్ కుమార్, శ్రావణ్ కుమార్, చంద్రశేఖర్‌తో పాటు విద్యుత్, ఇంజనీరింగ్, సిగ్నల్ విభాగాలకు చెందిన సంబంధిత ఉన్నతాధికారులు, విజయవాడ, గుంటూరు, గుంతకల్లు డివిజనల్ అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ అనుమతులతోనే క్వారీ నడుపుతున్నా

- మనీ స్కామ్ కేసులో దోషిని పట్టుకున్న ఘనత మాది - పది సంవత్సరాలు ఎమ్మెల్యేగా ఉన్న రామిరెడ్డి పలు అక్రమాలకు పాల్పడ్డాడు - ప్రశాంత కావలిలో చిచ్చు పెడితే సహించేది లేదని కాకాణికి హెచ్చరించిన కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి

**నెల్లూరు, ఆగస్టు 26, ప్రభాతవార్త-వైద్యం :** ప్రభుత్వం నుండి అన్ని అనుమతులు తీసుకొని బ్లూ మెటల్ క్వారీని నడుపుతున్నట్లు కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం నెల్లూరులోని ఆయన నివాసంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 2007లోనే ప్రభుత్వ అనుమతులతోనే నేను క్వారీ ఏర్పాటు చేశాను, ఎన్నో ప్రభుత్వాలు మారినా ఎవరు అభ్యంతరం చెప్పలేదు. కానీ 2023లో నేను టీడీపీ అభ్యర్థిని అవుతానని తెలిసిన రోజునే, ప్రతాప్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో క్వారీపై దాడులు జరిగాయి. చట్టవిరుద్ధంగా 143 కోట్లు పెనాల్టీ విధించారు. నేను హైకోర్టు తలుపులు తట్టగానే ప్రభుత్వం తలదించుకుందని, క్లీన్ చిట్ ఇచ్చింది కూడా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే అని ఎమ్మెల్యే గుర్తు చేశారు. ప్రతిపక్షం నిర్మాణాత్మకంగా విమర్శలు చేయకుండా వ్యక్తిగత స్థాయికి దిగజారిందని మండిపడ్డారు. మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి గత కొన్ని రోజులుగా కావలిలో అవాస్తవ ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతాప్ కుమార్‌రెడ్డి ప్రజాసేవకంటే వ్యాపారాలకు, వ్యక్తిగత లాభాలకు ప్రాధాన్యం ఇచ్చారన్నారు. ఆయన కళ్యాణ మండపం, ఇల్లు, ఇంజనీరింగ్ కాలేజీ, స్కూల్, అన్ని ఆక్రమణలతో నడుస్తున్నాయన్నారు. ప్రభుత్వ భూములను సొంతం చేసుకున్నారన్నారు. డ్రోన్‌ల సహాయంతో క్వారీలో నా ఆచూకీ కనిపెట్టాలని చూశారని, రౌడీ షీటర్లతో నిరంతరం బెంగుళూరు నుండి మాజీ ఎమ్మెల్యే పర్యవేక్షిస్తూ ఉన్నాడని తెలిపారు. గత 10 సంవత్సరాలుగా ఎమ్మెల్యేగా ఉన్న ప్రతాప్ రెడ్డి కావలిని గంజాయికి కేంద్రంగా మార్చారని తన అనుచరులు చందు, చైతన్య, ప్రసన్నల ద్వారా గంజాయిని అమ్మించారని తెలిపారు. 83 రోజులు జైల్లో ఉన్న కాకాని కావలికి వచ్చి ప్రజలను రెచ్చగొడుతున్నారని అన్నారు. కాకాణి నిజాయితీ గల నాయకుడివైతే ముందుగా రామిరెడ్డి భూములు, కళాశాలలు, ఆక్రమణలను ప్రజల



ముందుంచాలని, ఆ తర్వాత నా క్వారీకి రావాలని, నేను రికార్డులు చూపించడానికి సిద్దంగా ఉన్నానని, నేను తప్పు చేస్తే ప్రజల కాళ్లకు తలవంచి క్షమాపణలు అడుగుతానని అన్నారు.

మీరు చేసిన అక్రమాల జాబితా కావలి ప్రజలందరికి తెలుసునని, కావాలిలో శాంతిని భంగం చేసే హక్కు ఎవరికి లేదని హెచ్చరించారు. కావలిలో 70 కోట్ల మనీ స్కామ్ జరిగిందని, మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డికి దీంతో సంబంధముందన్నారు. మూడు కోట్ల రూపాయల ఎన్నికల నిధులు సుభాని నుండి మాజీ ఎమ్మెల్యే తీసుకోవడం జరిగిందన్నారు.

సుభాని బ్యాంక్ అకౌంట్లు, ఆస్తులు సీజ్ చేయడం జరిగిందని, త్వరలోనే అందరికి న్యాయం జరిగేలా చూస్తామని తెలిపారు. కావలి ప్రజల అభ్యున్నతి కోసం నేను త్రికరణ శుద్ధిగా శ్రమిస్తున్నానని, ఒక వైపు సంక్షేమపథకాలు, మరో వైపు అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. టీడీపీ ప్రభుత్వం, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో కావలి నియోజకవర్గం అభివృద్ధి సాధన దిశగా అడుగులు వేస్తుందన్నారు.

ప్రతిపక్షాలు కావలిలో కక్షలు, వర్గాలు రేపడానికి ప్రయత్నిస్తున్నా, ప్రజలు నమ్మడం లేదని ఎమ్మెల్యే తెలిపారు. నన్ను నమ్మి గెలిపించిన కావలి ఓటర్లందరికి కృతజ్ఞతలన్నారు.

# సెప్టెంబర్ 7న శ్రీవారి ఆలయం మూసివేత

## - చంద్రగ్రహణం కారణంగా 12గంటలు దర్శనాలు రద్దు


**తిరుమల,ఆగస్టు 26ప్రభాతవార్తప్రతినిధి:** సంపూర్ణ చంద్రగ్రహణం కారణంగా సెప్టెంబర్ 7వతేదీ ఆదివారం 12గంటలు పాటు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాన్ని మూసివేస్తున్నారు. 7వతేదీ సాయంత్రం 3.30గంటల నుండి 8వతేదీ వేకువజామున 3గంటల వరకు ఆలయ తలుపులు మూసివేసి అన్ని దర్శనాలను రద్దుచేశారు. సెప్టెంబర్ 7వతేదీ రాత్రి 9.50గంటలకు చంద్రగ్రహణం ప్రారంభమై 8వతేదీ వేకువజామున 1.31గంటల వరకు పూర్తవుతుంది. సాధారణంగా గ్రహణ సమయానికి 6గంటల ముందుగా ఆలయం తలుపులు మూసివేయడం ఆనవాయితీ. సెప్టెంబర్ 8న తెల్లవారుజామున 3గంటలకు ఆలయం తలుపులు తెరచి శుద్ధి, పుణ్యాహవచనం నిర్వహిస్తారు. అనంతరం తోమాలసేవ, కొలువు, పంచాంగశ్రవణం, అర్చన సేవలను ఏకాంతంగా జరుపుతారు. ఆరోజు ఉదయం 6గంటలకు శ్రీవారి భక్తులకు స్వామివారి దర్శనం పునఃప్రారంభమవుతుంది. చంద్రగ్రహణం కారణంగా సెప్టెంబర్ 7వతేదీ ఆదివారం ఆలయంలో ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టిటిడి రద్దుచేసింది. అన్నప్రసాద భవనం, వితరణ కేంద్రాలు కూడా మూసివేస్తారు. శ్రీవారి భక్తులు ఈ విషయాన్ని తెలుసుకుని తమ తిరుమలయాత్ర చేయాలని కోరారు.

# బార్ లైసెన్స్ దరఖాస్తుల గడువు 29 సాయంత్రం 6 గంటల వరకు పొడిగింపు

**విజయవాడ,ఆగస్టు26,ప్రభాతవార్తప్రతినిధి:** బార్ లైసెన్స్ దరఖాస్తుల గడువు ఆగస్టు 29 సాయంత్రం 6 గంటల వరకు పొడిగించినట్లు ఎక్సైజ్ కమీషనర్ నిశాంత్ కుమార్ తెలిపారు. ఇందుకు సంబంధించిన లాటరీ డ్రా ఆగస్టు 30 ఉదయం 8 గంటలకు నిర్వహిస్తామని నిశాంత్ కుమార్ తెలిపారు. వినాయక చవితి, బ్యాంకు సెలవుల దృష్ట్యా గడువు పొడిగించినట్లు కమీషనర్ తెలిపారు. నిరంతర వర్షాలు, వరదల కారణంగా దరఖాస్తుల సమర్పణలో ఇబ్బందులు ఎదురైనట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి నవరణ షెడ్యూల్ విడుదల చేసినట్లు ఎక్సైజ్ శాఖ కమీషనర్ వివరించారు. కొత్త గడువుపై విస్తృత ప్రచారం చేయాలని జిల్లా అధికారులకు ఆదేశాలను నిశాంత్‌కుమార్ తెలిపారు.

# కురుబ,కురుమ,కురువ జాతి అభివృద్ధేలక్ష్యం

## - రాష్ట్ర కురుబ,కురుమ,కురువ సంఘం అధ్యక్షుడు జబ్బల శ్రీనివాసులు



**తిరుపతి హెల్త్, ఆగస్టు 26 ప్రభాతవార్త :** ఏపీ రాష్ట్రంలోని 12 కోట్ల మంది కురుబ, కురుమ, కురువ జాతి సామాజిక, ఆర్థిక, రాజకీయ అభివృద్ధే లక్ష్యం ఏపీ కురుబ, కురుమ, కురవ సంఘం పనిచేస్తోందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాసులు తెలియజేశారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జబ్బల శ్రీనివాసులు మాట్లాడారు. రాష్ట్రంలో 12 కోట్ల మంది మా జాతి బిడ్డలు ఉన్నారని, గత వైసీపీ ప్రభుత్వం, నేటి కూటమి ప్రభుత్వం మా జాతిని గుర్తించిన విషయాన్ని గుర్తు చేశారు. సంఘ బలోపేతంలో భాగంగా అన్ని జిల్లాల్లో సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరుగుతోందన్నారు. దీనిలో భాగంగా ఆగస్టు 28న అన్నమయ్య జిల్లా రాయచోటి పట్టణం ఆజాద్ ఫంక్షన్ హాల్‌లో ఉదయం 10 గంటలకు సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశంతో పాటు అన్నమయ్య జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరుగుతోందన్నారు. సంఘాన్ని ఏర్పాటు చేసి తొమ్మిది సంవత్సరాలు పూర్తి అవుతోందని, అక్టోబరు 12న విజయవాడలో సంఘం 10వ వార్షికోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించనున్నామన్నారు. ముందుగా అన్నమయ్య జిల్లాలో జరిగే రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని, ఆ జిల్లా నూతన కార్యవర్గాన్ని అన్నమయ్య జిల్లాలోని ఆరు నియోజక వర్గాలైన కోడూరు, రాజంపేట, రాయచోటి, తంబళ్ళపల్లి, మదనపల్లి, పీలేరు ప్రాంతాలు, రాష్ట్రంలోని కురుబ కుల బంధువుల పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నేతలు రెడ్డికుమార్, రాజన్న, రామాంజనేయులు, సంఘం నేతలు, సభ్యులు పాల్గొన్నారు.

# గణపయ్య బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం

**కాణిపాకం, ఆగస్టు 26 ప్రభాతవార్త:** సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి బ్రహ్మోత్సవాలకు దేవస్థానం సర్వం సన్నద్ధమైంది. కాణిపాకం దేవస్థానంలో బుధవారం నుండి సెప్టెంబర్ 16 వరకు స్వామివారి బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. ఈమేరకు ఉత్సవాలను గతంలో వలె సంప్రదాయరీతిలో వైభవంగా నిర్వహించడానికి దేవస్థానం అన్ని ఏర్పాట్లు చేపట్టింది. ఇందులో భాగంగా ఆన్వేటి మండపం, సుపథమండపంలలో రంగవల్లికలను అందంగా తీర్చిదిద్దారు. ఉత్సవాల సందర్భంగా భక్తులందరికి త్వరితగతిన దర్శనం కల్పించేందుకు వీలుగా సామాన్య భక్తులతో పాటు విఐపీలకు, చంటిబిడ్డల తల్లులకు, వికలాంగులకు, ఉభయదారులకు ఆలయం వద్ద వేర్వేరుగా ప్రత్యేక క్యూలైన్లను సిద్ధం చేశారు. ఆలయ దర్శనార్థం వచ్చే భక్తులందరికి స్వామివారి ప్రసాదాలు అందించేందుకు వీలుగా సుమారు 70 వేల లడ్డూ, ప్రసాదాలను సిద్ధం చేసి వుంచారు. వినాయక చవితి సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అభిషేకం అనంతరం 3గంటలు నుండి భక్తులను ఆలయంలోకి స్వామివారి దర్శనం కల్పించనున్నారు.

# దుర్గమ్మ ఆలయంలో నేటినుండి వినాయకచవితి వేడుకలు

**ఇంద్రకీలాద్రి, ఆగస్టు 26, ప్రభాతవార్త** దుర్గమ్మవారి ఆలయంలో బుధవారం వినాయకచవితి ఉత్సవాలను వేడుకగా నిర్వహిస్తామని ఇఓ వికె శీనానాయక్ తెలిపారు. శ్రీ నటరాజస్వామి వారి ఆలయ ప్రాంగణంలో వున్న శ్రీ గణపతి స్వామి వారి ఆలయం నందు, కొండపైన చిన్న రాజగోపురం వద్ద వేంచేసియున్న శ్రీ మహాగణపతి స్వామివారికి (మృత్తికా గణపతిని ఇక్కడ ఏర్పాటు), చేసి ఉత్సవాలు చేస్తామన్నారు. 27న ఉదయం 8 గంటలకు విఘ్నేశ్వర పూజ, కలశస్థాపన, శ్రీ గణపతి హోమం, కథా శ్రవణం కార్యక్రమాలను చిన్నరాజగోపురం వద్ద నిర్వహిస్తామని సాయంత్రం 4 గంటలకు ఆవాహన దేవతా హోమాలు, హారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాద వినియోగం జరుగుతాయన్నారు. 28 ఉదయం 8 గంటలకు శ్రీ గణపతి హోమం సాయంత్రం 4 గంటలకు ఆవాహన దేవతా హోమాలు, హారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాద వినియోగం జరుగుతాయన్నారు. 29 ఉదయం 9.30 గంటలకు పూర్ణాహుతి, సాయంత్రం 5 గంటలకు మృత్తిగా గణపతి స్వామివార్లను నిమజ్జనం నిర్వహిస్తామని భక్తులు పాల్గొని శ్రీ స్వామివార్ల కృపకు పాత్రులవ్వాలన్నారు. దుర్గమ్మవారిని దర్శించుకునే భక్తులు తమ ఫోన్లను మొబైల్ కౌంటర్లలో భద్రపరుచుకోవాలని ఆలయంలోకి తీసుకురాకూడదని ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు.

మొబైల్స్‌ను దర్శనంలోకి తీసుకొస్తే అక్కడ దేవస్థానంలోని భద్రతా సిబ్బంది వద్ద వున్న భాక్స్‌లో వేస్తారన్నారు. అలాగే సంప్రదాయబద్ధమైన వస్త్రధారణతోనే దుర్గమ్మ దర్శనానికి రావాలన్నారు. అసభ్యకర దుస్తులతో దర్శనానికి రాకూడదని తెలిపారు.

# జనవరి నాటికి అందుబాటులోకి విజయవాడ పశ్చిమ బైపాస్ !

**విజయవాడ,ఆగస్టు26,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడ నగరానికి సునాయాసంగా చేరుకోవడానికి వీలుగా నిర్మిస్తున్న పశ్చిమ బైపాస్‌పై రోడ్డుపై వచ్చే ఏడాది జనవరి నాటిరి పూర్తిస్థాయిలో వాహనాలను అనుమతించనున్నారు. ఇప్పటికే ఈ రహదారిపై కొంత మేరకు అవసర సమయాల్లో వాహనాలను అనుమతిస్తున్నారు. ఈ రహదారిని పూర్తిగా వినియోగంలోకి తీసుకుని వచ్చేందుకు వీలుగా మిగిలిన చిన్న పాటి పనులు ప్రస్తుతం నిర్వహిస్తున్నారు. మొత్తంగా విజయవాడ పశ్చిమ బైపాస్ లో ప్యాకేజీ1లో భాగంగా గుండుగొలను కలపర్రు, ప్యాకేజీ2లో కలపర్రుచినఅవుటపల్లి వరకూ బైపాస్ నిర్మాణ పనులను ఇప్పటికే పూర్తి చేశారు. ప్యాకేజీ3లో చినఅవుటపల్లి గొల్లపూడి, ప్యాకేజీ4లో గొల్లపూడికాజ వరకు జరుగుతున్న నిర్మాణ పనులకు సంబంధించిన అడ్డంకులు దాదాపు పూర్తి చేశారు. దీంతో జనవరి నాటికి విజయవాడ పశ్చిమ బైపాస్ రోడ్డుపై ప్రయాణం మొదలవుతుందనే దీమాతో అధికార యంత్రాంగం ఉంది. ప్యాకేజీ3లో హైటెన్షన్ టవర్ల మార్పిడి అంశంపై వారం రోజుల్లో స్పష్టత వస్తుందంటున్నారు. ఈ క్రమంలోనే ఎన్‌హెచ్16పై కాజ దగ్గర వెస్ట్ బైపాస్ ల్యాండింగ్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. కీలకంగా ప్యాకేజీ ల్యాండింగ్ పనులు సాగుతున్నాయి. విజయవాడ నుంచి గుంటూరు వెళ్లే వారు అనుసంధాన ప్రాంతానికి రాకుండా నేరుగా సర్వీస్ రోడ్డు నుంచి మళ్లించి 100 మీటర్ల దూరం తర్వాత హైవే ఎక్కించారు. ఈ పనులు పూర్తి చేసిన తర్వాత గుంటూరు నుంచి విజయవాడ వెళ్లే వాహనాలను కూడా ఇదే విధంగా డైవర్ట్ చేయనున్నారు. అనంతరం కాజా నుంచి చేస్తున్న ప్రాంతంలో సర్వీస్ రోడ్డును వేరు చేస్తారు.

27-8P□g7exHMNWJQE 11_27-8P□g7exHMNWJQE.qxd 8/27/2025 12:07 AM Page 1



# ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు భారీగా కోత!

## త్వరలో కొత్త మార్గదర్శకాలు

**హైదరాబాద్, ఆగస్టు 26, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు అమలు చేస్తున్న ఫీ రీయింబర్స్‌మెంట్‌కు భారీగా కోత పడనుంది. దీనికి సంబంధించి మార్గదర్శకాలను మరింత కఠిన తరం చేయాలని సంక్షేమ శాఖలు నిర్ణయించాయి. రాష్ట్రం మొత్తం మీద ప్రతీ ఏటా 12.51 లక్షల మంది ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను పొందుతున్నారు. ఇందులో 5 లక్షల మంది కొత్త వారు ఉండగా, అన్ని కోర్సులకు కలిపి సంవత్సరానికి 2,350 కోట్ల రూపాయలు చొప్పున ప్రభుత్వానికి ఖర్చవుతోంది. ఇప్పటి వరకు సాంఘిక, గిరిజన సంక్షేమ విద్యార్థులకు ఎంత ర్యాంకు వచ్చినా పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ చేస్తున్నారు. వెనుకబడిన తరగతులకు మాత్రం 10 వేల లోపు ర్యాంకు వస్తేనే ఇంజనీరింగ్‌లో మొత్తం చెల్లిస్తు, ఆపై ర్యాంకులకు 35 వేల రూపాయలను మాత్రమే ఇస్తున్నారు.

మరోవైపు రాష్ట్ర వ్యాప్తంగా ఫీ రియింబర్స్‌మెంట్ భారం భారీగా పెరిగి వాటి నిమిత్తం బకాయిలు ఇప్పటికే దాదాపు 8.10 కోట్ల రూపాయల మేరకు పెరుగు పోయాయి. ఈ నేపథ్యంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ అర్హతల్లో మార్పులు చేసేందుకు సర్కార్ సైతం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది.

కొత్త మార్గదర్శకాల ప్రకారం దాదాపు 35 శాతం మంది విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అర్హత కోల్పోయే అవకాశం ఉన్నట్లు అంచనా. ప్రధానంగా డిగ్రీ, ఇంజనీరింగ్ తదితర సాధారణ, సాంకేతిక కోర్సులకు గాను ఫీజు రీయింబర్స్‌మెంట్ అర్హత విషయంలో కొత్తగా మార్గదర్శకాలను రూపొందించే పనిలో అధికారులు ఉన్నారు.

ముఖ్యంగా ఒక సంవత్సరంలో 50 శాతం సబ్జెక్టులు పాస్ కావడంతో పాటు, 75 శాతం హాజరు ఉండాలనే నిబంధనలను కొత్తగా అమలు చేయనున్నట్లు సమాచారం. అంతేకాకుండా వివిధ సబ్జెక్టుల్లో నిర్దిష్ట మార్పులను ప్రామాణికంగా తీసుకోనున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ అధికారవర్గాల ద్వారా తెలియవచ్చింది. డిగ్రీ కోర్సుల్లో కమ్యూనికేషన్ స్కిల్స్ లోపం ఎక్కువగా ఉన్న దృష్ట్యా అటువంటి విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేయకుండా అనర్హులుగా చేసే ఆలోచన చేస్తున్నారు. సాంకేతిక కోర్సులకు సంబంధించిన ప్రధాన సబ్జెక్టుల్లో కనీసం 60 శాతం మార్కులు తెచ్చుకున్న వారికే ఈ పథకాని వర్తింప చేయనున్నారు.



ఆచార్య రాంరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆచార్య సంజీవ్ సోనావాణే, ఆచార్య వర్సిటీ విసి ఘంటా చక్రపాణి తదితరులు.

# విశ్వవిద్యాలయాల్లో డిజిటల్ ఆవిష్కరణలదే భవిష్యత్తు

## ఘనంగా అంబేద్కర్ వర్సిటీ 44వ వ్యవస్థాపక వేడుకలు

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), అగస్టు 26, ప్రభాతవార్త:** మారుతున్న ఆధునిక సవాళ్లను అధిగమిస్తూ సరికొత్త డిజిటల్ ఆవిష్కరణలతో దూరవిద్యావిధానం అభివృద్ధిలో పయనిస్తుందని యశ్వంతరావు చవాన్ మహారాష్ట్ర విశ్వ విద్యాలయ ఉపకులపతి ఆచార్య సంజీవ్ సోనావాణే అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ 44వ వ్యవస్థాపక వేడుకలను మంగళ వారం విశ్వవిద్యాలయంలో ఘనంగా నిర్వహించారు. 'సార్వత్రిక దూర విద్యలో కృత్రిమ మేధ ఆధారిత పరివర్తన పేరుతో నిర్వహించిన సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. సార్వత్రిక దూరవిద్య విధానం ఒక కొత్త యుగంలోకి ప్రవేశించిందని, దీనిలో ఆర్టిఫిషియల్ ఇంటి లిజెన్స్ ఎంతో ఆవశ్యకత సంతరించుకొందన్నారు. అంబేద్కర్ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఘంటా చక్రపాణి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రతి ఇంటికి దూరవిద్యను అందించడం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. త్వరలో విశ్వవిద్యాలయంలో డిజిటల్ రిసోర్స్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఇక్కడ మైక్రో క్రెడెన్షియల్ కోర్సులను ప్రారంభించారు. జాతీయ సెమినార్ పరిశోధన పత్రాలను ఆవిష్కరించారు. ఘంటా చక్రపాణి సేకరించిన 1,100ల పుస్తకాలను వర్సిటీ లైబ్రరీకి అందించారు. కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో పనిచేసే అనువాదిని సంస్థతో జరిగిన అవగాహన ఒప్పందం మేరకు ఆయా ఒప్పందపత్రాలను సంస్థ సిఇఒ చంద్రశేఖర్ చేతుల మీదుగా విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ విజయకృష్ణారెడ్డి మార్చుకున్నారు. కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు, డీన్లు, బోధన, బోధ నేతర సిబ్బంది, పరిశోధన విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ వ్యవస్థాపకుడు ఆచార్య జి.రాంరెడ్డి చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు.

# రాష్ట్రంలో పాలన పక్కకుపెట్టి ఢిల్లీ టూర్లు, విదేశాలకు వెళ్లిన ఘనత రేవంత్‌రెడ్డిదే

## బిజెపి అధికార ప్రతినిధి, మీడియా ఇన్‌చార్జి ఎన్.వి.సుభాష్

**హైదరాబాద్, ఆగస్టు 26, ప్రభాతవార్త:** రాష్ట్రంలో గత 20 నెలల పాలనలో ప్రజాసమస్యలను పట్టించుకోకుండా 50సార్లు ఢిల్లీతోపాటు బీహార్, కలకత్తా, విదేశాల టూర్లకు వెళ్లిన ఘనత కేవలం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికే దక్కుతుందని బిజెపి అధికార ప్రతినిధి, మీడియా ఇంచార్జ్ ఎన్.వి.సుభాష్ అన్నారు. మంగళవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1978-83 మధ్య ఐదు సంవత్సరాల్లో నలుగురు ముఖ్యమంత్రులు మారినా, ఒక ముఖ్యమంత్రి మాత్రమే 75 సార్లు ఢిల్లీకి వెళ్లాడు. కానీ రేవంత్ రెడ్డి కేవలం 20 నెలల్లోనే దాదాపు ఆ రికార్డుకు దగ్గరయ్యారన్నారు. ప్రజలు అడుగుతున్నారు... మేము ఎన్నుకున్న ముఖ్యమంత్రి ఎక్కడ? ఎప్పుడూ ఢిల్లీలోనా, బీహార్‌లోనా, లేదంటే విదేశాల్లోనా? అంటూ ప్రశ్నిస్తున్నారని అన్నారు. ఎప్పుడైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలవాలనుకుంటే - వారు హైదరాబాద్‌లో ఉండరు, సెక్రటేరియట్‌కి రావడం లేదు, ప్రజలకు అసలు అందుబాటులో ఉండడం లేదు,

ఎప్పుడూ ఒక రాష్ట్రం నుంచి మరొక రాష్ట్రానికి తిరుగుతూనే ఉన్నారు అన్నారు. అందుకే ఆయనకు సరిపోయే బిరుదు ఒకటే -ది బెస్ట్ హాపింగ్ చీఫ్ మినిస్టర్ ఆఫ్ ది కంట్రీ, ఇటీవల సోనియా గాంధీ రేవంత్ రెడ్డికి బాస్కర్ అవార్డు ఇచ్చినట్లే, ఇకపై ఈ హాపింగ్ చీఫ్ మినిస్టర్ అవార్డు కూడా ఆయనకే దక్కుతుందన్నారు. గ్యారెంటీలు అని చెప్పి, హామీలు అని చెప్పి, కొత్త కొత్త స్కీమ్స్ తెస్తామని పదే పదే చెబుతూ ప్రజలను మోసం చేశారన్నారు. ఇటీవల మా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు వివిధ జిల్లాల పర్యటనలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ప్రజలు పెద్ద సంఖ్యలో ఆయన వద్దకు వచ్చి పిటిషన్లు, మెమోరాండాలు ఇచ్చారని, ముఖ్యమంత్రికి కనీసం ఒకసారి చెప్పండి.. మా సమస్యలు విని పరిష్కరించేలా హితవు పలకండి అని ప్రజలు వేడుకున్న సంఘటనలు అనేకం ఉన్నాయన్నారు. సిఎం రేవంత్ రెడ్డి హోం మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నా, గత 20 నెలల్లో తెలంగాణ రాష్ట్రంలో అనేక ఘోరాలు జరిగాయి. విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న సంఘటనలు పెరిగాయని, మహిళలపై అత్యాచారాలు భయంకరంగా పెరిగాయన్నారు. ప్రజల సమస్యలను పక్కన పెట్టి, కేంద్రం నుంచి రాష్ట్రానికి వచ్చే నిధులను సక్రమంగా వినియోగించి ఉంటే, తెలంగాణ రాష్ట్రం ఈ రోజుకి మరింత అభివృద్ధి చెంది ఉండేదన్నారు. పక్క రాష్ట్రాలతో పోటీపడే స్థాయిలో నిలిచేది. కానీ ఆ అవకాశాన్ని వినియోగించుకోలేక, ప్రజలను మోసం చేశారన్నారు.

# 29 నుంచి ఎడ్‌సెట్ సెకండ్‌ఫేజ్ కౌన్సెలింగ్

## సెప్టెంబరు 11న సీట్ల కేటాయింపు

**హైదరాబాద్, ఆగస్టు 26, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు బీఈడీ కాలేజీల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఎడ్ సెట్-2025 కౌన్సెలింగ్‌లో భాగంగా సెకండ్ ఫేజ్ కౌన్సెలింగ్ ఈ నెల 29 నుంచి ప్రారంభించనున్నారు. ఈ నెల 29 నుంచి సెప్టెంబర్ 2 వరకు ఫీజు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకొని, సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కి అవకాశం కల్పించినట్టు అడ్మిషన్ల కన్వీనర్ ప్రొఫెసర్ ఐ పాండు రంగారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థుల లిస్టును సెప్టెంబర్ 4న ప్రకటించనున్నారు. అర్హులైన వారు సెప్టెంబర్ 5, 6 తేదీల్లో వెబ్ ఆప్షన్లు ఇవ్వాల్సి ఉంటుంది. సెప్టెంబర్ 7న వెబ్ ఆప్షన్లకి ఎడిట్ సౌకర్యం కల్పించారు.

వెబ్ ఆప్షన్లు ఇచ్చిన వారికి సెప్టెంబర్ 11న సీట్ల కేటాయింపు చేస్తారు. సీట్లు పొందిన వారు సెప్టెంబర్ 12 నుంచి 16 వరకు ఆయా కాలేజీల్లో చేరాలని కన్వీనర్ సూచించారు. రాష్ట్రంలో 14,295 కన్వీనర్ కోటా సీట్లు అందుబాటులో ఉన్నాయి. వాటి కోసం మొదటి విడతలో 17,151 మంది వెబ్ ఆప్షన్లు ఇచ్చారు. వెబ్ ఆప్షన్లు ఇచ్చిన వారిలో 9955 మందికి సీట్ల కేటాయింపు చేశారు.

# పెండింగ్‌లోని ఎస్టీ ప్రత్యేక నిధుల వినియోగానికి చర్యలు

## ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య

**హైదరాబాద్, ఆగస్టు 26, ప్రభాతవార్త:** గత ప్రభుత్వం హయాం నుంచి పెండింగ్‌లో ఉన్న ఎస్టీ ప్రత్యేక అభివృద్ధి నిధులు వినియోగంలోకి వచ్చేలా చర్యలు తీసుకోవాల్సి ఉందని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమీషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. హైదరాబాద్ మాసబ్‌ట్యాంక్‌లోని గిరిజన సంక్షేమ శాఖలో మంగళవారం జరిగిన సమా వేశంలో మాట్లాడుతూ ఎస్టీల సంక్షేమం కోసం ఆయా సంవత్సరాలలోనే ఖర్చు కాకుండా మిగిలిపోతున్నాయని చెప్పారు. వాటిని అదే యేడాది సకాలంలో ఖర్చు అయ్యేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామ న్నారు. అలాగే ఎస్టీ ఉద్యోగులకు ఉద్యోగాలలో ప్రమోషన్లు సకాలంలో వచ్చేలా రోస్టర్ విధానాన్ని పటిష్టం చేయాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల సంక్షేమం, అభివృద్ధికి సంబంధించి ప్రభుత్వ ఆశించిన విధంగా జరిగేలా చూడాలన్నారు. విద్యార్థుల డైట్, కాస్మెటిక్ ఛార్జీలు వెంటనే విడుదలయ్యేలా చర్యలు తీసుకోవడం పట్ల ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్ మాట్లాడుతూ దేశంలో అన్ని కార్పొరేషన్లూకొంత నిర్వీర్యమైనాయని, ఈ విషయంలో ప్రభుత్వ సహకారం ఆయా కార్పొరేషన్లకు అవసరమన్నారు. ఈ విషయమై ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, సంబంధిత మంత్రులతో చర్చించిఇప్పటికే కొన్ని విధాన పరమైన నిర్ణయాలను తీసుకోగలి గామన్నారు. ఇక మీదట ఎస్సీ ఎస్టీ కమీషన్ ఇచ్చే సలహాలు, సూచనలు పాటిస్తామన్నారు. ఈ సమావేశంలో ఎస్సీ ఎస్టీ కమీషన్ సభ్యులు నీలాదేవి, రాంబాబు నాయక్, లక్ష్మీనారాయణ, శంకర్, రేణికుంట్ల ప్రవీణ్‌తో పాటు, గిరిజన సంక్షేమ కార్యదర్శి వర్షిణి, అదనపు సంచాలకులు విట్టా సర్వేశ్వర్‌రెడ్డి, ఎస్టీ గురుకుల కార్యదర్శి సీతాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# మూడు లక్షల మెట్రిక్ టన్నుల యూరియా రావాలి

## ఎక్సైజ్ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు 26, ప్రభాతవార్త:** రాష్ట్రంలో యూరియా కొరత లేదని, రైతులు ఎటు వంటి ఆందోళన చెందవద్దని ఎక్సైజ్ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. యూరియా విక్రయించే పి. ఏ.సి.ఎస్., ప్రైవేట్ ఎరువుల డీలర్ షాపుల వద్ద ప్రభుత్వ అధికారిని నియమించి పర్యవేక్షణ చేసేలా బాధ్యతలు అప్ప గించాలని ఆదేశించారు.



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

మహబూబ్ నగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయం లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఎం.ఎల్.సి.లు, ఎమ్మెల్యేలు, కలెక్టర్ లు, ఎస్.పి.లు, వ్యవసాయ అధికారులు, సహకార శాఖ అధికారులతో యూరియా సరఫరాపై సమీక్ష సమావేశం నిర్వహించారు. వ్యవసాయ సీజన్ పూర్తి అయ్యే వరకు యూరియా సరఫరాపై జిల్లా కలెక్టర్ లు, ఎస్.పి.లు ప్రత్యేక దృష్టి సారించి నిశితంగా పర్యవేక్షణ చేయాలన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ యూరియా సరఫరాలో ఎటువంటి అవకతవకలు జరిగినా, దాచిపెట్టి కృత్రిమ కొరత సృష్టించిన అటువంటి ఎరువుల డీలర్ లపై, నకిలీ విత్తనాలు విక్రయించిన, అధిక రేటుకు విక్రయించిన వారిపై కేసులు నమోదు చేసి శిక్షలు పడేలా చర్యలు తీసుకో వాలని జిల్లా కలెక్టర్‌లు, ఎస్.పి.లను ఆయన ఆదేశించారు. యూరియా పంపిణీ జరగడం లేదని ఆరోపణలు వస్తున్నాయని వాస్తవంగా కేంద్రం నుండి రావాల్సిన 9 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా రావాల్సి ఉండగా ఇప్పటివరకు 5.72 లక్షల మెట్రిక్‌టన్నుల యూరియా వచ్చిందని ఇంకా సుమారు 3 లక్షల మెట్రిక్ టన్నులు రావాల్సి ఉందని తెలిపారు. పూర్తిగా యూరియా వస్తే రైతులకు ఎటువంటి ఇబ్బంది రాదని తెలిపారు. రైతులు ఇబ్బంది పడకూడదని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, కేంద్రంతో, కేంద్ర మంత్రులతో మాట్లాడి వెంటనే యూరియా రాష్ట్రానికి వచ్చేలా అన్ని విధాలుగా చర్యలు తీసుకున్నారని తెలిపారు. సమావేశంలో ఎం.ఎల్.సి కూచుకుళ్ళ దామోదర్ రెడ్డి, శాసన సభ్యులు జి.మధుసూదన్ రెడ్డి, కసిరెడ్డి నారాయణ రెడ్డి, చిక్కుడు వంశీ కృష్ణ, కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి, బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి, యెన్నం శ్రీనివాసరెడ్డి, చిట్టెం పర్ణికా రెడ్డి, తూడి మేఘా రెడ్డి, డి.సి.సి. బి చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

# సాంకేతిక సమస్యల్లో రామగుండం ఎరువుల ప్లాంట్

## యూరియా ఉత్పత్తికి బ్రేక్

**హైదరాబాద్, ఆగస్టు 26, ప్రభాతవార్త:** రాష్ట్రానికి అత్యధికంగా యూరియాను సరఫరా చేసే రామగుండం ఫర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (ఆర్ఎఫ్సీఎల్) ప్లాంట్ సాంకేతిక సమస్యల్లో కొట్టుమిట్టాడుతోంది. తరచూ ప్లాంట్‌లో సాంకేతిక సమస్యలు ఏర్పడి యూరియా ఉత్పత్తికి తీవ్ర ఆటంకాలు ఏర్పడుతున్నాయి, దీని ఫలితంగా రాష్ట్రానికి సకాలంలో, వాటా ప్రకారం రావాల్సిన యూరియా రాక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఈ ప్లాంట్ 2021 మార్చి 22న యూరియా ఉత్పత్తిని ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటివరకు 20 సార్లు సాంకేతిక సమస్యలు ఏర్పడి నిలిచిపోయింది. ప్రస్తుత 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు రెండు సార్లు ప్లాంట్ షట్డౌన్ కాగా, తాజాగా హెచ్టీఆర్ మెషినరీలో సాంకేతిక లోపం కారణంగా ఉత్పత్తి మళ్లీ నిలిచిపోయింది. దీని ప్రభావం యూరియా ఉత్పత్తిపై చూపుతోంది. రామగుండం యూరియా ప్లాంట్లో సాంకేతిక సమస్యలు తలెత్తిన సందర్భంలో పైప్లైన్లలో అమోనియా లీక్ అవుతోంది. దీంతో ప్లాంట్ మొత్తాన్ని రోజుల తరబడి షట్ డౌన్ చేయాల్సి వస్తోంది. మే 8న ప్లాంట్లో ఏర్పడిన లీకేజీ సమస్య కారణంగా జూన్ 15 వరకు 39 రోజులు ప్లాంట్ను షట్డౌన్ చేశారు. మళ్లీ జులై 16న సమస్య ఏర్పడడంతో ఆ రోజు నుంచి ఆగస్ట్ 4 వరకు 20 రోజులు ప్లాంట్ షట్డౌన్ అయింది. అలాగే హీట్ ట్రాన్స్ఫర్మింగ్ రీఫార్మర్ (హెచ్టీఆర్) లో ఈ నెల 14న టెక్నికల్ ఇష్యూతో లీకేజీ ఏర్పడడంతో ప్లాంట్ మరోసారి షట్ డౌన్ అయింది. ఈ మెషీన్లో సాంకేతిక లోపం ఏర్పడితే దానికదే ఆటోమేటిక్గా ట్రిప్ అవుతుంది. ఈ సమస్య ప్లాంట్‌లో నిత్యకృత్యంగా మారింది. ప్రస్తుత 2025-26 సంవత్సరంలో ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు 4 లక్షల టన్నుల యూరియా ఉత్ప త్తిని లక్ష్యంగా పెట్టుకోగా, 2.71 లక్షల టన్నుల ఉ త్పత్తి మాత్రమే చేయగలిగారు. ఈ నెలలో 65 వేల టన్నుల యూరియా ఉత్పత్తిచేసి రవాణా చే యాలని నిర్ణయించుకున్నా, కేవలం 24వేల టన్నుల యూరియాను మాత్రమే సరఫరా చేసింది.

# పెన్షనర్లను మోసం చేసిన ముఖ్యమంత్రి

## ఇచ్చిన మాట ప్రకారం పింఛన్లు పెంచాలి

## 9న హైదరాబాద్‌లో పెన్షన్‌దారుల మహాగర్జన

## ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు 26, ప్రభాతవార్త:** వృద్ధులకు, వితంతువులకు, ఒంటరి మహిళలకు రూ.4వేలు, వికలాంగులకు రూ.6 వేలు పెన్షన్ ఇస్తానని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇవ్వకుండా మోసం చేశాడని ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఆరోపించారు. దివ్యాంగుల పెన్షన్ రూ.6 వేలకు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, అన్ని రకాల చేయూత పెన్షన్లు రూ.4 వేలకు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం దివ్యాంగుల హక్కుల పోరాట సమితి, చేయూత పెన్షన్‌దారుల ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో నియోజకవర్గ సన్నాహక సదస్సు నిర్వహించారు.

కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంద కృష్ణ మాదిగ హాజరై మాట్లాడారు. ఈ నెల ఓటు వేయండి, వచ్చే నెల నుండే పెన్షన్ తీసుకోండని మాట్లాడిన రేవంత్ రెడ్డి ఓటు వేశాక ముఖ్యమంత్రి అయి పెన్షన్ దారులం దర్నీ ఘోరంగా మోసం చేశాడని విమర్శించాడు.



మంగళవారం జడ్చర్లలో నియోజకవర్గ సన్నాహక సదస్సు మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

రేవంత్‌రెడ్డి చేసిన మోసం గురించి ప్రతిపక్షాలు కూడా మాట్లాడకుండా చేయూత పెన్షన్‌దారు లకు అన్యాయం చేస్తున్నాయన్నారు. 50లక్షల మంది పెన్షన్ దారుల పక్షాన దివ్యాంగుల హక్కుల పోరాట సమితి మాదిగ రిజర్వే షన్ పోరాట సమితి పోరాటం చేస్తుందన్నారు. పెన్షన్లు పెంచకపోతే చలో హైదరాబాద్ సెప్టెంబర్ 9న పెరేడ్‌గ్రౌండ్‌లో లక్ష లాది మందితో మహాగర్జన నిర్వహిస్తు న్నామన్నారు. కార్యక్రమం లో వికలాంగ హక్కుల పోరాట సమితి జాతీయ ఉపాధ్యక్షులు బి.కె నరసింహం, ప్రధాన కార్యదర్శి నరేందర్ పాల్గొన్నారు.

# మిగిలిపోయిన భాషా పండితులకు పదోన్నతులు కల్పించాలి

## ఎస్ఎలుగా పదోన్నతులు కల్పించినందుకు

## ప్రభుత్వానికి కృతజ్ఞతలు: ఆర్‌యుపిపి రాష్ట్ర కార్యవర్గం

**హైదరాబాద్, ఆగస్టు 26, ప్రభాతవార్త:** రాష్ట్రంలో మిగిలిపోయిన భాషా పండితులకు స్కూల్ అసిస్టెంట్ లాంగ్వేజెస్‌గా పదోన్నతులు కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ తెలం గాణ (ఆర్‌యుపిపి టిజి) ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. భాషా పండితులకు ప్రస్తుతం జరుగుతున్న పదోన్నతుల్లో స్కూల్ అసిస్టెంట్(ఎస్‌ఎ) లాంగ్వేజెస్‌గా పదోన్నతులు కల్పించిన ప్రజాప్రభుత్వానికి సంఘం రాష్ట్ర అధ్యక్షులు మహ్మద్ అబ్దుల్లా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుల్లపల్లి తిరుమల కాంతికృష్ణ కృతజ్ఞతలు తెలిపారు. తమ సంఘం చేసిన ప్రాతినిధ్యం మేరకు అనతి కాలం లోనే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న తెలుగు, హిందీ, ఉర్దూ తదితర భాషాపండితులకు స్కూల్ అసిస్టెంట్ భాషలుగా పదోన్నతులు కల్పించి నందుకు..ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదములు తెలియజేస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఉన్నతీకరించవలసిన 1000 భాషా పండితుల పోస్టులను కూడా ఉన్నతీకరించి.. పదోన్నతులు లభించని భాషాపండితులకు న్యాయం చేయాలని ఈ సందర్భంగా ముఖ్య మంత్రిని కోరుతున్నామన్నారు. పదోన్నతుల ప్రక్రియలో సహాయసహకారాలు అందించిన రాష్ట్ర విద్యాశాఖ అధికారులందరికీ పండిత పరిషత్ పక్షాన ధన్యవాదములు తెలియజేస్తున్నామన్నారు. స్కూల్ అసిస్టెంట్ భాషలుగా పదోన్నతులు పొందిన

వారికి శుభాకాంక్షలు తెలుపుతూ.. తెలంగాణ రాష్ట్రంలో భాషల పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. గతంలో భాషా పండితులను స్కూల్ అసిస్టెంట్స్ గా అప్‌గ్రేడ్ చేసి పదోన్నతులు కల్పించగా.. ప్రస్తుతం జరుగుతున్న పదోన్నతుల్లోనూ భాషా పండితులకు 500 మందికిపైగా పదో న్నతులు లభించినట్టు వారు తెలిపారు.

# ఈర్లపల్లి తండా రవినాయక్ మృతిపై విచారణ జరిపి నివేదికను ఇవ్వాలి

## మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశం

**హైదరాబాద్, ఆగస్టు 26, ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ జిల్లా ఈర్లపల్లి తండాకు చెందిన రవినాయక్ మృతిపై విచారణకు ఆదేశించారు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ. రవి నాయక్‌కి సకాలంలో చికిత్స అందకపోవడం వల్లనే మరణించారని పత్రికల్లో వచ్చిన వార్తల నేపథ్యంలో మంత్రి విచారణకు ఆదేశించారు. ఉన్నతాధికారులతో కమిటీ ఏర్పాటు చేసి, విచారణ జరిపించాలని అధికారులను మంత్రి మంగళవారం ఆదేశించారు. మృతికి కారణాలు ఏమిటో తెల్సి, ఎవరిదైనా నిర్లక్ష్యం ఉంటే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాల మేరకు మెడికల్ ఎడ్యుకేషన్ అడిషనల్ డైరెక్టర్.. డాక్టర్ రాజారావు, డాక్టర్ నాగేందర్‌లతో కమిటీ ఏర్పాటు చేసి, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నరేంద్రకుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగా నిర్లక్ష్యం జరిగి ఉంటే వైద్యులపై చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

# జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ఉపరాష్ట్రపతి అభ్యర్థిత్వాన్ని జీర్ణించుకోలేని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా

## సిపిఐ జాతీయ నేత చాడ వెంకటరెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 26, ప్రభాతవార్త:** సెప్టెంబర్‌లో జరగనున్న ఉపరాష్ట్రపతి ఎన్నికలో భాగంగా ఇండియా కూటమి అభ్యర్థిగా జస్టిస్ సుదర్శన్ రెడ్డి ఉండడం కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా జీర్ణించుకోలేకపోతున్నారని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి విమర్శించారు. అమిత్ షా గుజరాత్ రాష్ట్ర హోమ్ మంత్రిగా ఉన్నప్పుడు సొరబ్ ఎన్‌కౌంటర్‌కి సంబంధించి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి తీర్పుతో .. అమిత్‌షా రెండు సంవత్సరాల పాటు గుజరాత్ రాష్ట్రం వెలుపల ఉండవలసి వచ్చిందని గుర్తు చేశారు. అప్పటి తీర్పుపై అమిత్‌షా ఇప్పుడు తన అక్కసు వెళ్లగక్కుతున్నాడని చాడా మండిపడ్డారు. కేంద్ర హోంశాఖ మంత్రిగా ఉండి న్యాయ వ్యవస్థ మీద మచ్చ తెస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డి గెలిస్తే మావోయిస్టులు 20 సంవత్సరాలు ముందుకెళ్తారని అమిత్ షా అనడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో మోడీ, అమిత్‌షా మావోయిస్టుల అవ శేషాలు లేకుండా చేయాలని చూస్తున్నారని, ఇది ప్రజాస్వామ్య మూల సూ త్రాలకు విరుద్ధమన్నారు. దేశంలో ప్రశ్నించే గొంతుకలను నొక్కుతు న్నారని, 100 శాతం వికలాంగుడైన ప్రొఫెసర్ సాయిబాబాపై నిందారోపణలు చేసి 9 సంవత్సరాలు జైలులో పెట్టడంతో చనిపోయారని, చివరికి సుప్రీంకోర్టు కూడా సాయిబాబా నిర్దోషి అని తీర్పు ఇవ్వడం పట్ల అమిత్‌షాకు చెంపపెట్టు లాంటిన్నారు చాడ వెంకట్‌రెడ్డి. జస్టిస్ సుదర్శన్‌రెడ్డి అభ్యర్థిత్వం పట్ల దేశంలోని జడ్జీలు స్పందిస్తున్నారని.. ఎన్డీఏ కూటంలో కొనసాగుతున్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ఆలోచించి మోడీ ప్రభుత్వంలో ప్రజాస్వామ్య రక్షణ వైపు ఉండాలని చాడ వెంకట్‌రెడ్డి సూచించారు.

# రూ.2 వేల కోట్ల రుణం తీసుకున్న సర్కార్

**హైదరాబాద్, ఆగస్టు 26, ప్రభాతవార్త:** రిజర్వ్ బ్యాంక్ నిర్వహించిన బహిరంగ వేలంలో తెలంగాణ రాష్ట్ర సర్కారు రూ.2 వేల కోట్లు రుణం సేకరించింది. అందుకు గాను ప్రభుత్వ సెక్యురిటీ బాండ్లను మంగళవారం ఈ వేలం వేయడం ద్వారా సమీకరించింది. ఈ రూ.2 వేల కోట్ల మొత్తానికి గాను మూడు భాగాలుగా సెక్యూరిటీ బాండ్లను సమర్పించింది. ఇందులో 26 ఏండ్ల కాలానికి రూ.500 కోట్లు, 28 ఏండ్ల కాలానికి రూ.1,000 కోట్లు, 30 ఏండ్ల కాలపరిమితితో మరో రూ.500 కోట్లు చొప్పున రుణాన్ని సమీకరించింది. కాగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మార్కెట్ రుణాల కింద రూ.54,009 కోట్లు సమీకరించనున్నట్లు తెలంగాణ ప్రభుత్వం 2025-26 వార్షిక అంచనా బడ్జెట్‌లో ప్రతిపాదించింది. ఇందులో భాగంగా ఈ ఆర్థిక సంవత్సరం ప్రారంభమైన ఏప్రిల్ నుండి ఇప్పటి వరకూ రూ. 33,900 కోట్లు మేర రుణం తీసుకుంది. దీంతో వార్షిక అంచనా బడ్జెట్‌లో ప్రతి పాదించిన రుణ సమీకరణలో 60 శాతం దాటింది.

# యూరియా కొరతపై బిజెపి తప్పుడు ప్రచారం తగదు

## సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

**హైదరాబాద్, ఆగస్టు 26, ప్రభాతవార్త:** యూరియా కొరతపై బిజెపి తప్పుడు ప్రచారం తగదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అన్నారు. రాష్ట్రానికి రావాల్సిన యూరియాను కేంద్రం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వానాకాలం సీజన్ ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నప్పటికీ, రైతు లకు కావాల్సిన యూరియాను అందించడంలో కేంద్రప్రభుత్వం నిరక్ష్యధ్లోరణితో వ్యవహరిస్తుందన్నారు. రైతులు యూరియా కొరకు నెల రోజులుగా రోడ్లపైకి వస్తున్నప్పటికీ బిజెపి నాయకులు కుంటి సాకులు చెబుతూ "కృత్రిమ కొరత" సృష్టించారనే తప్పుడు ప్రచారం చేస్తున్నారని.. ఈ తప్పుడు ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇప్పటికైనా కేంద్రం నుండి రాష్ట్రానికి కావాల్సి నంత యూరియాను తెప్పించడానికి రాష్ట్రానికి చెందిన బిజెపి ఎంపీలు, కేంద్ర మంత్రులు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి రైతులకు అండగా నిలబడాలని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి 9.8 లక్షల టన్నులు యూరియా కావాల్సి ఉండగా.. 1.5 లక్షల టన్నులను కేంద్రం తగ్గించిందన్నారు. ఇవ్వాల్సిన కోటాను కూడా ఇంత వరకు సకాలంలో సరఫరా చేయకపోవడంతో యూరియా కొరత ఏర్పడిందన్నారు. రైతులంతా సహకార సంఘాలు, షాపుల ముందు పడిగాపులు కాస్తున్నారని..ప్రభుత్వ కార్యాలయాల ముందు, రహదారుల మీద నిరసనలు తెలియజేస్తున్నారని చెప్పారు. నిరసనలు జరుగుతున్న చాలా చోట్ల తొక్కిసలాటలు జరుగుతున్నాయని తెలిపారు. రాష్ర్టంలోని రామగుండం ఎరువుల ఫ్యాక్టరీ నుండైనా రాష్ట్ర అవసరాలకు యూరియాను సరఫరా చేయాలని కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం అనేకసార్లు కోరినప్పటికీ.. ఉద్దేశ్యపూర్వకంగానే కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడంలేదని విమర్శించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం యూరియా కొరతను తీర్చడానికి, బ్లాక్ మార్కెట్‌ను నిరోధించడానికి ప్రభుత్వ సంస్థలైన హాకా, సహకార సంఘాల ద్వారా సరిపడా ఎరువులను సరఫరా చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్రానికి అవసరమైన యూరియాను కేంద్ర ప్రభుత్వం నుండి తెప్పించడానికి అన్ని రకాల చర్యలు తీసుకొని రైతులను ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# వ్యవసాయ విశ్వవిద్యాలయంలో డ్యూయల్ డిగ్రీ కోర్సులకు కౌన్సెలింగ్

**హైదరాబాద్ (అత్తాపూర్), ఆగస్టు 26, ప్రభాతవార్త :** ఎన్ఆర్ఐ/ఎన్ఆర్ఐ ప్రాయోజిత కోటా బి.ఎస్సీ. (ఆనర్స్) అగ్రికల్చర్, బిఎస్సీ (ఆనర్స్) కమ్యూనిటీ సైన్స్, బి.టెక్ (ఫుడ్ టెక్నాలజీ), బి.టెక్( అగ్రికల్చరల్ ఇంజనీరింగ్) కోర్సులలో సీట్ల భర్తీకి వాక్ ఇన్ కౌన్సిలింగ్ ఈనెల 30వ తేదీ ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జి.ఈ. సీహెచ్ విద్యాసాగర్ ప్రకటించారు. అదేరోజు అనగా 30వ తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం మరియు వెస్టర్న్ సిడ్నీ యూనివర్సిటీలు సంయుక్తంగా అందిస్తున్న డ్యూయల్ డిగ్రీ కోర్సు బి.ఎస్సీ(ఆనర్స్) అగ్రికల్చర్ కోర్సులో ప్రవేశాల కోసం వాక్ ఇన్ కౌన్సిలింగ్ జరగ నుందని రిజిస్ట్రార్ తెలిపారు. రాజేంద్రనగర్‌లోని విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ విభాగంలో ఈ రెండు కౌన్సెలింగ్‌లు నిర్వహించనున్నట్లు వివ రించారు. ఆసక్తిగల అభ్యర్థులు అన్ని ఒరిజినల్ ధ్రువపత్రాలు, వెబ్ సైట్‌లో సూచించిన రుసుమును తీసుకొని కౌన్సిలింగ్‌కు హాజరు కావాలని ఆయన సూచించారు.



రిజిస్ట్రార్ డా.విద్యాసాగర్

27-08pg10exHMNWJQEBVK ONG_27-08pg10exHMNWJQEBVK.qxd 8/27/2025 12:54 AM Page 1





# సింక్‌ఫీల్డ్ కప్‌లో గుకేష్ ఓటమి

## ఫిరోజ్జాను ఓడించి ఆధిక్యంలో ప్రజ్ఞా

**న్యూఢిల్లీ:** సింక్‌ఫీల్డ్ కప్-2025లో ప్రపంచ ఛాంపియన్, భారత్ గ్రాండ్ మాస్టర్ దొమ్మరాజు గుకేష్ వెస్లీ సో చేతిలో ఓడిపోయాడు. మరో టోర్నీలో ఫిరోజ్జాను ఓడించి ప్రజ్ఞానంద ఆధిక్యంలో ఉన్నాడు. సింక్‌ఫీల్డ్ కప్‌లో భాగంగా మంగళవారం జరిగిన టోర్నీలో గుకేష్ రూయ్ లోపెజ్‌లో అమెరికన్ చేతిలో పరాభవం చెందాడు. గుకేష్ బ్లాక్ పావులతో ఆడి వెస్లీ సో చేతిలో సంచలన ఓటమితో టోర్నమెంట్‌లో అతని కష్టాలు మరింత పెరిగాయి. మ్యాచ్‌లో 39 ఎత్తుగడల తర్వాత చివరికి రాజీనామా చేశాడు. గుకేష్ ఇప్పుడు ఏడు రౌండ్లలో కేవలం 3 పాయింట్లతో స్టాండింగ్స్‌లో ఎనిమిదో స్థానంలో ఉన్నాడు. అతను టోర్నమెంట్‌లో 4 డ్రాలు, ఒక విజయం, 2 ఓటములతో ఉన్నాడు. ఇక మరో మ్యాచ్‌లో భారత ఆటగాడు ప్రజ్ఞానంద రమేష్‌బాబు అలిరేజా ఫిరోజ్జాను ఓడించాడు. ఏడో రౌండ్‌లో ఫ్రెంచ్ గ్రాండ్‌మాస్టర్‌పై, నల్లటి పావులతో ఆడుతున్న ప్రజ్ఞానంద సిసిలియన్ రక్షణను ఉపయోగించాడు. ప్రజ్ఞానంద ఓపెనింగ్ నుంచే కొంచెం మెరుగైన స్థానాన్ని పొందాడు. తదుపరి 19వ ఎత్తుగడతో డిఫైల్‌పై ఫిరోజ్జా నుండి అకాల పాన్ పుష్ అవకాశాన్ని 20 ఏళ్ల ప్రజ్ఞానంద అందిపుచ్చుకున్నాడు. చివరకు 12 ఎత్తుగడల తర్వాత ఫిరోజ్జా రాజీనామా చేయవలసి వచ్చింది. ఈ విజయంతో 2025 సింక్‌ఫీల్డ్ కప్‌లో అజేయంగా నిలిచిన ప్రజ్ఞా 7 పాయింట్లలో 4.5 పాయింట్లు సాధించాడు. రెండు రౌండ్ల ఆట మిగిలి ఉండగా, అతను ఇప్పుడు ఫాబియానో కరువానాతో కలిసి సంయుక్తంగా ఆధిక్యంలో ఉన్నాడు.

# కామన్వెల్త్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లు.. కోయెల్ వరల్డ్ రికార్డ్



**న్యూఢిల్లీ:** కామన్వెల్త్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో కోయెల్ బార్ యూత్ వరల్డ్ రికార్డ్ సృష్టించింది. అహ్మదాబాద్‌లో మంగళవారం జరిగిన యూత్ ఈవెంట్‌లో పోటీ పడుతున్న కోయెల్ మొత్తం 192 కిలోల బరువును ఎత్తి ప్రపంచ రికార్డు సృష్టించి బంగారు పతకాన్ని గెలుచుకుంది. మహిళల 53 కిలోల యువతకు ప్రపంచ ప్రమాణం 188 కిలోలు కాగా, ఈ మార్కును కోయెల్ సులభంగా అధిగమించింది. కోయెల్ క్లీన్ అండ్ జెర్క్‌లో 107 కిలోలు విజయవంతంగా ఎత్తి ప్రపంచ రికార్డును కూడా సృష్టించాడు. దీనికి ప్రపంచ ప్రమాణం 105 కిలోలుగా నిర్ణయించబడింది.





# టి20 క్రికెట్ కెరీర్‌లో నో సెంచరీ

## పరుగుల్లో మాత్రం హీరోస్.. టాప్ 5లో ధోనీ, గంభీర్



**న్యూఢిల్లీ:** టీ20 క్రికెట్ 2003 లో ప్రారంభమై తక్కువ సమయంలోనే ప్రజాదరణ పొందింది. ప్రస్తుతం, ఈ లీగ్‌లు ప్రపంచవ్యాప్తంగా ఆడుతున్నారు. ఒక ఆటగాడు అనేక లీగ్‌లలో ఆడవచ్చు. అందుకే వారికి పరుగులు సాధించడానికి మరియు వికెట్లు తీయడానికి చాలా అవకాశాలు ఉన్నాయి. అయినప్పటికీ, టీ20 లో చాలా మంది గొప్ప ఆటగాళ్ళు తమ మొత్తం కెరీర్‌లో సెంచరీ మాత్రం సాధించలేకపోయారు. అలాంటి టాప్ 5 మంది గొప్ప ఆటగాళ్లలో భారత్ నుండి ఎంఎస్ ధోనీ, గౌతమ్ గంభీర్ ఉన్నారు. పాకిస్తాన్ స్టార్ ఆల్ రౌండర్ షోయబ్ మాలిక్ టీ20 క్రికెట్‌లో గొప్ప ఆటగాళ్లలో ఒకరిగా పరిగణించబడ్డాడు. అతను 557 మ్యాచ్‌ల్లో దాదాపు 36 సగటుతో 13571 పరుగులు చేశాడు. ఇందులో 83 అర్ధ సెంచరీలు ఉన్నాయి కానీ అతను ఒక్క సెంచరీ కూడా చేయలేకపోయాడు. అతని అతిపెద్ద ఇన్నింగ్స్ 95 పరుగులు. ఇంగ్లాండ్ మాజీ కెప్టెన్ ఇయాన్ మోర్గాన్ విధ్వంసక బ్యాటింగ్‌కు పేరుగాంచాడు. వన్డే మ్యాచ్‌లో ఇన్నింగ్స్‌లో అత్యధిక సిక్సర్లు కొట్టిన రికార్డును అతను కలిగి ఉన్నాడు. అయినప్పటికీ, మోర్గాన్ టీ20లో సెంచరీ చేయలేకపోయాడు. అతను 371 మ్యాచ్‌ల్లో 7780 పరుగులు చేశాడు. ఇక భారత జట్టు మాజీ కెప్టెన్, వికెట్ కీపర్ బ్యాట్స్‌మన్ మహేంద్ర సింగ్ ధోని కూడా టీ20లో సెంచరీ చేయలేకపోయాడు. 405 మ్యాచ్‌లు ఆడిన ధోని దాదాపు 38 సగటుతో 7628 పరుగులు చేశాడు. ధోని అతిపెద్ద ఇన్నింగ్స్ 84 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు.

శ్రీలంక దిగ్గజ బ్యాట్స్‌మన్ కుమార్ సంగక్కర కూడా టీ20 క్రికెట్‌లో సెంచరీ చేయలేకపోయాడు. 2004 మరియు 2020 మధ్య ఈ ఫార్మాట్‌లో అతను 267 మ్యాచ్‌లు ఆడాడు. 43 అర్ధ సెంచరీలతో 6937 పరుగులు చేశాడు. అతని అత్యధిక స్కోరు 94 పరుగులు. చివరిగా ప్రస్తుత టీమిండియా ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ తన కెరీర్‌లో ఎప్పుడూ టాప్ ఆర్డర్‌లో బ్యాటింగ్ చేశాడు. అతను తన టీ20 కెరీర్‌లో 251 మ్యాచ్‌లు ఆడి 6402 పరుగులు చేశాడు. అతను 53 హాఫ్ సెంచరీ ఇన్నింగ్స్‌లు చేశాడు కానీ ఒక్క మూడంకెల స్కోరు కూడా చేరుకోలేకపోయాడు.




# యూఎస్ ఓపెన్‌లో.. అల్కరాజ్ శుభారంభం..

**న్యూఢిల్లీ:** ప్రతిష్టాత్మక టెన్నిస్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ యూఎస్ ఓపెన్ 2025లో రెండో సీడ్, స్పెయిన్ స్టార్ కార్లోస్ అల్కరాజ్ శుభారంభం చేశాడు. మంగళవారం జరిగిన పురుషుల సింగిల్స్ మ్యాచ్‌లో అల్కరాజ్ 6-4, 7-5, 6-4 తేడాతో అమెరికా ప్లేయర్ రీల్లీ ఓపెల్కాను ఓడించి రెండో రౌండ్‌కు దూసుకెళ్లాడు. రెండు గంటల ఐదు నిమిషాల పాటు సాగిన ఈ మ్యాచ్‌లో అల్కరాజ్ అసాధారణ ప్రదర్శన కనబర్చాడు. 14 ఏస్‌లు కొట్టడంతో పాటు 6 డబుల్ ఫాల్ట్స్ చేశాడు. 32 అనవసర తప్పిదాలు చేసినప్పటికీ తను అనుభవాన్ని ఉపయోగించి అల్కరాజ్ విజయం సాధించాడు. బుధవారం జరిగే రెండో రౌండ్‌లో అల్కరాజ్.. ఇటాలియన్ టెన్నిస్ ప్లేయర్ మట్టియా బెల్లుసితో తలపడనున్నాడు. ఇతర మ్యాచ్‌ల్లో బ్రిటన్‌కు చెందిన ఐదో సీడ్ జాక్ డ్రేపర్ 6-4, 7-5, 6-7(7), 6-2తో అర్జెంటీనా క్వాలిఫైయర్ ఫెడెరికో అగస్టిన్ గోమెజ్‌పై విజయం సాధించాడు. నార్వేకు చెందిన 12వ సీడ్ కాస్పర్ రూడ్ 6-1, 6-2, 7-6(5) తేడాతో ఆస్ట్రియాకు చెందిన సెబాస్టియన్ ఆఫ్నర్‌ను ఓడించాడు. ఇక మహిళ సింగిల్స్‌లో సంచలన ఫలితం నమోదైంది. స్టార్ ప్లేయర్ వీనస్ విలియమ్స్ తొలి రౌండ్‌లోనే ఇంటిదారి పట్టింది. చెక్ రిపబ్లిక్‌కు చెందిన కరోలినా ముచోవా చేతిలో 6-3, 2-6, 6-1 తేడాతో ఓటమిపాలైంది. కజకిస్తాన్‌కు చెందిన తొమ్మిదో సీడ్ ఎలెనా రిబాకినా 6-3, 6-0 తేడాతో అమెరికా ప్లేయర్ జులియెటా పరేజాను ఓడించి రెండో రౌండ్‌లోకి సులువుగా ప్రవేశించింది. రెండుసార్లు గ్రాండ్ స్లామ్ ఛాంపియన్ బార్బోరా క్రెజిసికోవా 6-3, 6-2 తేడాతో కెనడియన్ ఓపెన్ విజేత విక్టోరియా ఎంబోకోను ఓడించింది.

# గ్లోబల్ ఇవి గేమ్‌లోకి భారత్ ఎంట్రీ

## మోడీ చేతుల మీదుగా మారుతీ సుజుకీ ఇవి ప్రారంభం




**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు26:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మంగళవారం గుజరాత్‌లోని హన్సల్‌పూర్‌లో రెండు కీలక ప్రాజెక్టులకు అంకురార్పణ చేశారు. మారుతీ సుజుకీ మోటార్ ప్లాంట్‌లో మొట్టమొదటి గ్లోబల్ స్ట్రాటజిక్ బ్యాటరీ ఎలక్ట్రిక్ వాహనం (బిఈవి) ఇ-విటారాతో పాటు కొత్త హైబ్రిడ్ బ్యాటరీ ఎలక్ట్రోడ్ ఉత్పత్తి చేసే ప్లాంటును ప్రధాని జెండా ఊపి ఆరంభించారు. ఇవిటారా భారతదేశంలో పూర్తి స్థాయిలో తయారుచేసిన తొలి ఎలక్ట్రిక్ కారు. 100 కంటే ఎక్కువ దేశాలకు రవాణా చేయాలనే లక్ష్యంతో ఈ ప్లాంట్ మొదలైంది. క్లీన్ ఎనర్జీ తయారీ, గ్రీన్ మొబిలిటీకి ప్రపంచ కేంద్రంగా మారాలనే భారతదేశం ఆశయంలో ఇదొక కీలక ముందడుగు. ఈ కార్యక్రమానికి గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్, జపాన్ రాయబారి కీచీ ఒనో కూడా హాజరయ్యారు. అహ్మదాబాద్‌లోని హన్సల్‌పూర్‌లో సుజుకీ మోటార్ ప్లాంట్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సుజుకీ తయారుచేసిన మొట్టమొదటి బ్యాటరీ ఎలక్ట్రిక్ వాహనం అయిన(బిఈవి) అయిన ఇ-విటారాజును ప్రారంభించారు. భారతదేశంలో అతిపెద్ద కార్ల తయారీ సంస్థ మారుతి సుజుకీ జనవరి 2025లో జరిగిన ఇండియా మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పోలో ఇవిటారాను ప్రదర్శించింది. పూర్తి స్థాయిలో ఇండియాలో తయారైన ఈ ఈవీ కారును జపాన్, యూరోపియన్ మార్కెట్లతో సహా 100 కంటే ఎక్కువ దేశాలకు ఎగుమతి చేసే దిశగా ప్రణాళికలు సిద్ధమయ్యాయి. ఎలక్ట్రిక్ వాహనాల ఎగుమతి ప్రారంభంతో పాటు డెన్సో, తోషిబా, సుజుకీల జాయింట్ వెంచర్ అయిన టిడిఎస్ లిథియం-అయాన్ బ్యాటరీ ప్లాంట్‌లో హైబ్రిడ్ బ్యాటరీ ఎలక్ట్రోడ్‌ల స్థానిక ఉత్పత్తిని ప్రధాని మోదీ ఆరంభించారు. ఇందువల్ల 80 శాతం హైబ్రిడ్ బ్యాటరీ ఎలక్ట్రోడ్స్ భాగాలు స్వదేశంలోనే ఉత్పత్తి అవుతాయి. ఇది దేశంలో నిజు బ్యాటరీ ఉత్పత్తిని పెంచేందుకు దోహదపడుతుంది. తద్వారా భారత్ దిగుమతి కోసం ఇతర దేశాలపై ఆధారపడాల్సిన అవసరం తగ్గుతుంది. మారుతీ సుజుకీ తన తొలి ఎలక్ట్రిక్ కారును 2025 జనవరిలో ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. ఈ కారు రెండు బ్యాటరీ వేరియంట్లలో లభ్యం అవుతుంది. 49 కెడబ్ల్యుహెచ్ బ్యాటరీ 144 హెచ్‌పి శక్తిని,189 ఎన్ఎం టార్క్ ఉత్పత్తి చేస్తుంది. అలాగే 61 కెడబ్ల్యుహెచ్ బ్యాటరీ 174బిహెచ్‌పి శక్తిని, 189 ఎన్ఎం టార్క్ ఉత్పత్తి చేస్తుంది. ఈ భారీ బ్యాటరీ వేరియంట్ సుమారు 500 కి.మీ. పైగా రేంజ్ కలిగి ఉందని కంపెనీ వెల్లడించింది. మారుతీ సుజుకీ ఇ-విటారా ఉత్పత్తికి రూ. 2,100 కోట్లు ఖర్చు చేసింది. ఈ కారును 100 దేశాలకు ఎగుమతి చేయడం ద్వారా భారతదేశాన్ని గ్లోబల్ ప్రొడక్షన్ హబ్‌గా అభివృద్ధి చేస్తామని సుజుకీ మోటార్ కార్పొరేషన్ అధ్యక్షుడు తోషిహిరో సుజుకీ గతంలో పేర్కొన్నారు.

ఈవీ వినియోగాన్ని మెరుగుపరిచే దిశగా, మారుతీ సుజుకీ మొదటి దశలో 100 నగరాల్లో ఫాస్ట్ ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయనుంది. అదేవిధంగా, ఈ కార్లు కొనుగోలు చేసే వినియోగదారులకు స్మార్ట్ హోమ్ ఛార్జర్, ఇన్‌స్టాలేషన్ సపోర్ట్ కూడా అందించనున్నారు. ప్రతి 5-10 కిలోమీటర్లకు ఛార్జింగ్ స్టేషన్ ఉండేలా మారుతీ సుజుకీ ప్రణాళికలు సిద్ధం చేసింది

# ట్రంప్ టారిఫ్ ఆందోళనలు.. భారీ నష్టాల్లో స్టాక్ మార్కెట్లు



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు26:** దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం భారీ నష్టాల్లో ముగిశాయి. భారత్ ఎగుమతి చేసే వస్తువులపై అమెరికా అదనపు సుంకాలు బుధవారం నుంచి అమలు కానున్నాయి. ఇప్పటికే 25శాతం సుంకాలు అమలులోకి వచ్చిన విషయం తెలిసిందే. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నందుకు అదనంగా 25శాతం సుంకాలు విధించగా.. బుధవారం (ఆగస్టు 27 నుంచి ) 50శాతానికి చేరనున్నాయి. ఈ క్రమంలో సుంకాల ఆందోళనల నేపథ్యంలో మార్కెట్లు ఒక శాతానికిపైగా పడిపోయాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్.. 81,377.39 వద్ద నష్టాల్లో మొదలైంది. సుంకాల ఆందోళన నేపథ్యంలో మదుపరులు అప్రమత్తంగా వ్యవహరించారు. ఇంట్రాడేలో 81,450.28 పాయింట్ల గరిష్టాన్ని నమోదు చేసిన సెన్సెక్స్.. అత్యల్పంగా 80,685.98 పాయింట్లకు పడిపోయింది. చివరకు 849.37 పాయింట్ల నష్టంతో 80,786.54 వద్ద ముగిసింది. ఇక నిఫ్టీ సైతం 255.70 పాయింట్లు తగ్గి 24,712.05 వద్ద స్థిరపడింది. యూఎస్ డాలర్‌తో పోలిస్తే రూపాయి 13 పైసలు తగ్గి 87.69 వద్ద ముగిసింది. మార్కెట్లు దాదాపు 1,167 షేర్లు లాభపడగా.. 2,751 షేర్లు పతనమయ్యాయి. నిఫ్టీలో శ్రీరామ్ ఫైనాన్స్, సన్ ఫార్మా, టాటా స్టీల్, బజాజ్ ఫైనాన్స్, ట్రెంట్ నష్టపోగా.. ఐషర్ మోటార్స్, హెచ్‌యూఎల్, మారుతి సుజుకి, నెస్లే ఇండియా, ఐటీసీ లాభాల్లో ముగిశాయి. ఎఫ్ఎంసీజీ మినహా మిగతా అన్నిరంగాల సూచీలు నష్టాల్లో ముగిశాయి. పీఎస్‌యూ బ్యాంక్, మెటల్, ఫార్మా, ఆయిల్ అండ్ గ్యాస్, కన్స్యూమర్ డ్యూరబుల్స్, రియాల్టీ, టెలికాం ఒకటి నుంచి రెండుశాతం వరకు తగ్గాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ 1.3శాతం, స్మాల్ క్యాప్ ఇండెక్స్ 1.7 శాతం తగ్గాయి.




Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at Plot Nos. 56&58, 9th line, Ramnagar, Ongole - 523001, ph: 2312451, Fax: 08592-236879, RNI No, 64847/96, Editor.Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act, Regd. No.H/SD/337/12-14 Air Surcharge:Delhi:40 Ps